ప్రతి అక్షరం ప్రజల కోసం
www.prajapaksham.in
# ప్రజాపక్షం
PRAJAPAKSHAM ★
8th ANNIVERSARY 22nd October, 2026
సంపుటి 09, సంచిక: 317 | శనివారం | 17-10-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

బిజెపితో పొత్తుపై పునరాలోచించాలి
ఎముకలు విరగ్గొట్టగలరు.. సత్యాగ్రహాన్ని కాదు
భర్తను హతమార్చి పాముకాటుగా చిత్రీకరించిన భార్య, ప్రియుడికి మరణశిక్ష! 07






## ‘లెహ్రా దో తిరంగా’
# నిరసనలు ఉద్రిక్తం

- జాతీయ జెండాలు చేబూని ఆకస్మిక ఆందోళనలు
- జైహింద్ నినాదాలతో మార్మోగిన ఢిల్లీ వీధులు
- పోలీసు వలయాన్ని ఛేదించుకొని కన్నాట్ ప్లేస్‌కు జాతీయ జెండాలతో ప్రదర్శనగా వెళ్లిన ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ కార్యకర్తలు, వామపక్ష ఎంపిలు
- కన్నాట్ ప్లేస్‌కు వెళ్తుండగా అభిజీత్ దీప్కే అరెస్ట్
- మండీ హౌస్ వద్ద నేహా బోరా దిగ్బంధనం
- పోలీసులు, నిరసనకారులకు మధ్య వాగ్వాదం, తోపులాట

**న్యూఢిల్లీ :** కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ‘లెహ్రా దో తిరంగా’ నిరసనలకు పిలుపునిచ్చిన వేళ శుక్రవారం దేశ రాజధాని ఢిల్లీలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నిరసనల్లో పాల్గొనేందుకు వెళ్తున్న సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, ఐసా అధినేత్రి నేహా బోరాలను ఢిల్లీ పోలీసులు ముందుజాగ్రత్తగా అదుపులోకి తీసుకున్నారు. ఝుండేవలన్‌లోని ఆయన నివాసం నుంచి కన్నాట్ ప్లేస్‌కు వెళ్తుండగా దీప్కేను, మండి హౌస్‌కు వద్ద నేహా బోరాను అదుపులోకి తీసుకున్నారు. వీరితో పాటు మరో 150 మంది నిసనకారును ఢిలీ పోలీససులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వాహనాన్ని ముందుకు వెళ్లనివ్వకుండా నిరసనకారులు చుట్టుముట్టారు. కాగా, పోలీసుల వలయాన్ని చేధించుకొని కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్ ఇన్నర్ సర్కిల్‌కుఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ కార్యకర్తలు, వామపక్ష తరువాయి 8లో

### డీలిమిటేషన్, మహిళా కోటా బిల్లులపై
# పార్లమెంట్ ప్రత్యేక భేటీ!



ఈ నెల చివరిలో నిర్వహించనున్నట్లు సమాచారం

**న్యూఢిల్లీ :** ‘సర్’, సిఇసి జ్ఞానేశ్ కుమార్‌లకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో నిరసనలు తెలుపుతుండగా, డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లులను మరోసారి ప్రవేశపెట్టేందుకు కేంద్రం ఈ నెల చివరలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉంది. సభలో తమకు తగినంత సంఖ్యాబలం ఉందని ప్రభుత్వం ధీమాగా ఉందని, అందుకే ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉందని వర్గాలు తెలిపాయి. ఏప్రిల్ 17న జరిగిన బడ్జెట్ సమావేశాల్లో, లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలలో మహిళా రిజర్వేషన్ల అమలు కోసం ఉద్దేశించిన డీలిమిటేషన్‌కు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభ సభలో ఓడిపోవడంతో మోదీ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. అయితే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌తో విడిపోయిన ద్రవిడ పార్టీ అయిన డిఎంకె మద్దతును కూడగట్టడానికి కేంద్ర ప్రభుత్వం ఆ పార్టీతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. డీలిమిటేషన్‌ను తీవ్రంగా వ్యతిరేకించిన పార్టీలలో ఒకటైన టిఎంకె, ఆ తర్వాత ఇండియా కూటమి నుంచి బయటకు వచ్చింది. తమ సంఖ్యాబలాన్ని పెంచుకోవడానికి ప్రభుత్వం కొన్ని చిన్న పార్టీలతో కూడా సంప్రదింపులు జరుపుతోందని వర్గాలు తెలిపాయి. ఈనెల 26, 27 తేదీలలో ‘సంవిధాన్ సదన్’ (పార్లమెంట్ భవనం)లో జరగనున్న 12వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరమ్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక సమావేశపు తేదీలను నిర్ణయించనున్నట్లు తెలిసింది. వర్గాల సమాచారం ప్రకారం, సమావేశాన్ని ఏర్పాటు చేయడానికి ఒక వారం ముందుగా నోటీసు ఇవ్వనున్నారు. నీట్ పేపర్ లీక్‌పై ప్రతిపక్షాల నిరసన, విద్యార్థుల ఆందోళనపై అణచివేత నేపథ్యంలో వర్షాకాల సమావేశాల్లో బిల్లులను తిరిగి తీసుకురావాలన్న కేంద్రం ప్రయత్నాలు నీరుగారిపోయాయి. ఆగస్టు 13న ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు అధికారికంగా ఇంకా వాయిదా పడకపోవడం గమనార్హం.

**మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరం**

రాజ్యాంగ సవరణకు పార్లమెంట్‌లో ప్రత్యేక మెజారిటీ అవసరం. ఉభయ సభలలో హాజరై ఓటు వేసే సభ్యులలో మూడింట రెండు వంతుల మెజారిటీ ఉండాలి. ప్రస్తుత సభలో ఎన్‌డిఎకు మెజారిటీ ఉన్నప్పటికీ, సుమారు 360 సీట్లకు తరువాయి 8లో

### డీలిమిటేషన్ ప్రతిపాదనలపై
# అఖిలపక్షం ఏర్పాటు చేయాలి

- రాజ్యాంగ సవరణ బిల్లు బలవంతంగా ఆమోదింపజేసే ప్రయత్నాలకు పాల్పడవద్దు : మల్లికార్జున ఖర్గే



**న్యూఢిల్లీ :** వర్షాకాల సమావేశాలను ప్రొరోగ్ వేయడంలో అపూర్వమైన జాప్యం జరుగుతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. నియోజకవర్గాల పునర్విభజనపై ఏవైనా కొత్త ప్రతిపాదనలను చర్చించడానికి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. అలాగే, ‘సుదూర ప్రభావం చూపే’ రాజ్యాంగ సవరణ బిల్లును బలవంతంగా ఆమోదింపజేసే ఎలాంటి ప్రయత్నాలకూ పాల్పడవద్దని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు ఖర్గే మోదీకి తరువాయి 8లో

### కార్ల తయారీకి అనువుగా
# రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం

- హైదరాబాద్‌లో హ్యుందాయ్ ప్లాంట్ ఏర్పాటు చేయండి
- సంస్థ యాజమాన్యానికి తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి పిలుపు
- జహీరాబాద్‌లో రూ.8,528 కోట్లతో గ్లోబల్ పరిశోధన, అభివృద్ధి కేంద్రం త్వరలోనే శంకుస్థాపన
- పెండింగ్ అనుమతులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణను కార్ల తయారీకి అనువైన ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో హ్యుందాయ్ కార్ల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని ఆ సంస్థ యాజమాన్యాన్ని కోరారు. రాష్ట్రంలో తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. జహీరాబాద్‌లో ఏర్పాటు తరువాయి 8లో

### మూడు నెలల్లో రోహిత్ వేముల
# తెలంగాణ బిల్లు ముసాయిదా

- సిద్ధం చేయాలని అధికారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలు
- షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు
- న్యాయ, విద్యా, హోంశాఖలు, యుజిసి భాగస్వామ్యంతో కసరత్తు
- సచివాలయంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ సమావేశం



ప్రజాపక్షం/హైదరాబాద్

విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యా సంస్థల్లో విద్యార్థుల హక్కులను పరిరక్షిస్తూ, కులం, సామాజిక నేపథ్యం ఆధారంగా వివక్షకు తావు లేకుండా సమగ్ర చట్టాన్ని రూపొందించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతిపాదిత ‘రోహిత్ వేముల తెలంగాణ బిల్లు’కు సంబంధించిన ప్రాథమిక ముసాయిదాను మూడు నెల్లోగా సిద్ధం చేసి సీనియర్ సివిల్ సర్వెంట్ల కమిటీ (సిఎస్‌సి) కి సమర్పించాలని స్పష్టం చేశారు. కమిటీ ఏర్పాటు నుంచి వివిధ భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపుల వరకు ప్రతి దశను నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేయాలని, ఎలాంటి జాప్యానికి తావివ్వరాదని సూచించారు. తెలంగాణ సచివాలయంలో శుక్రవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన రోహిత్ వేముల తెలంగాణ బిల్లుపై మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ప్రతిపాదిత బిల్లు రూపకల్పనకు అనుసరించాల్సిన విధానం, కమిటీ కూర్పు, న్యాయపరమైన అంశాలు, వివిధ తరువాయి 8లో



# రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లిస్తాం

- అవసరమైతే ఆర్‌టిసి భూముల విక్రయానికి చర్యలు తీసుకుంటాం
- సంస్థ కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యాలే ప్రధాన లక్ష్యం
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి
- గుర్తింపు సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన జెఎసి కూటమికి అభినందనలు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఆర్‌టిసి కార్మికుల సంక్షేమం, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పన, సంస్థ అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల చెల్లింపునకు అవసరమైతే సంస్థకు చెందిన విలువైన భూములను విక్రయించైనా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇటీవల ఆర్‌టిసి కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల్లో విజయం సాధించిన ఎంప్లాయిస్ యూనియన్(ఇయు) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాబు, కార్యదర్శి ఈదురు వెంకన్న, టిఎంయు రాష్ట్ర కార్యదర్శి ఎస్.థామస్‌రెడ్డి, ఎన్ఎంయు రాష్ట్ర కార్యదర్శి ఎండి.మౌలానాతో పాటు పలువులు జెఎసి కూటమి ప్రతినిధులు శుక్రవారం మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయం సాధించిన నాయకులను మంత్రి అభినందించి సత్కరించారు. కార్మికుల సమస్యలను తొందరపాటు నిర్ణయాలతో కాకుండా నిర్మాణాత్మకంగా పరిష్కరిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఆర్‌టిసి విలీన ప్రక్రియకు సంబంధించి అధికారులు, తరువాయి 8లో

### సాగుపై ఎల్ నినో
# సమ్మెట పోటు

- సహకరించని ప్రకృతి – గిట్టుబాటు కాని ధరలు – పట్టించుకోని పాలకులు
- సంక్షోభంలో వ్యవసాయరంగం
- అప్పుల ఊబిలోకి రైతన్న
- యాసంగిలో వరి వద్దంటున్న ప్రభుత్వం



ప్రజాపక్షం/ ఖమ్మం :

వ్యవసాయ రంగం రోజు రోజుకు సంక్షోభంలోకి కూరుకుపోతుంది. గిట్టుబాటు కానీ ధరలు, సహకరించని ప్రకృతి, పట్టించుకోని పాలకుల మధ్య కునారిల్లుతున్న సాగుపై ఎల్‌నినో పేరుతో సమ్మెట పోటు పడింది. ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రాజెక్టులు వట్టిపోతుండగా భూగర్భ జల నీటి మట్టం రోజు రోజుకు అడుగంటిపోతున్నాయి. జూన్, జులై మాసాల్లో బోరులో ఉన్న నీటిని చూసుకుని సాగు చేసిన రైతులు బోర్లలోని నీరు అడుగంటిపోవడంతో పైరుల్లో పశువులను మేపుతున్నారు. రాష్ట్ర సగటు వర్షపాతం 20



నుంచి 25 శాతానికి తగ్గగా కొన్ని జిల్లాల్లో ఈ పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. జీవనదుల్లాంటి అనేక నదులు ఎడారులను తలపిస్తున్నాయి. కేవలం 25 నుంచి 30 శాతం కొన్ని జిల్లాల్లో 40 శాతం మాత్రమే వరి సాగు చేశారు. ఇప్పుడు అది కూడా చేతికొచ్చే పరిస్థితి లేదు. బోర్లలో నీరు ఇంకిపోయి ఒక ఇబ్బంది అయితే ఉన్న నీరు తోడుకునేందుకు విద్యుత్ సరఫరా లేక మరో పక్క ఇబ్బందులు పడుతున్నారు. ఇక ఎల్ నినో కారణంగా వాతావరణంలో వచ్చిన మార్పులు పంటలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అప్పుడప్పుడు కురిసిన వర్షాలతో తొలి దశలో పత్తి దిగుబడిపై రైతులు ఆశలు పెంచుకున్నారు. కానీ అధిక ఉష్ణోగ్రతలు, అననుకూల వాతావరణం నడుమ చూస్తుండగానే పత్తిచేలు ఎర్రబారి ఆకులు రాల్చేశాయి. గతేడాదితో పోల్చినప్పుడు ఈ ఏడాది సగం దిగుబడులు కూడా రాలేదని రైతులు తరువాయి 8లో



### సింగరేణి కుంభకోణంపై
# సిట్టింగ్ జడ్జితో విచారణ

బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్

సింగరేణి కుంభకోణం , ప్రతిపాదిత విదేశీ బొగ్గు కొనుగోళ్ల అంశంపైన సిట్టింగ్ జడ్జి విచారణ చేపట్టాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. సిఎం బామ్మర్ది సింగరేణిలో కొల్లగొట్టిన 10వేల కోట్ల కుంభకోణం అంశంపైన కూడా విచారణ చేపట్టాలని సూచించారు. సింగరేణిలో జరిగిన సోలార్ పవర్ కుంభకోణాన్ని భయటపెడుతామన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం బిఆర్‌ఎస్ నర్సంపేట నియోజర్గ సమావేశంలో కెటిఅర్ మాట్లాడుతూ సింగరేణి నిండా కుంభకోణాలు ఉన్నాయని, కాంగ్రెస్ చేసిన తరువాయి 8లో

## పశ్చిమ బెంగాల్‌లో దుర్గా పూజ–రాజకీయాలు

పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో దసరా సందర్భంగా దుర్గా పూజ అతిపెద్ద పండుగ. ఒకనాడు జమీందార్లు, పెద్దపెద్ద వ్యాపారుల ప్రాసాదాల్లో జరిగే ఉత్సవాలు కాలక్రమంలో రాజకీయాలకనుగుణంగా అధికారంలో ఉన్న పార్టీ అధిపత్యంలోకి వెళ్లిపోయాయి. మూడు దశాబ్దాల వామపక్ష సంఘటన పరిపాలన కాలంలో కూడా పాలక పార్టీ నేతలు ప్రత్యక్షంగా ఉత్సవాల నిర్వహణలో పాల్గొనకపోయినా, ఆ ప్రజా ఉత్సవంలో వారి అనుయాయులు నిర్వాహకులుగా దాన్ని విజయవంతం చేసేవారు. తృణమూల్ కాంగ్రెస్ 15 సంవత్సరాల పరిపాలనలో ఉత్సవాలను తన ఆధీనంలోకి తీసుకుంది. ఈ సంవత్సరం మే నెలలో రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. నగరంలోని కొన్ని అతిపెద్ద సాముదాయక పూజ మండపాల పోషకులు మారిపోయారు. ప్రజలతో దగ్గరి సంబంధానికి ఇంతకుమించిన అవకాశం రాదు కదా! 2026 అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ ఓటమి దరిమిలా పార్టీ చీలిపోయినందున రాష్ట్రమంతటా పూజా మంటపాల్లో గత తృణమూల్ అర్గనైజర్లను తొలగించి పాలక బిజెపి వారు వాటిని స్వాధీనం చేసుకున్నారు. బెంగాల్‌లో ఈ అతిపెద్ద హిందూ పండుగ నిర్వహణను తమ చేతిలోకి తీసుకోవటం తమ హక్కుగా బిజెపి భావించింది. ఏమాత్రం ప్రతిఘటన ఎదురుకాలేదు. మమతా బెనర్జీ తృణమూల్ కాంగ్రెస్ పెద్ద నాయకులు చాలా మంది రాష్ట్రం వదిలివెళ్లారు. ఇప్పుడు ఎటు చూసినా బిజెపియే.

భిన్న మతాలకు, సంస్కృతులు, ఆచార వ్యవహారాలకు నిలయమైన, భిన్నత్వంలో ఏకత్వంతో భాసిల్లుతున్న భారతదేశంలో ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కో పండుగ పెద్ద ఎత్తున పాటిస్తుంటారు. ఉదాహరణకు మన తెలంగాణకు బతుకమ్మ ప్రత్యేకం. మరికొన్ని రాష్ట్రాలు కొన్నింటిలో దసరా, మరికొన్నింటిలో దీపావళి, హిందీ రాష్ట్రాల్లో ఈ పండుగలతోపాటు ఛాత్–ఇలా ఎవరి వేడుక వారిది. ముస్లింలు, క్రైస్తవులు, పార్శీలు, కొన్ని ఆదివాసీ జాతులు వారి పండుగలను వేడుకగా జరుపుకుంటారు. ఇక హిందువుల పెద్ద ఉత్సవాల్లో వినాయకచవితి దానికదే సాటి. తర్వాత అంతటి ప్రాముఖ్యతగలది దుర్గా పూజ– వీటన్నింటి సమాహారమే భారతీయ సంస్కృతీ విశిష్టత.

ప్రస్తుత దసరా ఉత్సవాలకు తలమానికమైన దుర్గాపూజను పశ్చిమ బెంగాల్‌లో ఊరురా వాడవాడలా పెద్ద పండుగగా విరివిగా జరుపుకుంటారు. ఒకనాడు, బ్రిటిష్‌వారి ఈస్ట్ ఇండియా కంపెనీ సేవలో తరించి లబ్ధి పొందిన జమిందార్లు, బడా వ్యాపారుల పూర్వీకుల లోగిళ్లలో పెద్ద ఎత్తున జరిపేవారు. తెల్లదొరల నుంచి లబ్ధి పొందడానికి ఈ ఉత్సవాన్ని ఉపయోగించుకునేవారు. కలకత్తా ఉత్తర, మధ్య ప్రాంతాల్లో నివసించే ధనికులు, ప్రముఖులు దుర్గా పూజను కడువేడుకగా జరపడంలో పోటీపడేవారట. పదవుల్లో ఉన్న ఇంగ్లీషు వారిని ఆహ్వానించడంలో కూడా పోటీ ఉండేదట. రాబర్ట్ క్లైవ్, వార్రెన్ హేస్టింగ్స్‌ను తమ సోమబజాబ్ ప్రాసాదానికి రప్పించిన ఘనత జమీందారు నాబకృష్ణదేవ్‌కు దక్కింది. ప్లాసీ యుద్ధంలో విజయం పొందటంలో బ్రిటిష్‌వారికి వెన్నుదన్నుగా నిలబడి ఆయన పేరు ప్రఖ్యాతి పొందారు. (నవాబు ఆఫ్ బెంగాల్ సిరాజ్–ఉద్–దౌలా, ఆయన ఫ్రెంచి మిత్రులతో ప్లాసీ వద్ద రాబర్ట్ క్లైవ్ నాయకత్వంలో జరిగిన యుద్ధంలో బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ 1757 జూన్ 23న విజయం సాధించింది. తదుపరి 100 సంవత్సరాల్లో తెల్లదొరలు భారత ఉపఖండంలోని మిగతా ప్రాంతాలకు, బర్మాకు విస్తరించారు). నాబకృష్ణదేవ్ కుటుంబం పాలకులకు అణిగిమణిగే ఉండే సాంప్రదాయం–మరో వందేళ్లు తదుపరి కూడా కొనసాగింది. 1857లో తొలి స్వాతంత్ర్య పోరాటంలో భారత సైనికులను అణిచివేసి ఇంగ్లీషువారు విజయం సాధించిన ఉత్సవం కూడా ఆ ప్రాసాదంలో జరిపారు.

కాలం గడిచింది. స్వాతంత్ర్య పోరాటం ఉధృతం కావటంతో రాజకీయ నాయకులు ఈ ఉత్సవాల్లో ప్రవేశించారు. సుభాష్ చంద్రబోస్–నేతాజీ కాక పూర్వం సిమ్లా బాయం శానిటీస్ కమ్యూనిటీ దుర్గా పూజలో పాల్గొన్నారు. కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చిన బోస్ ఫార్వర్డ్ బ్లాక్ ఏర్పాటు చేశారు. కాళీ ఘాట్ ఫైర్ స్టేషన్ సమీపంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో ఇప్పటికీ పెద్ద ఎత్తున కమ్యూనిటీ పూజ జరుగుతుంది. 1972–77 మధ్య కాంగ్రెస్ ప్రభుత్వంలో యువ మంత్రి సుబ్రతా ముఖర్జీ గరియాహాట్ జంక్షన్ ఉత్సవం నిర్వహించారు. లెఫ్ట్ ఫ్రంట్, తృణమూల్ ప్రభుత్వాల కాలంలోనూ– ఆయన మరణం వరకు ఆ పూజకు ప్రేరణగా ఉన్నారు. లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వ భావజాలంతో ఈ పూజలు పొసగనివి అయినా శ్రీభూమి స్పోర్టింగ్ క్లబ్‌లో పూజలో పాల్గొనేందుకు క్రీడలు, యువజన వ్యవహారాల మంత్రి సుభాష్ చక్రవర్తిని సిపిఐ(ఎం) అనుమతించింది. నాస్తిక కామ్రేడ్స్ పూజలో పాల్గొనకపోయినా, పూజ పెండాల్స్ సమీపంలో స్టాల్స్ ఏర్పాటు చేసి పార్టీ సాహిత్యం, మున్షీ ప్రేమ్‌చంద్, లెనిన్ రచనలు అమ్మేవారు. ఈ సంవత్సరం సిపిఐ(ఎం) స్టాల్‌కు బిజెపి ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడంతో వారు హైకోర్టుకు వెళ్లి అనుమతి పొందారు. పండుగలు, ప్రజా ఉత్సవాల్లో ప్రజలకు సేవా కార్యక్రమాలు నిర్వహించటం, సాహిత్యం విక్రయించడం కమ్యూనిస్టుల సాంప్రదాయం. ఇప్పుడు మరుగున పడిన ఈ సాంప్రదాయాన్ని పునరుద్ధరించడం అవసరం. కమ్యూనిస్టులు ఎప్పుడూ నీటిలో చేపలా ప్రజల మధ్య ఉండాలి. ఆధ్యాత్మికవాదం వేళ్లూని ఉన్న మనదేశంలో పండుగలు, మత ఉత్సవాలు పెద్ద ఎత్తున ప్రజలు సమీకరించబడే సందర్భాలు. ప్రజల్లో హేతువాదదృక్పథం పెంపొందించేందుకు సిద్ధాంతరీత్యా, ప్రచారం ద్వారా కృషి చేస్తూనే సామూహిక, సాముదాయక కార్యక్రమాల్లో ప్రజల మధ్య ఉండటం ప్రజాసంబంధాలను పెంపొందిస్తుంది. ●



### బిజెపి ప్రభుత్వానికి వేరే మార్గం లేదు

**అభిజీత్ దీప్కే , నేహా బోరా ఎక్కడ ఉన్నారు? వారిని ఎక్కడ ఉంచారో వెల్లడించకుండా నిర్బంధించడం పూర్తిగా చట్టవిరుద్ధం, అత్యంత అమానవీయం. కేంద్ర ప్రభుత్వం వారిని వెంటనే విడుదల చేయాలి, శాంతియుత నిరసనలను అణచివేయడం ఆపాలి. ఈ ఉద్యమాన్ని అణచివేయడానికి చేసే ప్రతి ప్రయత్నం, దానిని మరింత బలపడేలా మాత్రమే చేస్తుంది. జ్ఞానేశ్ కుమార్ దిగిపోవాల్సిందే. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి వేరే మార్గం లేదు.**

– ఎం.కె.స్టాలిన్, డిఎంకె అధినేత ●

## ప్రమాదాల నివారణే ప్రాణ రక్షణకు మార్గం

ప్రాణం అమూల్యమైనది. ప్రతి మనిషి జీవితానికి, ప్రతి కుటుంబం భవిష్యత్తుకు ఎంతో విలువ ఉంది. కానీ రోడ్డు ప్రమాదాలు, పారిశ్రామిక దుర్ఘటనలు, గనుల్లో ప్రమాదాలు, అగ్నిప్రమాదాలు, ఇతర గాయాల కారణంగా అనేక మంది ప్రాణాలు కోల్పోతుండటం, మరికొందరు శాశ్వత వైకల్యానికి గురవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రమాదాల నివారణ, క్షతగాత్రులకు సకాలంలో వైద్యసాయం, ప్రజల్లో భద్రతపై అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని ప్రపంచ ట్రామా దినోత్సవం గుర్తుచేస్తుంది. ప్రతి సంవత్సరం అక్టోబర్ 17న ప్రపంచ ట్రామా దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ట్రామా అంటే ప్రమాదాలు లేదా ఇతర కారణాల వల్ల శరీరానికి కలిగే తీవ్రమైన గాయాలు. వీటిని నివారించడం, ప్రమాద బాధితులకు తక్షణ వైద్యసాయం అందించడం, అత్యవసర చికిత్స వ్యవస్థలను బలోపేతం చేయడం ఈ దినోత్సవ ప్రధాన లక్ష్యాలు. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ప్రచురించిన 2024 నివేదిక ప్రకారం, 2024లో దేశవ్యాప్తంగా 4,87,707 రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయి. ఈ ప్రమాదాల్లో 1,77,175 మంది ప్రాణాలు కోల్పోగా, 4,71,441 మంది గాయపడ్డారు. అంటే రోజుకు సగటున సుమారు 1,336 ప్రమాదాలు, 485 మరణాలు సంభవించాయి. ప్రతి గంటకు సగటున 5ప్రమాదాలు, 20 మరణాలు జరిగాయి. ఇవి కేవలం రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన గణాంకాలు మాత్రమే. జాతీయ రహదారులపై అధిక వేగంతో ప్రయాణించడం, నిర్లక్ష్యంగా ఓవర్టేక్ చేయడం, తప్పు దిశలో వాహనాలు నడపడం, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగం, అలసటతో డ్రైవింగ్ చేయడం వంటి అంశాలు ప్రమాదాలకు దారితీస్తున్నాయి. ప్రమాదకర మలుపులు, రహదారులపై సరైన వెలుతురు లేకపోవడం, స్పష్టమైన హెచ్చరిక బోర్డులు లేకపోవడం, రోడ్డు పక్కన వాహనాలను నిలిపివేయడం కూడా ప్రమాద తీవ్రతను పెంచవచ్చు. అవసరమైన చోట్ల క్రాష్ బ్యారియర్లు, రహదారి గుర్తులు, హెచ్చరిక బోర్డులు, వీధి దీపాలు, సురక్షితమైన పాదచారుల మార్గాలు ఏర్పాటు చేయాలి. వేగ పరిమితులను కచ్చితంగా అమలు చేయడంతో పాటు, అత్యవసర అంబులెన్స్ సేవలు, ట్రామా కేర్ కేంద్రాలను అందుబాటులో ఉంచాలి. రోడ్డు ప్రమాదాలను నివారించడంలో ప్రభుత్వాల చర్యలతో పాటు ప్రజల బాధ్యతాయుత ప్రవర్తన కూడా కీలకం. ద్విచక్ర వాహనదారులు నాణ్యమైన హెల్మెట్ ధరించాలి. కార్లలో ముందు, వెనుక సీట్లలో ప్రయాణించేవారు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలి. మద్యం సేవించి వాహనాలు నడపకూడదు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ ఉపయోగించకూడదు. వేగ పరిమితులు, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. ముఖ్యంగా యువతలో రోడ్డు భద్రతపై అవగాహన పెంచాలి. వేగంగా వాహనం నడపడం గొప్పతనం కాదు; సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవడమే నిజమైన బాధ్యత. ఫార్మా కంపెనీలలో పని చేసే కార్మికులకు ఎక్కువగా రియాక్టర్లు, బాయిలర్స్ ప్రేలడం వలన, నిర్మాణ రంగాల్లో పనిచేసే కార్మికులకు రక్షణ సాధనాలు ఉపయోగించక పోవడం వలన ప్రమాదాలు పెరిగే అవకాశం ఉంది. బొగ్గు గనుల్లో పైకప్పు కూలడం, యంత్రాల వల్ల గాయాలు, విద్యుత్ ప్రమాదాలు, రవాణా సమయంలో జరిగే దుర్ఘటనలను నివారించేందుకు పటిష్ఠమైన భద్రతా చర్యలు అవసరం. కార్మికులకు నాణ్యమైన రక్షణ పరికరాలు అందించడం, భద్రతా నియమాలపై నిరంతర శిక్షణ ఇవ్వడం, యంత్రాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయడం, ప్రమాదకర పరిస్థితులను ముందుగానే గుర్తించడం యాజమాన్యాల బాధ్యత. అత్యవసర పరిస్థితుల్లో స్పందించేందుకు ప్రథమ చికిత్స కేంద్రాలు, శిక్షణ పొందిన సిబ్బంది, అవసరమైన వైద్య పరికరాలు అందుబాటులో ఉండాలి.

**(అక్టోబర్ 17న ప్రపంచ ట్రామా దినోత్సవం సందర్భంగా)**

**– ఆళవందార్ వేణు మాధవ్**

**8686051752**

## ‘దశ–హరా’కు వక్ర భాష్యాలు ఆపండి!



డాక్టర్ దేవరాజు మహారాజు

దశ–హరా = దశరా (దసరా) అంటే పది మంది ఓడిపోయారని అర్థం. హరించుకుపోయారని కూడా చెప్పకోవచ్చు. ఎవరు ఆ పది మందీ? అసలు విషయం చెప్పకుండా దశకంఠుడనే రావణుడు చనిపోయాడు గనుక, ఇది దశహరా అని చెప్తారు. రావణుడు రామాయణంలో ఓ కల్పిత పాత్ర. రాముడు ఎలాగైతే ఓ కల్పిత పాత్రో రావణుడు కూడా అలాగే ఓ కల్పిత పాత్ర. ఒక కావ్యంలో ఒక పాత్ర చనిపోతే పండగలేమిటి? అర్థం లేకుండా? దాని ఆధారంగా రావణుడి ప్రతిమను పెద్ద ఎత్తున తగలబెట్టడం కొందరు చేస్తే, దానికి విరుద్ధంగా రాముడి ప్రతిమను మరి కొందరు తగలబెడుతున్నారు. వీటికి పైగా, రావణ్‌లీలా/రామ్‌లీలా అని పేర్లు పెట్టుకోవడం అవసరమా? భ్రమల్లో బతికే వారికి బాగా ఉంటుందేమో గానీ, వాస్తవాలు తెలుసుకోదలుచుకుంటే అవి వేరే విధంగా ఉంటాయి.

ఈ దేశంలో మౌర్య సామ్రాజ్యాన్ని స్థాపించింది చంద్రగుప్త మౌర్యుడు. ఆయనే ఆ వంశంలో మొదటి రాజు. అలాగే చివరి రాజు బృహదత్తు మౌర్య. వీరి మధ్య మొత్తం పది మంది– మౌర్య సామ్రాజ్యాన్ని పరిపాలించారు. ఇక్కడ చివరి రాజు బృహదత్తుడి దగ్గర మోసపూరితంగా ఒక బ్రాహ్మణుడు సైన్యాధ్యక్షుడయ్యాడు. అతని పేరు పుష్యమిత్ర శృంగుడు. అదను చూసి, పుష్యమిత్రుడు రాజు బృహదత్తు మౌర్యను హత్య చేస్తాడు. దానితో పది తరాలుగా వస్తున్న మౌర్య వంశం– వారి సామ్రాజ్యం పతనమయ్యింది. అసలు దశహరా అంటే ఇది. దీన్ని కప్పిపుచ్చడానికి పదితలలున్న రాక్షస రాజును సృష్టించి కథలు అల్లారు. పది తరాలుగా వస్తున్న మౌర్యవంశం పతనమైందనీ, తమ శృంగుల రాజ్యం స్థాపించబడిందనీ పుష్యమిత్ర శృంగుడు తన బ్రాహ్మణ వర్గీయులతో చేసుకున్న విజయోత్సవమే దశహరా. మౌర్య చక్రవర్తులంతా బౌద్ధాన్ని అనుసరించిన వారు. మౌర్యుల కాలంలో బ్రాహ్మణుల్ని ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. శ్రార్ధ కర్మలు ఉండేవి కావు. హింసాత్మకంగా బలులు ఇచ్చేవారు కాదు. విగ్రహారాధన, పూజలు, అర్చనలు ఉండేవి కావు. ఒళ్ళు వంచి కష్టపడి పనిచేయడం చేతకాని బ్రాహ్మణులకు గుడ్డుకాలం దాపురించింది. ఎలాగైనా బౌద్ధాన్ని నాశనం చేయాలి. మౌర్య సామ్రాజ్యాన్ని పడగొట్టాలి. తమ వైదిక ధర్మాన్ని పునరుద్ధరించుకోవాలి... కూర్చుని తింటూ ఉండాలి! అని కుట్రలకు, కుతంత్రాలకు పూనుకున్నారు. హింసకు కూడా వెనుకాడలేదు. రాజు పుష్యమిత్ర శృంగుడు– బౌద్ధ భిక్షువుల తలలు నరికి తెమ్మన్నాడు. ఒక్కొక్క తలకు వంద వరహాలిస్తానని కూడా ప్రకటించాడు. ఇకనేం? బౌద్ధ భిక్షువులు లెక్కలేనంత మంది నరికి చంపబడ్డారు. కొందరు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఇతర ప్రాంతాలకు పారిపొయ్యారు.

### జమ్మిచెట్టు ఆచారం

దసరా రోజు జమ్మి చెట్టును దర్శించి, దాని ఆకు తీసుకుని బంధుమిత్రుల్ని కలవడం ఆచారంగా వస్తోంది. దానికి చెప్పిన కథ ఏమిటీ? మహాభారతంలో పాండవులు తమ ఆయుధాలు జమ్మిచెట్టు మీద పెట్టారని. అవి ఇతరులకు శవంలాగా కనిపిస్తాయని చెపుతారు. అవి తీసుకుని, మహాభారత సంగ్రామానికి పాండవులు బయలుదేరి వెళ్ళారని చెపుతారు. అసలు చెట్టు మీద శవం కనబడితే ఎవడూ పైకెక్కి ఏమిటీ అని చూడడా? ఆనాటి ఆ ప్రజలు అంత పిరికి వారా? సరే, ఆ విషయం వదిలేద్దాం. దశహరా అని ఒకటి రామాయణం కథ చెప్పారు. మరొకటి భారతం లోది చెప్పారు. అంటే ముక్కలు ముక్కలుగా అతుకుల బొంతలాంటి కథలు చెప్పడమేనా మనువాదుల పనీ? సరే– దీని గూర్చిన వాస్తవాలేమిటీ? చరిత్ర ఏం చెపుతుందో చూద్దాం– మొదట క్రూరుడిగా ఉన్న అశోకుడు కళింగను ఆక్రమించుకోవడానికి అతి భీకరంగా యుద్ధం చేశాడు. ఆ యుద్ధం అతనిలో గొప్ప మార్పు తెచ్చింది. అంతర్మథనానికి లోనయ్యాడు. యుద్ధంతో మానవాళికి జరిగిన నష్టాన్ని బేరీజు వేసుకున్నాడు.




బుద్ధుడి బోధనలకు ఆకర్షితుడయ్యాడు. ఫలితంగా యుద్ధం ముగిసిన పది రోజుల తర్వాత సరిగ్గా దశమి రోజున బౌద్ధ ధమ్మ దీక్ష స్వీకరించాడు. విజయం సాధించినందుకు ఆ దశమి విజయ దశమి అయ్యింది. ఆ రోజు తన రాజ్యమంతా విజయోత్సవాలు, వేడుకలు చేసుకోవాలి. కానీ, అందుకు భిన్నంగా అదే దశమి రోజున బుద్ధ విగ్రహం పాదాల దగ్గర తన ఆయుధాలు పెట్టి, అశోకుడు అహింస సిద్ధాంతాన్ని స్వీకరించాడు. బౌద్ధ గురువు మొగలి పుత్త తిస్స ఆధ్వర్యంలో ఆ కార్యక్రమం జరిగింది. ఆ తర్వాత ప్రపంచ వ్యాప్తంగా బౌద్ధం వ్యాపించడానికి అశోకుడు చేసిన విశేషమైన కృషి ఏమిటో మనకు తెలుసు. దేశ వ్యాప్తంగానూ. విదేశాల్లోనూ ఉన్న బౌద్ధ విగ్రహాలు, స్థూపాలు, ఆరామాలే ఆనాటి వాస్తవాల్ని ఈ నాటికీ వివరిస్తూనే ఉన్నాయి. అసలు విజయ దశమి రోజున జరిగింది ఇదయితే వైదిక సంప్రదాయ వాదులేం చేస్తున్నారూ? రక్తం తాగుతున్న దేవతా (స్త్రీ) మూర్తిని పెట్టుకుని, దానికి ఎదురుగా జంతువుల్ని బలి ఇస్తున్నారు. ఆ దేవతామూర్తి చేతిలో కూడా ఖడ్గం ఉంటుంది. అది రక్తసిక్తమైందన్నట్టుగా ఆ బొమ్మ ఖడ్గానికి ఎరుపు రంగు పూస్తారు. అంటే హింసను ప్రేరేపించడానికి అన్ని విధాలా ప్రయత్నిస్తున్నారన్నమాట! గొర్రెపిల్ల మెడను ఒకడు పంటితో కొరికి చంపడం, ఆ రక్తంతో దేవతా మూర్తులకు అభిషేకాలు చేయడం ఇప్పటికీ కొనసాగుతున్న ఆచారాలు. ఇలాంటివి ఇంకా అవసరమా? అని జనం ఆలోచించాలి కదా? మనం అర్థం చేసుకోవాల్సింది ఏమంటే ‘శాంతిని బోధిస్తున్న బౌద్ధానికి వ్యతిరేకంగా బ్రాహ్మనిజం చేస్తున్నదే ఈ విజయదశమి’ అని!

### మనుస్మృతి రచన

బౌద్ధాన్ని నాశనం చేయడానికి చేసిన ఎన్నో కుతంత్రాలలో భాగమే మనుస్మృతి రచన! దాని ప్రకారమే రాజును, రాజ్యాన్ని తమ చెప్పు చేతలలో ఉంచుకుని తమ స్థానాన్ని రాజగురు స్థానంలో లేదా పండిత/పూజారి స్థానాల్లో మహోన్నతంగా స్థిరపరుచుకున్నారు– వైదిక మతాచార్యులు. మిగతావారి పట్ల కఠినంగా వ్యవహరిస్తూ, వారి రెక్కల కష్టాన్ని దోచుకుతింటూ శతాబ్దాలుగా కాలం గడుపుతూ వస్తున్నారు. ఈ విషయాలు పూర్తిగా అర్థం చేసుకున్న డా: బి.ఆర్.అంబేద్కర్ ఎవరూ ఊహించని నిర్ణయం తీసుకున్నారు. ఈ దేశాన్ని మౌర్యులు, నాగ వంశ పాలకులు పరిపాలించారు. ఈ నాగజాతి వారంతా బౌద్ధులే! వారే ప్రపంచవ్యాప్తంగా బౌద్ధాన్ని ప్రచారం చేశారు. నాగజాతి వారు ఎక్కువ సంఖ్యలో ఉన్న ప్రాంతం నాగపూర్. అక్కడ ప్రవహించే నది నాగానది. ఇలాంటి చారిత్రక అంశాలు క్షుణ్ణంగా పరిశీలించి, పరిశోధించిన తర్వాత డా.అంబేద్కర్ 1956లో అక్టోబరు 14న దీక్షభూమి, నాగపూర్‌లో విజయదశమి రోజు బౌద్ధం స్వీకరించారు. అంటరానితనం అంతరించాలనీ, మనుషులందరికీ సమాన స్థాయి, హక్కులూ ఉండాలన్నది ప్రధానంగా ఆయన కోరుకున్నారు. ఆయన స్వీకరించడమే కాకుండా, ఆయన అనుయాయుల్ని ఆరులక్షల మందిని బౌద్ధంలోకి తీసుకుపోయారు. ఈ కార్యక్రమమంతా ‘భదంత్ చంద్రమణి మహాథేరో, భంతే ప్రజ్ఞాతిస్స, యం.సంఘ్ రతన్ మహాథేరో’ ఇంకా బౌద్ధ భిక్షుల ఆధ్వర్యంలో జరిగింది. అంబేద్కర్ మరణం తర్వాత కూడా అధిక సంఖ్యలో ఆయన అనుచరులు బౌద్ధం స్వీకరిస్తూ వచ్చారు. బౌద్ధానికి ఈ దేశంలో ఒకప్పుడు ఉన్న ఆదరణ ప్రస్తుతం లేకపోవచ్చు కానీ, ఆధునిక కాలంలో కూడా అంతరించిపోకుండా స్థిరంగా కొనసాగుతూ ఉంది. మతాల పేరుతో రాజకీయ నాయకులు చేస్తున్న దుశ్చర్యలకు విసిగిపోయి మానవవాదులంతా బ్రాహ్మనిజం సమాజంలో అసమానత్వాన్ని ప్రభోదిస్తే, బౌద్ధం సమానత్వం కోసం పాటుపడింది. అందువల్ల మానవీయ విలువలకు ప్రాధాన్యమిచ్చే వారంతా ఈ వైపుకురావడం తథ్యం!

మొఘలుల కాలం నుండి, బ్రిటీషు కాలం నుండి హిందూ మతస్తులు చాలా మంది ముస్లిం, క్రైస్తవ మతాల్లోకి ఎందుకు మారారు? హిందూ మతంలోని అమానవీయ అంశాలకు విసిగి, వేసారి మారారు అనేది నిజం!. ప్రపంచంలో ఎక్కడా లేని సతీసహగమనాన్ని ఎలా సమర్థించుకుంటారూ? స్త్రీలను నిమ్నవర్గాల్లో కలిపి, వారికి చదువు, స్వేచ్ఛా లేకుండా ఎందుకు చేశారు? వారి శ్రమను ఎందుకు దోపిడి చేశారు? జంతువులకన్నా హీనంగా అంటరానితనాన్ని ఎందుకు పాటించారు? ఇలాంటి అతి నీచమైన పద్ధతులు ఉండడం వల్లనే, వాటిని తప్పించకోవడానికి కొందరు ఇతర మతాల్లోకి పారిపోయారు. ‘ధర్మం’ పేరుతో ఆలయాలు కట్టేవాళ్లు, పునరుద్ధరించేవాళ్లు పునరాలోచించుకోవాలి. వాళ్లు పెంచేది బిచ్చగాళ్ల సంఖ్యే తప్ప మరేమీ కాదు. జీవితకాలమంతా అట్టడుగు వర్గాల ప్రయోజనం కోసం నిలబడ్డ వాళ్లు సైతం, ఈ రోజు ప్లేటు ఫిరాయించి మనువాద స్వాముల కాళ్లమీద పడి భజనలు చేస్తూ దిగజారి పోతున్నారు.

బుద్ధుడి ప్రభావాన్ని కాదనలేకే కదా అతణ్ణి తమ కాల్పనిక దశవతారాల్లో చేర్చుకున్నారు. ఒక చారిత్రక పురుషుడైన బుద్ధుడి ఆహార్యం, జీవితాంశాలు తీసుకునే కదా పురాణ పురుషుడైన రాముడి పాత్రకు రూపకల్పన చేసుకున్నారు. సాధారణ శకానికి పూర్వం (బిసిఇ) ఆరవ శతాబ్దం నుండి సాధారణ శకం(సిఇ)లోని పదిహేనవ శతాబ్దం వరకు సుమారు రెండు వేల ఏళ్లు ఈ దేశంలో బౌద్ధం విలసిల్లింది. తర్వాత కాలంలో దాన్ని పూర్తిగా నాశనం చేయడానికి ఒకప్పటి శృంగులు, తర్వాత కాలాల్లో త్రిమతాచార్యులు అంటే శంకరాచార్యులు, రామానుజాచార్యులు, మధ్వాచార్యులు వారి వారి అనుయాయులు కొన్ని శతాబ్దాలుగా అహేతుకమైన, అసంబద్ధమైన దేవీదేవతల మహిమలు ప్రచారం చేసి సమాజాన్ని మూఢత్వంలోకి లాగారు. ఇప్పుడు అందులోంచి బయటపడడం జనానికి చాలా కష్టంగా ఉంది. నిజాలు తెలుసుకుని జనం ఎక్కడ వివేకవంతులవుతారోనని ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ప్రజల సొమ్మును ఆలయాలకు, విగ్రహాలకు ఖర్చుపెడుతున్నాయి. ఇది మనం చూస్తున్నదే! దీని వల్ల దేశం వెనకడుగులు వేయడమే తప్ప ముందడుగు వేసినట్టు ఎంతమాత్రమూ కాదు!

**(కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు విజేత, విశ్రాంత బయాలజీ ప్రొఫెసర్)**

## పట్టభద్రులారా మేల్కొండి.. ఓటుహక్కు పొందండి!



కల్లూరు ధర్మేంద్ర
ఎఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు, 9705309583

విద్య మనిషికి జ్ఞానాన్ని ఇస్తుంది. ఆ జ్ఞానం సమాజంలోని సమస్యలను అర్థం చేసుకునే చైతన్యాన్ని కల్పించాలి. ఆ చైతన్యం ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు దారితీయాలి. డిగ్రీలు, పీజీలు సాధించిన పట్టభద్రులు తమ వ్యక్తిగత భవిష్యత్తు గురించే కాకుండా, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలు, విద్యారంగంలో నెలకొన్న సవాళ్లు, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, ప్రైవేటు రంగంలో ఉద్యోగ భద్రత, నాణ్యమైన విద్య, సామాజిక న్యాయం వంటి అంశాలపై కూడా బాధ్యతతో స్పందించాలి. ప్రజాస్వామ్యంలో మన అభిప్రాయాన్ని వ్యక్తం చేయడానికి, ప్రజాప్రతినిధులను ప్రశ్నించడానికి, పాలనలో జవాబుదారీతనాన్ని కోరడానికి ఓటు ఒక ముఖ్యమైన సాధనం. అందుకే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదును సాధారణ ప్రక్రియగా కాకుండా, విద్యావంతుల ప్రజాస్వామ్య బాధ్యతగా ప్రతి ఒక్కరూ గుర్తించాలి.

### పట్టా చేతిలో ఉంది.. మరి ఓటరు జాబితాలో మీ పేరు ఉందా?

తెలంగాణలో వేలాది మంది యువత ఉన్నత విద్యను పూర్తి చేసుకుని ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. కొందరు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. మరికొందరు ప్రైవేటు ఉద్యోగాల్లో తక్కువ వేతనాలు, ఉద్యోగ భద్రత లేకపోవడం, పెరుగుతున్న జీవన వ్యయం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వలసలు, స్థానికంగా ఉపాధి అవకాశాల కొరత, ప్రభుత్వ విద్యాసంస్థల్లో వసతుల అవసరం వంటి సమస్యలు కూడా యువత భవిష్యత్తును ప్రభావితం చేస్తున్నాయి. ఈ సమస్యలు పరిష్కారం కావాలంటే ప్రభుత్వ విధానాలపై చర్చ జరగాలి. ప్రజాప్రతినిధులు యువత సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించాలి. సంబంధిత శాఖల పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తాలి. విద్యావంతుల ఆకాంక్షలకు ప్రతినిధిత్వం లభించాలి. ఇందుకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ఒక ప్రజాస్వామ్య వేదికగా ఉపయోగపడతాయి. అయితే ఎన్నికల సమయంలో మన అభిప్రాయాన్ని వ్యక్తం చేయాలంటే ముందుగా ఓటరు జాబితాలో మన పేరు ఉండాలి. అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడు ఈ విషయాన్ని గుర్తించి, తన ఓటరు నమోదును పూర్తి చేసుకోవాలి.

### రెండు పట్టభద్రుల నియోజకవర్గాలు.. అనేక ప్రజా సమస్యలు

మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్, వరంగల్–ఖమ్మం – నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గాల్లోని విద్యావంతులు తమ ప్రాంతాల అవసరాలపై చైతన్యంతో వ్యవహరించాలి. హైదరాబాద్, రంగారెడ్డి ప్రాంతాల్లో ఉద్యోగ పోటీ, జీవన వ్యయం, నైపుణ్యాలకు తగిన ఉపాధి వంటి అంశాలు ప్రధానమైనవి. మహబూబ్‌నగర్ ప్రాంతంలో స్థానిక ఉపాధి అవకాశాల విస్తరణ, గ్రామీణ యువతకు విద్యా, ఉద్యోగ అవకాశాలు ప్రాధాన్యం కలిగిన అంశాలు.

వరంగల్ ప్రాంతంలో ఉన్నత విద్య, విశ్వవిద్యాలయాల బలోపేతం, పరిశోధన, ఉద్యోగ నియామకాలపై దృష్టి అవసరం. ఖమ్మం ప్రాంతం లో స్థానిక పరిశ్రమలు, వ్యవసాయ ఆధారిత జీవనోపాధి, యువతకు ఉపాధి అవకాశాల విస్తరణ ముఖ్యమైనవి. నల్గొండతో పాటు పరిసర ప్రాంతాల్లో నాణ్యమైన విద్య, పోటీ పరీక్షలకు శిక్షణ, స్థానికంగా ఉద్యోగావకాశాల కల్పన వంటి అంశాలపై చర్చ జరగాలి.




### నమోదు చేసుకోవడంతోనే ఆగిపోవద్దు.. మీ పేరు జాబితాలో ఉందో లేదో చూడండి

ఫారం18 సమర్పించిన తర్వాత మీ దరఖాస్తు స్థితిని పరిశీలించండి. ముసాయిదా ఓటరు జాబితా ప్రచురితమైనప్పుడు మీ పేరు, వివరాలు సరిగ్గా ఉన్నాయో లేదో నిర్ధారించుకోండి. పేరు లేకపోతే లేదా వివరాల్లో తప్పులు ఉంటే, ప్రకటించిన గడువులో సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించి తగిన చర్యలు తీసుకోండి. మీకు తెలిసిన అర్హులైన పట్టభద్రులకు కూడా ఈ విషయాన్ని తెలియజేయండి. ఓటరు నమోదు అనేది కేవలం వ్యక్తిగత పని కాదు. అర్హులైన ప్రతి పట్టభద్రుడికి సరైన సమాచారం చేరేలా చూడటం కూడా సామాజిక బాధ్యతలో భాగమే.

### ఓటరు నమోదు తేదీలు గడువును మిస్ కావద్దు

తెలంగాణలో రాష్ట్రంలో మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్, వరంగల్ –ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గాల ఓటరు జాబితాలను కొత్తగా రూపొందిస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్‌లోని ముఖ్యమైన తేదీలు ఇవి:

**28సెప్టెంబర్ 2026: ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభం.**
**15 అక్టోబర్ 2026: నమోదు ప్రకటన తొలి పునఃప్రచురణ.**
**25 అక్టోబర్ 2026: నమోదు ప్రకటన రెండో పునఃప్రచురణ.**
**6 నవంబర్ 2026: ఫారం–18 దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ.**
**25 నవంబర్ 2026: ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ.**
**25 నవంబర్–10 డిసెంబర్ 2026: క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ.**
**30 డిసెంబర్ 2026: తుది ఓటరు జాబితా ప్రచురణ.**

ఎవరు అర్హులు? సంబంధిత నియోజకవర్గంలో సాధారణ నివాసిగా ఉండి, గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ లేదా సమాన విద్యార్హతను 31 అక్టోబర్ 2023 నాటికి లేదా అంతకుముందు పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్హత, నివాసానికి సంబంధించిన ఇతర నిబంధనలను అధికారిక మార్గదర్శకాల ప్రకారం నిర్ధారించుకోవాలి.

ఎలా నమోదు చేసుకోవాలి? నిర్దేశిత ఫారం 18 ద్వారా ఆన్‌లైన్‌లో లేదా సంబంధిత ఎన్నికల అధికారుల వద్ద దరఖాస్తు చేయాలి. విద్యార్హత ధ్రువపత్రాలు, అవసరమైన ఇతర పత్రాలను సిద్ధం చేసుకోవాలి. ఇప్పటికే సాధారణ ఓటరు గుర్తింపు కార్డు ఉన్నా, గతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకున్నా, ఈసారి కొత్తగా దరఖాస్తు చేయాలి. ఎపిక్ నంబర్ లేకపోయిందనే కారణంతో మాత్రమే దరఖాస్తును తిరస్కరించకూడదని తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. అయినప్పటికీ అవసరమైన ఇతర పత్రాలు, అర్హత నిర్ధారణ తప్పనిసరి.

అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) పట్టభద్రులకు విజ్ఞప్తి చేస్తోంది. ఓటరు నమోదు విషయంలో నిర్లక్ష్యం చేయవద్దు. అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలి. మీ స్నేహితులు, సహచరులు, కళాశాల మిత్రులు, ఉద్యోగులు, నిరుద్యోగ యువతలో అర్హులైన వారికి ఈ సమాచారాన్ని చేరవేయాలి. అవసరమైన చోట నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలి. దరఖాస్తు చేసిన తర్వాత ముసాయిదా ఓటరు జాబితాలో పేరు ఉందో లేదో తనిఖీ చేసుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య విజ్ఞప్తి చేస్తోంది.

అర్హత ఉన్న పట్టభద్రులందరూ 6 నవంబర్ 2026లోపు ఫారం18 ద్వారా నమోదు చేసుకోండి. మీ హక్కును కాపాడుకోండి... ప్రజాస్వామ్య బాధ్యతను నిర్వర్తించండి.

# అమెరికా చేతిలో మోదీ కీలుబొమ్మ

జెన్ జీ ఉద్యమాలంటే బిజెపికి వణుకు

రాజ్యాంగబద్ధ సంస్థలన్నీ రాజ్యాంగ పరిధిలోనే పనిచేయాలి

ఓట్ల తొలగింపునకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

ఇటి.నరసింహ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికా చేతిలో కీలుబొమ్మగా మారారని సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి.నరసింహ విమర్శించారు. జెన్ జీ యువత ఉద్యమాలకు భయపడి బిజెపి దుష్ప్రచారానికి దిగుతోందని మండిపడ్డారు. రాజ్యాంగబద్ధ సంస్థలన్నీ రాజ్యాంగ పరిధిలోనే పనిచేయాలని స్పష్టం చేశారు. హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో శుక్రవారం సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇటి.నరసింహతోపాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎస్.ఛాయాదేవి, సీనియర్ నాయకురాలు పి.ప్రేంపావని, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, సహాయ కార్యదర్శి కె.యాదగిరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇటి.నరసింహ మాట్లాడుతూ గత 12 ఏళ్లుగా మోదీ ప్రభుత్వం సరైన విదేశాంగ విధానాన్ని అనుసరించడంలేదని, అమెరికా ఒత్తిళ్లకు తలొగ్గుతూ దేశ ప్రయోజనాలను దెబ్బతీస్తోందని మండిపడ్డారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్ల విషయంలోనూ అమెరికా ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరించడం దేశ ప్రయోజనాలకు విరుద్ధమన్నారు. పాకిస్థాన్ ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను తానే ఆపినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పలు మార్లు ప్రకటించినా, ప్రధాని మోదీ వాటిని ఖండించకపోవడం ఆయన అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. అమెరికా అనుకూలంగా వ్యవహరిస్తున్న మేరీ మిల్బెన్ ద్వారా సిజెపికి విదేశీ నిధులు అందుతున్నాయంటూ ఆరోపణలు చేయించడం సిగ్గుచేటన్నారు. ఈ ఆరోపణలపై సంబంధిత ప్రభుత్వ సంస్థలు వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. మోదీ, ఆర్‌ఎస్‌ఎస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆధారాలతో తిప్పికొడుతున్న జెన్ జీ యువత ప్రభుత్వానికి కంటగింపుగా మారిందని నరసింహ అన్నారు.

**బలహీనపడుతున్న రాజ్యాంగబద్ధ సంస్థలు..**

జంతర్ మంతర్ వద్ద ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని కోరుతూ ఆందోళన చేస్తున్న యువతపై పోలీసుల దాడులు చేయడం దారుణమన్నారు. ఉద్యమకారులపై దాడులకు పాల్పడినవారిని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ నేతలు సన్మానించడం వారి ఫాసిస్టు వైఖరికి నిదర్శనమన్నారు. మోదీ పాలనలో రాజ్యాంగబద్ధ సంస్థలు బలహీనపడుతున్నాయని, ప్రతిపక్షాలపై కక్షసాధింపు చర్యలకు వాటిని ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. సుప్రీంకోర్టు, ఎన్నికల సంఘం సహా రాజ్యాంగబద్ధ సంస్థలు ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి పనిచేయాలని సూచించారు. వామపక్షాలు, ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు, ఇతర ప్రజాస్వామిక శక్తులు ఏకమై ఓటు హక్కు పరిరక్షణ కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. తెలంగాణలోనూ ప్రజలను సమీకరించి ఓట్ల తొలగింపునకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఇటి.నరసింహ హెచ్చరించారు.

**ఓటు హక్కును హరిస్తూ.. మహిళల గొంతు నొక్కుతున్న కేంద్రం: ప్రేమ్ పావని**

దేశంలో ఓటర్ల జాబితా నుంచి అర్హులైన వారి పేర్ల తొలగింపు, యువత ఓటరు నమోదులో జాప్యం, మహిళల నిరసనలపై అణచివేత ప్రజాస్వామ్యానికే సవాల్ అని పి.ప్రేమ్‌పావని విమర్శించారు. ఓటు హక్కును కాపాడటంలో విఫలమవుతున్న కేంద్ర ప్రభుత్వం, తమ హక్కుల కోసం ప్రశ్నించే మహిళల గొంతును నొక్కేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు యువత, ప్రజలు ఐక్యంగా ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు.

**బ్యాలెట్ పేపర్లతోనే ఎన్నికలు నిర్వహించాలి : స్టాలిన్**

దేశంలో ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకం కలిగించాలంటే ఇవిఎంల స్థానంలో బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు నిర్వహించాలని స్టాలిన్ డిమాండ్ చేశారు. ఇవిఎంల ట్యాంపరింగ్ పై దేశ వ్యాప్తంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ప్రజాభిప్రాయానికి భిన్నంగా ఎన్నికల ఫలితాలు వస్తుండటంపై సమగ్ర చర్చ జరగాలని అన్నారు. ప్రజాస్వామ్య హక్కులు, రాజ్యాంగ విలువల పరిరక్షణకు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

# బంగ్లాదేశ్ తరహా హింసతో 'పాలన మార్పు'కు కాంగ్రెస్ కుట్ర

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బంగ్లాదేశ్ తరహాలో దేశంలో హింస, అరాచకం సృష్టించి పాలన మార్పునకు కుట్రలు జరుగుతున్నాయని వస్తున్న వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ తన వైఖరిని స్పష్టం చేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. ఢిల్లీలో జరిగిన ఓ సమావేశంలో న్యాయవాది ప్రశాంత్ భూషణ్, ఎఐఎస్ఎ అధ్యక్షురాలు నేహా బోరా, సిజెపి నేత అభిజీత్ దీప్‌కే చేసిన వ్యాఖ్యలు దేశద్రోహపూరితమైనవని ఆయన ఆరోపించారు. హైదరాబాద్ బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ భారతదేశంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరుగుతాయని, ప్రజాతీర్పుతో ప్రభుత్వాలు ఏర్పడతాయన్నారు. బంగ్లాదేశ్ పరిణామాలను ఆదర్శంగా తీసుకుని దేశంలో పాలన మార్పు తీసుకొస్తామని చెప్పడాన్ని కాంగ్రెస్ సమర్థిస్తుందా? అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడుతున్నప్పటికీ, రాజ్యాంగబద్ధ సంస్థలను బలహీనపరిచే ప్రయత్నాలపై స్పందించడం లేదన్నారు. ఎన్నికల సంఘం, న్యాయవ్యవస్థ వంటి ప్రజాస్వామ్య సంస్థలను లక్ష్యంగా చేసుకుని కొందరు పనిచేస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్య ఎన్నికల్లో గెలవలేకనే కాంగ్రెస్ దేశవ్యతిరేక శక్తులతో చేతులు కలిపిందన్నారు. ప్రశాంత్ భూషణ్ తదితరుల వ్యాఖ్యలపై కాంగ్రెస్ వెంటనే తన వైఖరిని వెల్లడించాలని, లేకపోతే ప్రజలకు సమాధానం చెప్పాల్సి ఉంటుందని రాంచందర్ రావు హెచ్చరించారు.

# ప్రశాంతంగా ముగిసిన బార్‌ల లక్కీ డ్రా

41 బార్లకు 8,770 దరఖాస్తులు..

లాటరీ ద్వారా లైసెన్స్‌ల ఎంపిక

ఎక్సైజ్ సిబ్బందికి కమిషనర్ హరికిరణ్ అభినందనలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో 41 బార్‌ల లైసెన్సుల కేటాయింపునకు శుక్రవారం నిర్వహించిన లక్కీ డ్రా ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి పరిధిలోని 14 బార్‌లకు 4,251 దరఖాస్తులు రాగా, వివిధ జిల్లాల్లోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలోని మరో 27 బార్‌లకు 4,519 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 8,770 దరఖాస్తుల నుంచి లక్కీ డ్రా ద్వారా లైసెన్సీలను ఎంపిక చేశారు. క్యూర్ పరిధిలోని గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్ల పరిధిలో ఉన్న 14 బార్‌లకు సంబంధించిన లక్కీ డ్రాను హైదరాబాద్‌లోని ది అడ్రస్ కన్వెన్షన్ అండ్ ఎగ్జిబిషన్ హాల్లో నిర్వహించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి. హరికిరణ్ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ చేపట్టారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు దరఖాస్తుదారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. దరఖాస్తుదారులకు కేటాయించిన నంబర్లను ముందుగా పరిశీలించిన అధికారులు, అనంతరం వాటిని ఒక పెట్టెలో వేసి అందరి సమక్షంలో లక్కీ డ్రా నిర్వహించారు. సికింద్రాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జీవన్ కిరణ్ నంబర్ల పెట్టెను కలిపిన తర్వాత కమిషనర్ సి. హరికిరణ్ టోకెన్లను తీసి అదనపు కమిషనర్ సయ్యద్ యాషిన్ ఖురేషికి అందజేశారు. ఎంపికైన నంబర్లను మైక్ ద్వారా ప్రకటించడంతోపాటు తెరపై ప్రదర్శించారు. ఈ విధంగా 14 బార్‌లకు లైసెన్సీల ఎంపికను పూర్తి చేశారు. లక్కీ డ్రాలో ఎంపికైన వారికి ఎక్సైజ్ అధికారులు సంబంధిత అనుమతి పత్రాలను అందజేశారు. ఇదే విధంగా జిల్లాల్లోని 27 బార్లకు ఆయా జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో లక్కీ డ్రాలు నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అశ్వారావుపేట, ఖమ్మం జిల్లాలో కల్లూరు, మహబూబ్‌నగర్ జిల్లాలో మక్తల్, దేవరకద్ర, మద్దూరు తదితర ప్రాంతాలతోపాటు సంగారెడ్డి, నిజామాబాద్, కామారెడ్డి, భవిష్యత్ నగర పరిధి, వికారాబాద్, వరంగల్, జనగామ, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లోని బార్‌లకు సంబంధించి డ్రా ప్రక్రియను నిర్వహించారు. బార్‌ల లక్కీ డ్రాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా ముగియడంతో ఎక్సైజ్ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. విధులు నిర్వర్తించిన ఎక్సైజ్ సిబ్బందికి కమిషనర్ సి. హరికిరణ్ అభినందనలు తెలిపారు. అదనపు కమిషనర్ సయ్యద్ యాషిన్ ఖురేషితో పాటు సైబరాబాద్, గ్రేటర్ హైదరాబాద్, మల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్లు జె.హరికిషన్, ఎ.శ్రీనివాసరెడ్డి, పి.ప్రణవీ అధికారులు పాల్గొన్నారు.

GREATER HYDERABAD MUNICIPAL CORPORATION
హైదరాబాద్ మహానగరపాలక సంస్థ

| NIT No. | పని వివరణ | అంచనా విలువ / ECV | డౌన్‌లోడింగ్ ప్రారంభ తేదీ & సమయం | బిడ్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం | ఇఇ / ఎస్ఇ పేరు & చిరునామా |
|---|---|---|---|---|---|
| 35 | 5 పనుల కొరకు రాజేంద్రనగర్ జోన్‌లో సిసి రోడ్డు మరియు కాంపౌండ్ వాల్ వేయడం, ఎయిర్టెక్ మెషీన్‌తో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను శుభ్రపరచడం మరియు కాంపౌండ్ వాల్ నిర్మాణం. | రూ. 52.90 లక్షలు | తేది: 16.10.2026 మ.2.30 గం.లకు | తేది: 22.10.2026 మ.2.40 గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్, జిహెచ్ఎంసి. సెల్ నెం. 9989930608. ఇ-మెయిల్: eec19.rajendranagar @gmail.com |

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్ సర్కిల్-19, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 12064-PP/CL/ADVT/2026-27, Date: 16-10-2026

# తెలంగాణ రైతాంగాన్ని ఆదుకోవాలి

కరెంట్ కోతలు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

కరువు దృష్ట్యా కేంద్రం రూ.50వేల కోట్లు విడుదల చేయాలి

ఎఐకెఎస్ రాష్ట్రప్రధానకార్యదర్శి పశ్య పద్మ డిమాండ్




**ప్రజాపక్షం/మహబూబాబాద్:** రాష్ట్రంలో కరెంట్ కోతలు లేకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని తెలంగాణ రైతాంగాన్ని ఆదుకోవాలని ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సిపిఐ కార్యాలయం వీరభవన్‌లో తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసి విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణలో కరువు మండలాలను తక్షణమే గుర్తించాలని, మిగిలిన పంటలకు నాణ్యమైన కరెంట్ ఇచ్చేలా గోదావరి జలాలను వృధా కాకుండా వాడుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరువు నష్ట పరిహారం కింద పత్తికి ఎకరాకు రూ.30వేలు, మిర్చికి రూ.50వేలు, కూరగాయలు, ఇతర పంటలకు ఎకరానికి రూ.20వేలు చొప్పున అందించి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని, అలాగే కేంద్రంలోని మోదీ సర్కార్ తెలంగాణ రాష్ట్రానికి కరువు కింద రూ.50వేల కోట్లు నిధులు విడుదల చేయాలని పశ్య పద్మ డిమాండ్ చేశారు. పశువుల మేతకు చర్యలు చేపట్టాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి రైతుల వద్దకు వెళ్ళి సమస్యలు తెలుసుకుని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఢిల్లీ వదిలి తెలంగాణకు రాష్ట్ర మంత్రి వర్గం వచ్చి రైతుల గోడు పట్టించుకోవాలన్నారు. చనిపోయిన రైతులను ఆదుకోవాలని తెలిపారు. రైతు ఆత్మహత్యలు లేకుండా ప్రభుత్వం తక్షణమే రైతులకు న్యాయం చేసే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, రైతు సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నెల్లూరు నాగేశ్వరావు, మేక వీరన్న, నాయకులు చొప్పరి శేఖర్, బానోత్ లింగ్యానాయక్, రామగాని రవి పాల్గొన్నారు.

## కరువు వస్తుందని ముందే హెచ్చరించినప్పటికీ..

# ముందస్తు చర్యలు చేపట్టడంలో సిఎం వైఫల్యం

కల్వకుంట్ల కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కరువు వస్తుందని ముందే హెచ్చరించినప్పటికీ ముందస్తు చర్యలు చేపట్టడంలో సిఎం రేవంత్‌రెడ్డి అట్టర్ ఫ్లాప్ అయ్యారని తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఉద్యమకాలంలో బిఆర్ఎస్‌కు పూర్తి అండగా ఉన్న శ్రీనివాస్‌రావుపై కెటిఆర్ విచారణ కోరడమంటేనే నమ్మినోళ్లను నట్టేట ముంచడమని, సాయం చేసిన వాళ్లను, కుల బంధువులను ఇబ్బంది పెట్టడం, ఇంటి మనిషినైనా తనను కిరాయి మనుషులతో తిట్టించే నైజం కెటిఆర్‌ది అని మండిపడ్డారు. సింగరేణి కార్మికుల కష్టాలేవీ కూడా కెటిఆర్‌కు తెలియదని ఎద్దేవా చేశారు.

హైదరాబాద్‌లోని టిఆర్ఎస్ కార్యాలయంలో కవిత శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ సొంత మనుషులపై ఉడుకు నీళ్లు పోసే వ్యక్తి కెటిఆర్ అని, తప్పు చేస్తే ఎవరినైనా శిక్షించాలని, కానీ సాయం చేసిన వాళ్లపైనే విచారణ కోరుతూ లేఖలు రాయడమే కెటిఆర్ వ్యక్తిత్వమన్నారు. ప్రతిమ శ్రీనివాస్‌ను సిఎం ఎందుకు కాపాడుతున్నారని ఆమె ప్రశ్నించారు. సింగరేణిలో బిఆర్ఎస్ సభ పెట్టి బల ప్రదర్శన చేయడానికి ప్రయత్నించారు తప్ప, కార్మికుల కష్టాలను కనీసం ప్రస్తావించలేదని మండిపడ్డారు. కరువు విషయంలో తాను ఏమీ చేయలేనని సిఎం రేవంత్ రెడ్డి నిస్సహాయతను వ్యక్తం చేస్తూ చేతులెత్తేశారన్నారు. ఆగస్టు నెలలో 28శాతం లోటు వర్షపాతం నమోదైనప్పుడే ప్రభుత్వం అప్రమత్తమై ఉంటే పరిస్థితి వేరేలా ఉండేదన్నారు. పక్క రాష్ట్రాలు కరువు మండలాలను ప్రకటించి ఇప్పటికే కేంద్రానికే నివేదిక పంపించాయని, తెలంగాణ సిఎం మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, ఇప్పుడు సమీక్షలంటూ కాలం వెళ్లదీసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడిగడ్డ బ్యారేజ్ రిపేర్లు చేయడానికి ఇదే సరైన సమయమని, వచ్చే వర్షాకాలంలోపు ఆ పనులు పూర్తి చేసి గోదావరి నీళ్లను వినియోగంలోకి తీసుకురావాలని కవిత డిమాండ్ చేశారు. రైతు కూలీలకు ఏడాదికి రూ.12వేలు ఇవ్వడంతో పాటు వారి కుటుంబాలకు బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకంలో రైతు కూలీలకు పని కల్పిస్తామని చెబుతున్నారని, ఈ విషయమై ఇప్పటి వరకు కేంద్రంతో మాట్లాడకుండా ఎలా సాధ్యమని ప్రశ్నించారు.























## బిసి, ఎస్సీ, ఎస్టీ జెఎసి ఆవిర్భావ సదస్సుకు వివిధ సంఘాల నాయకులకు ఆహ్వానం

**ప్రజాపక్షం/మక్తల్ :** ఈనెల 25న నారాయణపేట్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న బిసి, ఎస్సీ, ఎస్టీ జెఎసి జిల్లా ఆవిర్భావ సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులను జెఎసి నాయకులు ఆహ్వానించారు. బిసి, ఎస్సీ, ఎస్టీలను సమాన విద్య, వైద్యం,ఉపాధి రాజకీయ వాటా, మానవ గౌరవం సాధించాలనే లక్ష్యంతో జేఏసీ చేస్తున్న పోరాటంలో భాగంగా జేఏసీ చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్ రాష్ట్ర అధ్యక్షుడు తోట్ల రాఘవేంద్ర ముదిరాజ్ ఆదేశాల మేరకు ఈ ఆహ్వాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బహుజన సమాజ్ పార్టీ జిల్లా నాయకుడు చంద్రశేఖర్ మక్తల్ అంబేద్కర సంఘం అధ్యక్షుడు పృథ్వీరాజ్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు జీర్గల్ నరేష్, స్వేరో రవి, భారత నాస్తిక సమాజం నాయకుడు పోలప్ప, ధర్మ సమాజ్ పార్టీ మండల నాయకుడు తిమ్మరాజు నరసింహ, కర్రెం ఆంజనేయులు, తదితరులను సదస్సుకు ఆహ్వానించారు. డిఎస్‌పి జెఎసి, నాయకులు పోర్ల దేవిడ్, జి.కృష్ణ పెద్దింటి గణేష్ మహారాజ్ పాల్గొన్నారు.

## అందరిపైనా అమ్మవారి ఆశీస్సులు

### రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** దసరా నవరాత్రి ఉత్సవాలను కులమతాలకు అతీతంగా భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం గొప్ప విషయమని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీ నారాయణ, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ అన్నారు. శుక్రవారం కల్వకుర్తి పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారు ధనలక్ష్మి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. రూ.55,55,555 విలువైన ఆభరణాలతో అమ్మవారిని అలంకరించారు. ఆలయ ట్రస్టు చైర్మన్ జూలూరు రమేష్ బాబు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కల్మిచర్ల గోపాల్ ఆధ్వర్యంలో అతిథులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారు ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అతిథులను ఘనంగా సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు, వాసవి క్లబ్ ప్రతినిధులు, నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## దుర్గామాతకు ఉప్పల వెంకటేష్ ప్రత్యేక పూజలు

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కల్వకుర్తి పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయం, హనుమాన్ దేవాలయం, తిలక్ నగర్‌లోని దుర్గామాత ఆలయం, పోచమ్మ దేవాలయం వద్ద ఉన్న దుర్గామాత ఆలయాల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ధనలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకుని భక్తి శ్రద్దలతో పూజలు చేశారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

## ఆత్మ ఆధ్వర్యంలో వేరుశనగ పంటపై పొలంబడి శిక్షణ

**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట మండలంలోని రాయణ పేట శివారులో వేరుశనగ సాగుచేసిన రైతులకు ఆత్మ (ఎటిఎంఎ) ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం ద్వారా శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జాస్మిన్ మాట్లాడుతూ వేరుశనగ పంటలో విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలి. అలాగే పూత దశలో ఎకరాకు 200కిలోలు జిప్సం వేసి సాళ్లలో కలిసేటట్లుగా అంతర కృషి చేసుకోవాలని, సరైన సమయంలో తెగులు నివారణ చేసుకోవాలని రైతులకు సూచించడం జరిగింది. కృషి విజ్ఞాన కేంద్రం మదనాపురం శాస్త్రవేత్త రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ వేరుశనగ వేసే రైతులు డైథేన్ ఎం 45తో విత్తన శుద్ధి చేసుకోవాలి. అలాగే కలుపు నివారణ కొరకు డైక్లోసులామ్ అనే కలుపు మందును విత్తిన మూడు రోజులలో పిచికారి చేసుకోవడం వల్ల కలుపు నివారించవచ్చని తెలిపారు. వేరుశనగ వేసిన రైతులు మొదటి 20 రోజులు బెట్టకు గురి చేయాలని, అనంతరం నీటి తడులు ఇవ్వాలని, త్వారా పూత ఒకేసారి రావడం వల్ల అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. దీని వల్ల అధిక దిగుబడులు సాధించవ్చని తెలిపారు. అలాగే వేరుశనగ పంట సాగుచేసిన రైతుల క్షేత్రాలను సందర్శించి పలు సూచనలు చేయడం జరిగింది.

## జల్లాపురం చెక్‌డ్యామ్ దుస్థితిపై కలెక్టర్ స్పందించాలి

### లక్కిరెడ్డి కరుణ సింహారెడ్డి, శాంతకుమార్

**ప్రజాపక్షం/అలంపూర్ :** జోగులాంబ గద్వాల జిల్లా, మానవపాడు మండలం జల్లాపురం గ్రామంలోని చెక్‌డ్యామ్ శిథిలావస్థకు చేరింది. సుమారు 20 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ జలవనరు కూడిక, ముండ్ల చెట్లతో నిండిపోగా, గోడ కూలిపోవడంతో వర్షపు నీరు వృథాగా పోతుందని గ్రామస్థులు ఆవేనద వ్యక్తం చేస్తున్నారు. దీంతో భూగర్భజలాల పెంపుపై ప్రభావం పడటంతో పాటు పశువులకు తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. చెక్‌డ్యామ్ కు వెంటనే పూడికతీత చేపట్టి, కూలిన గోడకు మరమ్మత్తులు లేదా నూతన చెక్‌డ్యామ్ నిర్మాణ పునరుద్ధరణకు నిధులు మంజూరు చేయాలని మాజీ నీటి సంఘం అధ్యక్షుడు లక్కి రెడ్డి కరుణ సింహారెడ్డి, సామాజిక కార్యకర్త శాంతకుమార్ కోరారు. జిల్లా కలెక్టర్ , డిపిఒ, ఎంపిడిఒ స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

## అక్రమ కేసులు వేధింపులతో మాజీ సర్పంచ్ అభ్యర్థి ఆత్మహత్య

### కర్నూలులో చికిత్స పొందుతూ మృతి

**ప్రజాపక్షం/గద్వాల్ జిల్లా :** ధరూర్ మండలం బూరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వీరేష్ (28) ఆత్మహత్యకు పాల్పడ్డారు. గతంలో జరిగిన గ్రామ పంచాయితీ ఎన్నికల్లో ఆయన టీఆర్ఎస్ (బీఆర్ఎస్) పార్టీ తరఫున సర్పంచు పదవికి పోటీ చేశారు. దీనిని ఓర్వలేని ప్రత్యర్థి వర్గానికి చెందిన వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా ఆయనపై అక్రమ కేసులు బనాయించి తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. ఈ విషయంపై పోలీసు కూడా అత్యుత్సాహం ప్రదర్శించడంతో మనస్తాపం చెందిన వీరేష్, తీవ్ర అవమాన భారంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ కర్నూలులో తుది శ్వాస విడిచారు. వీరేష్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు, టిఆర్ఎస్ మద్యపానం గొంగల రంజిత్ కుమార్ గ్రామస్తులు డిమాండు చేస్తున్నారు.

### జోగులాంబ అమ్మవారికి

## పట్టువస్త్రాలు సమర్పించడం పవిత్రమైన భాగ్యం

### మంత్రి వాకిటి శ్రీహరి

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల్ :** ఎల్‌నినో ప్రభావం నుంచి రైతాంగం ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులు తొలగి, సమృద్ధిగా వర్షాలు కురిసి తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని జోగులాంబ అమ్మవారిని ప్రార్థించినట్లు రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. శుక్రవారం దసరా శరన్నవరాత్రుల సందర్భంగా అలంపూర్‌లోని శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించి, రాష్ట్ర ప్రభుత్వం తరపున కుటుంబ సమేతంగా శ్రీ జోగులాంబ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన మంత్రికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ముందుగా శ్రీ బాల బ్రహ్మేశ్వర స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు, అర్చనలు నిర్వహించడంతో పాటు విఘ్నేశ్వర స్వామికి అభిషేకం చేశారు. అనంతరం శ్రీ జోగులాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామివార్ల దసరా శరన్నవరాత్రుల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడం తనకు ఎంతో పుణ్యప్రదమైన అవకాశమని పేర్కొన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి అమ్మవారు మరింత శక్తి, సామర్థ్యాలను ప్రసాదించాలని కోరుకున్నట్లు తెలిపారు. ఎల్‌నినో ప్రభావాలు తగ్గి, రాష్ట్రంలో అనుకూల వాతావరణ పరిస్థితులు నెలకొని, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని జోగులాంబ అమ్మవారిని ప్రార్థించినట్లు మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, ప్రకృతి ప్రతికూల ప్రభావాల నుంచి ఉపశమనం పొందాలని అమ్మవారి ఆశీస్సులు కోరినట్లు పేర్కొన్నారు. రాష్ట్రం సస్యశ్యామలంగా మారి, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, రాష్ట్ర గొర్రెలు, మేకలు, అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ సరిత, ఆలయ ఈవో దీప్తి, స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## పరిశుభ్రతతోనే ఆరోగ్యం

### స్వచ్ఛతతోనే సమాజాభివృద్ధి

### జడ్చర్ల ఎల్ఐసి కార్యాలయంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం

**ప్రజాపక్షం/జడ్చర్ల :** స్వచ్ఛ భారత్ లక్ష్య సాధనలో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం జడ్చర్ల ఎల్ఐసీ కార్యాలయంలో శుక్రవారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్‌బిఎం శంకర్ అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ సంగమేశ్వర్‌తో పాటు ఎల్ఐసి అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, ఏజెంట్లు ఈ కార్యక్రమంలో పాల్గొని కార్యాలయ పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎస్ బి ఎం.శంకర్ మాట్లాడుతూ పరిశుభ్రత అనేది కేవలం వ్యక్తిగత బాధ్యత మాత్రమే కాదని, సమాజం పట్ల ప్రతి ఒక్కరికీ ఉన్న సామాజిక బాధ్యత అని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నిర్మించవచ్చని, స్వచ్ఛతను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.



## పిఆర్టీయు టిఎస్ రాష్ట్ర కార్యవర్గంలో కృష్ణ మండలానికి ఎనిమిది పదవులు

**ప్రజాపక్షం/కృష్ణ :** పీఆర్టీయూ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు అక్టోబర్ 15,16 తేదీల్లో నల్లగొండలో నిర్వహించగా, ఈ సమావేశాల్లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ ఎన్నికల్లో నారాయణ పేట జిల్లా, కృష్ణ మండలానికి చెందిన ఎనిమిది మంది ఉపాధ్యాయ నాయకులు రాష్ట్ర స్థాయిలో కీలక పదవులు లభించాయి. నారాయణ పేట జిల్లా శాఖ ఆమోదంతో కృష్ణ మండలం నుంచి ఏకగ్రీవంగా ఎంపికైన ఎనిమిది మంది ఉపాధ్యాయ నాయకులకు రాష్ట్ర కార్యవర్గంలో సముచిత స్థానం కల్పించడం పట్ల కృష్ణ మండల ఉపాధ్యాయ వర్గాలో హర్షం వ్యక్తమవుతోంది.

**రాష్ట్ర స్థాయిలో ఎన్నికైన నూతన బాధ్యుల వివరాలు :**

1. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు : గణేష్ సింగ్, 2. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు : కిషోర్ కుమార్, 3. రాష్ట్ర ఉపాధ్యక్షులు : వీరుపాక్షప్ప, 4. రాష్ట్ర ఉపాద్యక్షులు : నరేందర్, 5. రాష్ట్ర కార్యదర్శి : తిరుమలరావు, 6. రాష్ట్ర కార్యదర్శి : సూర్యకాంత్, 7. రాష్ట్ర మహిళా ఆర్గనైజింగ్ కార్యదర్శి : శాలిని థేరిస్సా, 8. రాష్ట్ర మహిళా ఆర్గనైజింగ్ కార్యదర్శి : కుషిత ఈ సందర్భంగా పీఆర్టీయూ టీఎస్ కృష్ణ మండల శాఖ అధ్యక్షులు దండు శేఖర్, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, అధ్యక్షులు ఎన్. శివరాజ్ నూతనంగా రాష్ట్ర స్థాయి పదవులకు ఏకగ్రీవంగా ఎన్నికైన నాయకులందరికీహృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. కృష్ణ మండలానికి రాష్ట్ర కార్యవర్గంలో ఎనిమిది పదవులు లభించడం మండల ఉపాధ్యాయుల ఐక్యతకు, సంఘటనా బలానికి నిదర్శనమని వారు పేర్కొన్నారు. నూతన బాధ్యులు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, ఉపాధ్యాయ హక్కుల పరిరక్షణకు, విద్యారంగ అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

## మానవత్వమే మహోన్నత మతం!

### 26వ అఖిల భారత అంతర్‌మత సదస్సులో మత పెద్దల పిలుపు

### హాజరైన మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి, చిట్టెం రామ్మోహన్ రెడ్డి

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** కులమతాలకు అతీతంగా ప్రేమ, శాంతి, సోదరభావంతో జీవిస్తూ మానవత్వానికి ప్రాధాన్యమివ్వాలని వివిధ మతాల ఆధ్యాత్మిక గురువులు పిలుపునిచ్చారు. నారాయణపేట్ జిల్లా కేంద్రంలోని కొల్లంపల్లి దర్గా హజ్రత్ సయ్యద్ షా అహ్మద్ ఖుతాల్ హుస్సేనీ అష్రఫీ జలాలీ 552వ వార్షిక ఉర్సు ఉత్సవాలను శుక్రవారం ప్రారంభమయ్యాయి. అష్రఫీయా ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 26వ అఖిలభారత అంతర్‌మత సదస్సుతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. గోగి షరీఫ్ దర్గా సజ్జాద్ నషీన్ సయ్యద్ షా కలీముల్లా హుస్సేనీ అధ్యక్షతన, కొల్లంపల్లి దర్గా సజ్జాదా నషీన్ ముఖ్దూం ఖ్వాజా సయ్యద్ షా జలాల్ హుస్సేనీ అష్రఫీ జలాలీ పర్యవేక్షణలో సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మౌలానా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు వకార్ ఇన్నా, ముజఫర్ హుస్సేన్, ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి, చిట్టె రామ్మోహన్‌రెడ్డి, మైనారిటీ సంక్షేమ అధికారి ఎం,ఎ రషీద్, బిసి సంక్షేమ అధికారి మహమ్మద్ ఖలీల్, బిఆర్ఎస్ నాయకుడు సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వివిధ మతాలకు చెందినా ఆధ్యాత్మిక గురువులు, సామాజిక, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. మతాల బోధనల సారాంశం మానవత్వమే ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అన్ని మతాల బోధనల సారాంశం మానవత్వం, ప్రేమ, శాంతి, సోదరభావమేనని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం ప్రతి ఒక్కరూ సమానమేనని, కులమతాలకు అతీతంగా పరస్పర గౌరవంతో జీవించాలని సూచించారు సూఫీ పీఠాలు ప్రేమ, ఐక్యత, మానవ సేవకు ప్రతీకలని, వాటి సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి అంతర్‌మత సదస్సులు హిందూ, ముస్లింల మధ్య ఐక్యతను బలోపేతం చేయడంతోపాటు అన్ని మతాల మధ్య సౌహార్దాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. వెనుకబడిన ప్రాంతాల్లో విద్య, వైద్యం, సామాజిక చైతన్యానికి ప్రాధాన్యమివ్వాలని పిలుపునిచ్చారు.



**విద్యార్థులకు ధ్రువపత్రాల పంపిణీ :** అనంతరం అష్రఫియా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో వేసవిలో నిర్వహించిన ఉచిత కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. దారుల్ ఉలూమ్ అష్రఫియా మదర్సా విద్యార్థులు ప్రదర్శించిన విద్యా కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అతిథులను దర్గా సజ్జాదా నషీన్ మౌలానా ముఖ్దూం ఖ్వాజా సయ్యద్ షా జలాల్ హుస్సేనీ అష్రఫీ జలాలీ, డాక్టర్ మౌలానా సయ్యద్ అహ్మద్ హుస్సేనీ అష్రఫీ జలాలీ సత్కరించారు. అడ్వకేట్ అబ్దుల్ సలీం వ్యాఖ్యాతగా వ్యవహరించగా, సయ్యద్ ఫైజ్ పాషా కృతజ్ఞతలు తెలిపారు.

## స్వీయ గణనతో సమయం ఆదా

### జనాభా గణనలో ప్రజల భాగస్వామ్యం పెంచాలి

### రాష్ట్ర సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టర్ భారతి హొల్లికేరి

**ప్రజాపక్షం/నారాయణపేట :** జనాభా గణనలో స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్) ద్వారా ప్రజల భాగస్వామ్యాన్ని పెంచి, నిర్ణీత సమయంలో కచ్చితమైన సమాచారాన్ని సేకరించాలని తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్, డైరెక్టర్ ఆఫ్ సిటిజన్ రిజిస్ట్రేషన్ భారతి హొల్లికేరి సూచించారు. స్వీయ గణనపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించి, జనాభా గణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. శుక్రవారం నారాయణ పేట జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సెన్సస్ ఆఫ్ ఇండియా2027 జనాభా గణన రెండోదశ(పాపులేషన్ ఎన్యూమరేషన్) పై జిల్లా సెన్సస్ అధికారులు, ఛార్జ్ క్లర్కులు, సాంకేతిక సహాయకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భారతి హొల్లికేరి మాట్లాడుతూ కుటుంబంలోని సభ్యుల వివరాలను ప్రజలు సంబంధిత యాప్‌లో ముందుగానే నమోదు చేసుకునేలా ప్రోత్సాహించాలని సూచించారు. స్వీయగణన పూర్తయిన అనంతరం ఎన్యూమరేటర్లు కుటుంబాలను సందర్శించి, నమోదు చేసిన వివరాలను పరిశీలించాలని తెలిపారు.



**6.5 లక్షల జనాభాపై ప్రత్యేక దృష్టి :** జిల్లాలో సుమారు 6.5 లక్షల జనాభాను దృష్టిలో ఉంచుకొని, నిర్దేశించిన సమయంలో స్వీయ గణన లక్ష్యాలను సాధించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రియాంక, రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, సీపీఓ ఖాఘ వాహన్‌తో పాటు జిల్లా సెన్సస్ అధికారులు, ఛార్జ్ క్లర్కులు , టెక్నికల్ అసిస్టెంట్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పోరాటంతోనే సమస్యల పరిష్కారం



### పోరాడండి తోడుంటాం : సిపిఐ

**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** ప్రపంచ, దేశ చరిత్రలో పోరాటాలతోనే ప్రజా,ఉద్యోగ సమస్యలు పరిష్కారమయ్యాయి, ఎన్ హెచ్ ఎం లు వెనకడుగు వెయ్యకుండా పోరాడాలని సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్ కోరారు. శుక్రవారం వనపర్తి పట్టణం మర్రికుంట దర్నా చౌక్‌లో ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని చేస్తున్న ఎన్‌హెచ్‌ఎంలకు సిపిఐ పక్షాన మద్ధతు తెలిపి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా వేల సంఖ్యలో, వనపర్తి జిల్లాలో 280 మంది గత 3 రోజులుగా నిలవధిక సమ్మె చేస్తున్న పాలకులు స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. రెగ్యులర్ ఉద్యోగుల కంటే ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ ఉద్యోగులు ఆదనంగా పనిచేస్తున్నారని కానీ రెగ్యులర్ ఉద్యోగులకు వచ్చిన జీతంలో సగం జీతం కూడా రావటం లేదన్నారు. సమాన పనికి సమాన పనికి సమాన వేతనం అమలు ఏమైందని ప్రశ్నించారు. ఎన్‌హెచ్‌ఎం లో పనిచేస్తున్న డాక్టర్లకు రూ.40,000 జీతం మించటం లేదని రెగ్యులర్ ఉద్యోగులకు లక్ష జీతం వస్తుందన్నారు. ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న ఎన్‌హెచ్‌ఎం 2, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నిషియన్లు, డిఇఒలో, ఆపరేటర్లు, ఆయుష్ డాక్టర్లు, డిడిఎంలు టివి కోఆర్డినేటర్లు కాంటినెన్సీ వర్కర్లు అందరి ఉద్యోగాల పరిస్థితి రెగ్యులర్ ఉద్యోగులతో పోలిస్తే ఇదే రకంగా ఉందన్నారు. ప్రభుత్వం ఎన్‌హెచ్‌ఎం ల శ్రమదోపిడి చేస్తోందన్నారు. కరోనా కాలంలో ఎన్‌హెచ్‌ఎంలు తమ ప్రాణాలను పణంగా పెట్టి రోగులను కాపాడాలని, వారి త్యాగాలను ప్రభుత్వం ప్రభుత్వం గుర్తించాలన్నారు. రోజురోజుకూ నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని, జీతాలు మాత్రం పెంచడం లేదన్నారు. సిపిఐ నేతలు వృద్వినాధం, చిన్న కురుమన్న,వంశీ, ఎన్‌హెచ్‌ఎం జేఏసి నాయకులు పరుశరాం, ఖాజా హుస్సేన్, డాక్టర్లు శశాంక్, హేమవర్ధన్,మైధిలి, నిహారిక, సెకండ్ ఎఎన్‌ఎంలు కృష్ణవేణి, సుమిత్ర, టిఎస్టీఓ నేతలు మహేశ్వర చారి, గంధం రాజు, కొండా శ్రీనివాసులు, స్టాఫ్ నర్సు సరిత, డాటా ఎంట్రీ ఆపరేటర్లు రాఘవేందర్, వెంకటేష్, మదన్, భాగ్యలక్ష్మి, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

## అస్తవ్యస్తంగా డ్రైనేజీలు, సిసి రోడ్లు

### 4వ వార్డులో సిసి రోడ్లు, డ్రేనేజీలు నిర్మించాలి

### సిపిఐ నేతల డిమాండ్

**ప్రజాపక్షం/అమరచింత :** అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలో అస్తవ్యస్త డ్రైనేజీలతో సిసి రోడ్లతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఐ మండల కార్యదర్శి ఎ.అబ్రహం, నాయకులు భాస్కర్, శ్యాంసుందర్ విచారం వ్యక్తం చేశారు. శుక్రవారం అమరచింత మున్సిపాలిటిలో నెలకొన్న స్థానిక సమస్యల పై సిపిఐ పోరుబాట కార్యక్రంలో భాగంగా సిపిఐ నేతృత్వంలో అమరచింత మున్సిపల్ పరిధిలోని నాలుగవ వార్డులో పర్యటించి, ప్రజలను కలిసి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి అబ్రహం, సిపిఐ నాయకులు శ్యాంసుందర్, ఏ భాస్కర్ మాట్లాడుతూ అమరచింత మున్సిపల్ అభివృద్ధికై రూ. 15 కోట్ల నిధులతో ఈ వార్డులోనే భూమి పూజ చేసిన రాష్ట్ర మంత్రి వాకిట శ్రీహరి ఇప్పటివరకు ఈ వార్డులో సిసి రోడ్లు గాని డ్రైనేజీలు గాని ప్రారంభించలేదని ఆరోపించారు. అలాగే వార్డులో పార్కు ఉన్నప్పటికి పర్యవేక్షణ లోపంతో పార్కు నిరుపయోగంగా మారిందని పార్కును అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. అనేక సంవత్సరాలుగా ఈ వార్డులో డ్రైనేజీ లేక వార్డు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వీడి వార్డులో సిసి రోడ్లు డ్రైనేజీ పనులు ప్రారంబించాలని లేని పక్షంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు సౌలు, ఇశ్రాయిల్, నిసార్, పుష్పమ్మ, బాలేశ్వరి, లక్ష్మి, పూర్ణిమ, రాధా, వరలక్ష్మి తో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.



### హమాలీలు, స్వీపర్లకు

## రెండు జతల యూనిఫాం పంపిణీ

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**ప్రజాపక్షం/గద్వాల్ రూరల్ :** దసరా పండుగను పురస్కరించుకుని హమాలీలు, స్వీపర్లకు యూనిఫాం దుస్తులను అందజేసిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శుక్రవారం ఐడిఓసి కలెక్టర్ ఛాంబర్ నందు పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో దసరా పండుగను పురస్కరించుకుని హమాలీలు, స్వీపర్లకు రెండు జతల యూనిఫాం దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దసరా పండుగను కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవాలని పౌరసరఫరాల సంస్థ ప్రతి ఏటా ఎం.ఎల్.ఎస్ పాయింట్స్‌లో హమాలీలు, స్వీపర్లుగా విధులు నిర్వహిస్తున్న వారికి బోనస్, దుస్తులు అందజేస్తున్నదని అన్నారు. జిల్లాలోని గద్వాల, అలంపూర్, అయిజ, మానవపాడు, ఎంఎల్‌ఎస్ పాయింట్లలో విధులు నిర్వహిస్తున్న 34 మంది హమాలీలు, నలుగురు స్వీపర్లు కలిపి మొత్తం 38 మందికి ఈ ఏడాది దసరా ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికీ రెండు జతల యూనిఫాం దుస్తులను నేడు పంపిణీ చేసినట్లు తెలిపారు. అదే విధంగా ప్రతి హమాలీకి, స్వీపర్‌కు రూ.8500 ప్రోత్సాహక నగదు, స్వీట్ బాక్స్‌కు బదులుగా రూ.1000 నగదు ఇప్పటికే వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు పేర్కొన్నారు. యూనిఫాం కుట్టు ఖర్చుల నిమిత్తం హమాలీలకు రూ.1,800 చొప్పున, స్వీపర్లకు రెండు బ్లౌజుల కుట్టు ఖర్చుల కోసం రూ.800 చొప్పున నగదును కూడా ముందుగానే జమ చేసినట్లు వివరించారు. హమాలీలు, స్వీపర్లు నిరంతరం కష్టపడి పనిచేస్తూ తమ విధుల పట్ల అంకిత భావంతో వ్యవహరిస్తున్నారని కలెక్టర్ అభినందించారు. ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో కలిసి దసరా పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి స్వామి కుమార్, హమాలీలు, స్వీపర్లు, సంబంధిత శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## విద్యుత్ అంతరాయంపై సబ్ స్టేషన్ ముందు ధర్నా

**ప్రజాపక్షం/పానుగల్ :** విద్యుత్ అంతరాయం పై పానుగల్ మండల పరిధిలోని కేతేపల్లి గ్రామ సబ్ స్టేషన్ ముందు తెల్లరాలపల్లి, తండా గ్రామాలకు చెందిన రైతులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల్యానాయక్ మాట్లాడారు. ఉదయం తెల్లవారుజామున 4 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు నిరంతర విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని 12 గంటలకు గాను 7 గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా అవుతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులను ఏదుర్కొంటున్నారని మధ్య మధ్యలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పారిన మడి మళ్ళి పారాల్సి వస్తుందన్నారు. తీవ్రమైన ఎండల కారణంగా రోజు వారిగా సాగు నీరు పారించాల్సి వస్తుందన్నారు. విద్యుత్ అధికారులతో మాట్లాడగా రైతుల పంటలు ఎండనివ్వకుండా నిరంతరంగా 12 గంటలు విద్యుత్ ను అంతరాయం లేకుండా సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. కార్యక్రమంలో గ్రామాల రైతులు పాల్గొన్నారు.





## ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యం

మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో కౌన్సిలర్లు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, ఇన్‌చార్జీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు విశేషంగా పాల్గొని రాబోయే ఎన్నికల వ్యూహాలు, ప్రచార సరళిపై సుదీర్ఘంగా చర్చించారు.ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు పరస్పర సమన్వయంతో క్షేత్రస్థాయిలో పనిచేయాలని బత్తుల లక్ష్మి రెడ్డి సూచించారు. నల్గొండ ఖమ్మం వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోతంరెడ్డి విజయానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని, ఎన్నికల కార్యాచరణను గ్రామ స్థాయి వరకు సమర్థవంతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రచారాన్ని వేగవంతం చేసి పట్టభద్రుల ఓటర్లను నేరుగా కలవాలని దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## డిండి రైతులకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు...సిఎండి హామీ..

పెండింగ్ డిటిఆర్‌ల విడుదలకు విజ్ఞప్తి....తాత్కాలిక ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు హామీ



**ప్రజాపక్షం/డిండి :** డిండి రిజర్వాయర్‌లో నీటి నిల్వలు తగ్గడంతో పంటలను కాపాడుకునేందుకు వ్యవసాయ బోర్లపై ఆధార పడుతున్న రైతులకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. శుక్రవారం రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టిజిఎస్‌పిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సిఎండి)కి విజ్ఞప్తి చేశారు. ఎంఎల్‌ఏ విజ్ఞప్తిపై స్పందించిన సిఎండి అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. డిమాండ్ డ్రాఫ్టులు (డిడి)లు చెల్లించి ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న రైతులకు పెండింగ్‌లో ఉన్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే విడుదల చేసి ఏర్పాటు చేయాలని ఎంఎల్‌ఏ కోరారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలను కాపాడుకునేందుకు అత్యవసరంగా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను తాత్కాలిక ప్రాతిపాదికన ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎంఎల్‌ఏ బాలునాయక్ విజ్ఞప్తిపై సిఎండి సానుకూలంగా స్పందిస్తూ, రైతుల అవసరాలను పరిశీలించి అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతుల పంటలను కాపాడేందుకు విద్యుత్ శాఖ అధికారులు ప్రాధాన్యతతో పనిచేయాలని ఎంఎల్‌ఏ కోరారు. ఈ కార్యక్రమంలో డిండి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## 'ఎల్‌నినో'తో ఇబ్బందులు రాకుండా ప్రణాళికలు

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జిల్లాలో ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా త్రాగునీరు, తాగునీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని, ఇందులో భాగంగా రానున్న జులై నెల వరకు ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి తాగునీరు ఇచ్చేలా సూక్ష్మ స్థాయి ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సమావేశ మందిరంలో ఎల్‌నినో ప్రభావం వల్ల జిల్లాలో ప్రస్తుతం వ్యవసాయ పంటల పరిస్థితి, సాగునీరు, తాగునీరు, విద్యుత్, విబిజిరాంజీ ఉపాధి హామీ పనులు, భూగర్భ జలాలపై ఆర్‌డిఓలు, తహాశీల్దార్లు, ఎంపిడిఓలు, ఎంఏఓలు, ఎంపిఓలు, మున్సిపల్ కమీషనర్లు, అగ్రికల్చర్, విద్యుత్, ఇరిగేషన్, ఆర్టికల్చర్, పశుసంవర్ధక సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ శాఖ అంచనా ప్రకారం జిల్లా వ్యాప్తంగా 19 మండలాల్లో సాధారణంగా 572మీ.మీ. ఉండాల్సిన వర్షపాతం 438మీ.మీ. వర్షపాతం నమోదైందన్నారు. గత ఏడాది ఇదే నెలలో 719 మీ.మీ. వర్షపాతం జిల్లా వ్యాప్తంగా నమోదైందన్నారు. నాలుగు మండలాల్లో తిరుమలగిరి, మద్దిరాల, మట్టపల్లి, మేళ్లచెరువులో మాత్రమే సాధారణ వర్షపాతం ఉందని, ఎల్‌నినో వల్ల భూగర్భ జలాలు, తాగునీరు, వ్యవసాయంపై ప్రభావం ఎక్కువగా ఉందని, రైతుల వరివేయకుండా ఉద్యాన పంటలు, పెసర్లు, కందులు వేసేలా అవగాహన కల్పించాలని, రబీలో పెసర్లు, ఉలవలు వంటివి పండించేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఈ విషయంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డిఆర్‌ఓ ప్రేమ్‌రాజ్, జడ్‌పి సిఈఓ శిరీష, డిఆర్‌డిఓ సన్యాసయ్య, డిఏఓ శ్రీధర్ రెడ్డి, ఇరిగేషన్ అధికారులు, ఎలక్ట్రిసిటి ఎస్‌సి, డిఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ, డిఈఓ శ్రీనివాస్, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఎల్‌నినోను ఎదుర్కోవాలంటే జలసిరి పనులే కీలకం



**ప్రజాపక్షం/నకిరేకల్ :** రాబోయే రోజుల్లో ఎదురయ్యే ఎల్ నినో ప్రభావం, నీటి ఎద్దడి ముప్పును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం జలసిరి పనులు ఒక్కటే కిలకమని అడిషనల్ కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం మండలంలోని నెల్లిబండ గ్రామంలో నీటి సంరక్షణ ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా తమ పొలాల్లో పంట గుంటలు తవ్వుకున్న రైతులందరికీ జీవనోపాధిని మెరుగుపరిచేందుకు ప్రత్యేక సబ్సిడీ లోన్లు ఇప్పిస్తామని తెలిపారు. ఎంపిడిఓ జి.బ్రహ్మాచారి మాట్లాడుతూ అర్హులైన రైతులు బర్లు,గొర్రెలు,కోళ్ల షేడ్స్ వంటి జీవనోపాధి యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం నుండి అందే సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భవిష్యత్తులో నీటి కొరత రాకుండా ప్రతి ఒక్కరూ ఇంటికి ఇంకుడు గుంత, పొలానికి పంట గుంత, ఊరికి ఊట గుంట ఏర్పాటు చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆడెపు రాఘవులు,ఉపసర్పంచ్ యానాల సరిత,ఏపీఓ రమణయ్య, టెక్నికల్ అసిస్టెంట్ సూరయ్య,గ్రామ కార్యదర్శి స్వాతి,వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

# 'ఆక్సీ నౌ' గ్యాస్ కంపెనీలో పేలుడు

ఒకరు మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు, చికిత్స కోసం తరలింపు

కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు







**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ పరిధిలోని గ్రీన్ ఇండస్ట్రీయల్ పార్క్‌లో శుక్రవారం ఘోర ప్రమాదం జరిగింది.పార్క్‌లోని ఆక్సి నౌ మెడికల్ , పరిశ్రమ గ్యాస్ కంపెనీలో సిలిండర్‌లలోకి గ్యాస్ రిపిల్లింగ్ చేస్తుండగా గ్యాస్ లీక్ అయ్యి ఒక్కసారిగా పేలుడు సంబవించింది.ఈ ప్రమాదంలో ఒక కార్మికుడు మృతి చెందగా,ఇద్దరు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు.కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం ఆక్సి నౌ మెడికల్ మరియు పరిశ్రమ గ్యాస్ కంపెనీ శుక్రవారం మధ్యాహ్నం 1:30 గంటలకు సిలిండర్లలో గ్యాస్ రిపిల్లింగ్ చేస్తుండగా గ్యాస్ లీక్ అయ్యింది.కార్మికులు అప్రమత్తం అయ్యేలోపల భారీ పేలుడు సంబవించింది.డ్యూటీలో 12 మంది కార్మికులు పని చేస్తుండగా భోజన విరామం కావడంతో ముగ్గురు కార్మికులు పని చేస్తున్నారు.పేలుడు దాటికి బీహార్ రాష్ట్రం సమస్తిపూర్ జిల్లా చెక్కునూర్ గ్రామానికి చెందిన మనీష్‌కుమార్(21) శరీరం రెండు ముక్కలు అయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు.రంగారెడ్డి జిల్లా ఇబ్రహింపట్నం మండలం దండుమైలారం గ్రామానికి చెందిన మాతురి హరిప్రసాద్(23) కుడి కాలు తెగిపోయి తీవ్రగా గాయపడ్డాడు.అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పెద్దఅంబర్‌పేట్ గ్రామానికి చెందిన రావి రాంరెడ్డి(43) కి పేలుడు దాటికి సిలిండర్‌లు గాల్లో ఎగిరి మీద పడడంతో కాలు విరిగింది. మృతి చెందిన మనీష్‌కుమార్ మృతదేహాన్ని సికింద్రబాద్‌లోని గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించగా,హరిప్రసాద్‌ను కామినేని ఆసుపత్రికి, రాంరెడ్డిని గ్లోబల్ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు.ఈ ప్రమాదం తెలుసుకున్న జిల్లా ఫైర్ అధికారి కె.మధుసూధన్ రావు ఘటన స్థలాన్ని పరిశీలించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ మన్మథకుమార్ తెలిపారు.

# స్వల్పకాలిక పంటలే మేలు

ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు అప్రమత్తంగా ఉండాలి

దాసరి హరిచందన



**ప్రజాపక్షం/నల్లగొండ:** ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు యాసంగి సీజన్‌లో ఎట్టి పరిస్థితుల్లోనూ బోర్లు, బావుల కింద వరి సాగు చేయవద్దని రాష్ట్ర కార్మిక,ఉపాధి,శిక్షణ శాఖల కార్యదర్శి, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎల్‌నినో ప్రత్యేక అధికారి దాసరి హరిచందన సూచించారు. నీటి లభ్యతను అంచనా వేసుకొని తక్కువ నీరు అవసరమయ్యే స్వల్పకాలిక పంటలను సాగు చేయడం ద్వారా రైతులు ఆర్థిక నష్టాల నుంచి బయటపడాలని ఆమె కోరారు. ఎల్‌నినో ప్రభావం వ్యవసాయం, పంటల సాగు, తాగునీరు, విద్యుత్ సరఫరాపై చూపే ప్రభావాన్ని సమీక్షించేందుకు శుక్రవారం ఆమె నల్లగొండ జిల్లాకు వచ్చారు.జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని ఉదయాదిత్య భవన్‌లో ఎల్‌నినో ప్రభావంపై ఉమ్మడి నల్లగొండ జిల్లాలైన నల్లగొండ,సూర్యాపేట,యాదాద్రిభువనగిరి జిల్లాలలో ప్రస్తుత వ్యవసాయ పంటల పరిస్థితి,సాగునీరు, తాగునీరు, విద్యుత్,భూగర్భ జలాలపై మూడు జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు అనంతరం కనగల్ మండలం శేరిలింగోటం గ్రామ పరిధిలో నీటి కొరతతో ఎండిపోయిన వరి, పత్తి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంటలు ఎండిపోవడానికి గల కారణాలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి చెందిన వరి,పత్తి రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి అనుభవాలను తెలుసుకున్నారు. వరి వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటలను సాగు చేయడం వల్ల భూగర్భ జలాలపై ఒత్తిడి పెరగడమే కాకుండా,బోర్ల ద్వారా నీటిని తోడేందుకు విద్యుత్ వినియోగం కూడా అధికమవుతుందని వివరించారు. తీరా పంట చేతికి అందకపోతే రైతులు పెట్టిన పెట్టుబడులను కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.ఇప్పటికే పంట నష్టాన్ని అనుభవిస్తున్న రైతులు తమ అనుభవాలను తోటి రైతులతో పంచుకోవాలని, ఇతర రైతులు కూడా అదే పరిస్థితిని ఎదుర్కోకుండా అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్,సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్,జిల్లా వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్,ఉద్యాన శాఖ అధికారి శేఖర్, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈవోలు), ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సాంస్కృతిక వారసత్వానికి, తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి బతుకమ్మ పండుగ ప్రతీక అని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. బతుకమ్మ సంబరాల్లో భాగంగా శుక్రవారం ప్రభుత్వం ఆదేశాల మేరకు, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆయన ముఖ్య అతిధిగా హాజరై జిల్లా ప్రజలందరికి శుభాకాంక్షలు తెలిపారు. అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డిఆర్‌ఓ ప్రేమ్‌రాజ్, జడ్‌పి సిఈఓ శిరీష, డిఆర్‌డిఓ సన్యాసయ్య, పరిశ్రమల శాఖ జిఎం భారతి, డిఐఈఓ సులోచన రాణి, డిఎస్‌డిఓ లత, డిఎంహెచ్‌ఓ వెంకటరమణ, ట్రైనీ డిప్యూటి కలెక్టర్లు రవితేజ, అనూష, డిసిహెచ్ఎస్ వెంకటేశ్వర్లు, డిడబ్ల్యుఓ నరసింహారావు పాల్గొన్నారు.

### మహిళా పోలీసు సిబ్బందితో కలిసి బతుకమ్మ సంబరాల్లో జిల్లా ఎస్‌పి కె. నరసింహ



సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం మహిళా పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, చిన్నారుల సమక్షంలో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్‌పి కె. నరసింహ ఉత్సవాలను ప్రారంభించి, మహిళా పోలీసు సిబ్బందితో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా పోలీసు సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి మంజు భార్గవి, డిఎస్‌పి నరసింహ చారి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ప్రవీణ్ కుమార్, జానయ్య, మహిళా సూపరింటెండెంట్‌లు సబితారాణి, శ్రీదేవి, మహిళా ఎస్‌ఐలు ఝాన్సీరాణి, తేజస్విని, మహిళా సిబ్బంది అరుణ, కవిత, జ్యోతి పాల్గొన్నారు.

## పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రాధాన్యం

నేరాల నియంత్రణకు సిసిటివిల ఏర్పాటు చేయాలి :డిఎస్‌పి



**ప్రజాపక్షం/తిరుమలగిరి (సాగర్):** నేరాల నియంత్రణ,నేరస్తుల గుర్తింపులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని డిఎస్‌పి జి.రవి ఆదేశించారు.తిరుమలగిరి (సాగర్) పోలీస్ స్టేషన్‌ను మిర్యాలగూడ డిఎస్‌పి శుక్రవారం సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి,కేసుల పురోగతిని సమీక్షించారు.పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించడంతోపాటు,ప్రతి కేసులో సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ సిబ్బందికి సూచించారు.గ్రామాల్లో నేరాల నివారణకు సీసీటీవీ కెమెరాల ఏర్పాటు ఆవశ్యకతను ప్రజలకు వివరించి,స్థానికుల సహకారంతో కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.నేరాలు జరిగినప్పుడు సాంకేతిక ఆధారాలను సేకరించి,నిందితులను త్వరితగతిన గుర్తించేలా దర్యాప్తు నిర్వహించాలని స్పష్టం చేశారు.ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా వ్యవహరించాలిఅనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడిన వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా, గౌరవంగా వ్యవహరించాలని, ప్రజల్లో పోలీసులపై నమ్మకాన్ని మరింత పెంపొందించేలా విధులు నిర్వహించాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ లేకుండా పనిచేస్తూ,ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని ఆయన సూచించారు.ఈ తనిఖీలో సాగర్ సర్కిల్ సీఐ శీను నాయక్,ఎస్‌ఐ వీరశేఖర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తొలిదశలోనే గుర్తిస్తే కేన్సర్ నయం

డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి, గ్రంథాలయ చైర్మన్ రామారావు



**ప్రజాపక్షం/కోదాడ:** స్వర్ణ భారతి ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం కోదాడ పట్టణంలోని కిట్స్ మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో బసవతారకం క్యాన్సర్ హస్పటల్, లయన్స్ క్లబ్ ఆసుపత్రి వారి సహకారంతో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, కిట్స్ కళాశాల చైర్మన్, స్వర్ణభారతి ట్రస్టు అధ్యక్షులు నీలా సత్యనారాయణ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి నుండి మూడు రోజుల పాటు ఈ శిబిరం ఉంటుందని నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా క్యాన్సర్‌ను మొదటి దశలోనే గుర్తిస్తే చికిత్స సులభం అవుతుందని, ప్రతి ఒక్కరు స్క్రీనింగ్ టెస్టు చేయించుకోవాలని కోరారు. హైద్రాబాద్ వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లనవసరం లేకుండా నైపుణ్యం కలిగిన వైద్యులచే పదివేల రూపాయల టెస్టులు కూడా ప్రీగా చేస్తున్నందున క్యాన్సర్ పట్ల భయం వీడాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు చారుగండ్ల ప్రవీణ రాజశేఖర్, వెంపటి వెంకటనారాయణ, పైడిమర్రి సత్యబాబు, యాదా సుధాకర్, వంగవీటి రంగారావు, స్వామి శ్రీనివాస్, స్వామి పుల్లయ్య, ఇమ్మడి చక్రీ, రవీందర్, బొగ్గారపు రామ్మూర్తి పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే లక్ష్యం

పిఆర్‌సి సాధనకు సమరశంఖం :ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ :** ఉద్యోగ,ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా,పోరాటమే ఆయుధంగా ముందుకు సాగుతామనిఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రకటించారు.నల్లగొండలోని జీఎం గార్డెన్‌లో శుక్రవారం జరిగిన పీఆర్టీయూటీఎస్ 6వ రాష్ట్ర కౌన్సిల్ రెండో రోజు సమావేశంలో ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే 72,457 మంది ఆన్‌లైన్ సభ్యత్వంతో అతిపెద్ద సంఘంగా పీఆర్టీయూ నిలిచిందని పేర్కొన్నారు. ఇంతటి బలమైన సంఘానికి నూతన నాయకత్వంగా ఎన్నికైన భిక్షంగౌడ్,మధుసూదన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు నూతన నాయకత్వం గురుతర బాధ్యతను భుజాన వేసుకోవాలని సూచించారు. రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ అధికారిక అభ్యర్థిగా సుంకరి భిక్షంగౌడ్ పేరును ప్రకటించారు. రాష్ట్ర పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు పేరి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఎంప్లాయీస్ హెల్త్ కార్డుల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, పీఆర్సీ సాధన కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందని అన్నారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో భిక్షంగౌడ్‌కు పెన్షనర్ల సంఘం తరఫున సంపూర్ణ మద్దతు ప్రకటించారు.నూతన అధ్యక్షుడు,ఎమ్మెల్సీ అభ్యర్థి సుంకరి భిక్షంగౌడ్ మాట్లాడుతూ ఉద్యోగ,ఉపాధ్యాయ,నిరుద్యోగ,పట్టభద్రుల సమస్యల పరిష్కారం కోసం చట్టసభల్లో తన గొంతు వినిపించేందుకు ఎమ్మెల్సీ అభ్యర్థిగా వస్తున్నానని తెలిపారు.గత ప్రభుత్వం సమస్యల పరిష్కారంలో తాత్సారం చేసి మూల్యం చెల్లించుకుందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా మొండిగా వ్యవహరిస్తోందని అన్నారు.10 ఏళ్లలో ఒక్క ప్రమోషన్ కూడా ఇవ్వని పార్టీ అభ్యర్థికి, ఒక్క డిమాండ్ కూడా నెరవేర్చని ప్రస్తుత ప్రభుత్వ అభ్యర్థికి ఓటేయడం అంటే వారి వైఖరికి మద్దతు ఇచ్చినట్లేనని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మోహన్ రెడ్డి,పీఆర్టీయూ అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి,జగన్మోహన్ గుప్తా, కోమటిరెడ్డి నరసింహారెడ్డి, ఆడిట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి,నల్లగొండ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కళం నారాయణరెడ్డి,జానారెడ్డి,గీత, వాణి, విజయలక్ష్మి,కళావతి,శ్రీవిద్య,జానకి,సత్యవతితో పాటు 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు,రాష్ట్ర,జిల్లా,మండల బాధ్యులు, ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వాకర్స్ మృతి...

ఒకరికి తీవ్ర గాయాలు

పోలీస్ స్టేషన్ ఎదుట మృతుల, బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన





**ప్రజాపక్షం/సూర్యాపేట :** డిసిఎం ఢీకొనడంతో ఇద్దరు వాకర్లు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున సూర్యాపేట మండలంలోని బాలెంల గ్రామ స్టేజీ వద్ద చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జనగాం నుండి సూర్యాపేట వైపు వస్తున్న డిసిఎం బాలెంల స్టేజీ సమీపంలో మార్నింగ్ వాక్ చేస్తున్న గుర్రం సైదులు, ఆలకుంట్ల నాగరాజు, గొల్ల జానయ్యలను వెనుకనుండి బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో గుర్రం సైదులు (38) అక్కడికక్కడే మృతి చెందగా, ఆలకుంట్ల నాగరాజు (40) సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గొల్ల జానయ్య అనే వ్యక్తి తలకు బలమైన గాయం కావడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతులు సైదులుకు భార్య ఇద్దరు కుమార్తెలు ఉండగా, నాగరాజుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతులు అందరూ కూలీనాలి చేసుకొని జీవనం సాగిస్తుండగా బలమైన గాయాలు తగిలి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జానయ్య చిరు వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన డిసిఎంను, డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రోడ్డు ప్రమాద సంఘటనా స్థలానికి జిల్లా ఎస్‌పి కె. నరసింహ, డిఎస్‌పి ప్రసన్న కుమార్, రూరల్ సిఐ రాజశేఖర్‌లు సందర్శించి ప్రమాదానికి గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఒకేసారి మృతి చెందడంతో బాలెంల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ అనిల్ రెడ్డి కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నారు.

**పోలీస్ స్టేషన్ ఎదుట మృతుల, బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన**

మృతుల, బాధిత కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. వీరి ఆందోళనకు బాలెంల గ్రామస్తులు, వారి బంధువులు మద్ధతుగా పెద్దఎత్తున హాజరై నిరసన తెలిపారు. ప్రమాదానికి కారణమైన డిసిఎం డ్రైవర్, యజమానిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరుపేద కుటుంబాలకు చెందిన వారు కావడంతో వారికి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ప్రమాద సంఘటన విషయంలో పోలీసులు అనుసరించిన విధానం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీస్ స్టేషన్‌లోకి ఆందోళనకారులు దూసుకెళ్లే ప్రయత్నం చేయడంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. దీంతో పోలీసులు పెద్ద ఎత్తున మోహరించి ఆందోళనకారులను చెదరగొట్టారు.

## సర్వోత్తమ్ రెడ్డిని ఎమ్మెల్సీగా గెలుపొందించాలి

ఎమ్మెల్యే మందుల సామేల్

**ప్రజాపక్షం/నూతనకల్ :** నల్లగొండవరంగల్ ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఓటరు సహాయ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కట్ట మల్లారెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు జెన్నారెడ్డి, వివేక్‌రెడ్డి, నాయకులు నాగం సుధాకర్ రెడ్డి, పసుల అశోక్ యాదవ్, నకిరేకంటి వెంకన్న, పాల్వాయి నాగరాజు, బంటు బద్రి పాల్గొన్నారు.



## తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు




ప్రజాపక్షం/రంగారెడ్డి: తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా, సమర్థవంతంగా వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎల్ నినో ప్రత్యేక అధికారి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ ఆదేశించారు. శుక్రవారం ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి , మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి, వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, టిజిపిసిడి ఎల్ చైర్మన్ జితేష్ వి.పాటిల్, మేడ్చల్ అదనపు కలెక్టర్‌లు ఫైజల్ అహ్మద్,(వికారాబాద్ అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు, మేడ్చల్ జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



ప్రజాపక్షం/రంగారెడ్డి: రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను నియంత్రించేందుకు షాద్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, మైనర్లు వాహనాలు నడిపిన కేసుల్లో పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశం వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. షాద్‌నగర్ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ 2 క్లాస్ కోర్టులో మొత్తం 27 కేసులు పరిష్కరించగా, రూ.49,200 జరిమానా విధించినట్లు వెల్లడించారు.

## ఉపాధి కొల్లగొడుతున్న కేంద్రం



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్: కార్పొరేట్ వ్యవస్థను ప్రోత్సహిస్తూ, కష్టజీవుల ఉపాధిని కొల్లగొడుతున్న కేంద్ర ప్రభుత్వంను ప్రజలే బుద్ధిచెప్పే రోజులు దగ్గరలోనే ఉందని బైరామల్‌గూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం బైరామల్ గూడ డివిజన్ పరిధిలోని సంతోషిమాత రోడ్డులో నాయి బ్రాహ్మణులు ఉపాధి కోల్పోతున్నారని నిర్వహించిన ధర్నాకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వృత్తిదారుల పొట్టకొట్టి కార్పొరేటర్ శక్తులకు మార్గం సుగమం చేయడమంటే వారిని అణగదొక్కడమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తిప్పర్తి విజయభాస్కర్‌రెడ్డి, శివకుమార్, నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రవీంద్ర నాయి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి కామోజీ నాయి, నాయకులు బాలకృష్ణ, మల్లేష్ నాయి తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి అక్రమ రవాణాపై నిఘా

ప్రజాపక్షం/శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మండల పరిధిలోని మోకిలా పోలీస్ స్టేషన్‌ను ఫ్యూచర్ సిటీ పోలీస్ డిసిపి యోగేష్ గౌతమ్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. దసరా పండుగ నేపథ్యంలో పోలీస్ స్టేషన్ పరిధిలో గస్తీని ముమ్మరం చేయాలని డిసిపి ఆదేశించారు. కార్యక్రమంలో సిఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐలు లక్ష్మణ్, సురేష్‌గౌడ్, పద్మ పాల్గొన్నారు.

## ఎల్ నినో ప్రభావంపై గ్రామసభ



ప్రజాపక్షం/శంకర్‌పల్లి: గ్రామాల్లో ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని ఎపిఒ నాగభూషణం పేర్కొన్నారు. శుక్రవారం ఎల్ నినో వర్షాబావ పరిస్థితుల రీత్యా మండలంలోని కొత్తపల్లి గ్రామం సర్పంచ్ బల్వంత్ రెడ్డి అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఒ నాగభూషణం మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న కారణంగా నీటిని పొదుపుగా వాడుకోవాలని, విద్యుత్తును కూడా పొదుపుగా వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, మహిళా సంఘాలు, రైతులు పాల్గొన్నారు.

మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఫంక్షన్ హాల్ ఏర్పాటు.

## మున్నూరు కాపు సంఘం భవనం ప్రారంభం



ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : గచ్చిబౌలి డివిజన్ పరిధీలోని రాయదుర్గంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో మున్నూరు కాపు సంఘం పటేల్ భవన్ ను ప్రారంభించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, గాలి అనిల్, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాలు విచ్చేసి మున్నూరు కాపు సంఘం భవనాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ భవనాన్ని ప్రత్యేకంగా మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా పెళ్ళిళ్ళు, ఫంక్షన్లు, శుభాకార్యలకు అనుకూలంగా అన్నిసౌకర్యాలతో నిర్మించామని తెలిపారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం నాయకులు మాధవరం నర్సింగ్ రావు, తుడి ప్రవీణ్, సంపత్, నాగం స్వామి, నాగం మల్లికార్జున్, రౌతు కనకయ్య, సల్ల కృష్ణ, రేగుల రాజు, చందు తదితరులు పాల్గొన్నారు.

# ‘ఎల్ నినో’ ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు

ఇప్పుడున్న నీరు డిసెంబరు వరకు మాత్రమే సరిపోతుంది

విద్యుత్, నీటిని పొదుపుగా వాడాలి

రీసైక్లింగ్ నీటిని ఇతర అవసరాలకు వాడాలి

ప్రతి కుటుంబం 20శాతం నీటి వినియోగాన్ని తగ్గించాలి

ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్



ప్రజాపక్షం /హైదరాబాద్ సిటీ : హైదరాబాద్ జిల్లాలో ఎల్ నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్‌రంజన్ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల, జలమండలి ఎండి అశోక్‌రెడ్డి, టిజిఎస్‌పిడిసిఎల్ ఎండి జితేష్ పాటిల్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్, వాతావరణ శాస్త్రవేత్త శ్రావణి, భూగర్భ జల సంచాలకులు హరీష్‌లతో పాటు సంబంధిత శాఖల అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ జిల్లా అర్బన్ ప్రాంతం కావడంతో తాగునీటి అవసరాలు, విద్యుత్ వినియోగం అధికంగా ఉంటుందని, అందుకే రానున్న రోజుల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. జిల్లాలో ఎల్ నినో ప్రతికూల వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటి సంరక్షణ, భూగర్భజలాల పరిరక్షణ, విద్యుత్ పొదుపు నకు ముందస్థు చర్యలు చేపట్టాలన్నారు. ఈ ఏడాది మంజీరా, సింగూరు జలాశయాల వద్ద వరద ప్రవాహం రాకపోవడంతో ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీరు డిసెంబరు వరకు మాత్రమే సరిపోతుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ నీటి వనరుల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. గోదావరి నీటి పథకం ద్వారా అదనపు నీటిని అందుబాటులోకి తీసుకురావడంతో పాటు కృష్ణా జలాల నుంచి అదనపు నీటిని తీసుకురావడం, హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ వద్ద అదనపు ఫిల్టర్ బెడ్‌లను ఏర్పాటును పరిశీలిస్తున్నామన్నారు. జలమండలి పరిధిలో గుర్తించిన పదమూడు శుద్ధి చేసిన ఫిల్లింగ్ స్టేషన్లలో మూడు నుంచి నాలుగు ప్రస్తుతం పనిచేస్తున్నాయన్నారు. నవంబరు ఒకటి నాటికి మొత్తం పదమూడు స్టేషన్లను అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నామని చెప్పారు. మరో 20 ఫిల్లింగ్ స్టేషన్లను రానున్న పదిహేను రోజుల్లో ఏర్పాటు చేస్తామన్నారు. అన్ని ప్రాంతాల్లో ల్యాండ్ స్కేపింగ్‌కు శుద్ధి చేసిన నీటిని తప్పనిసరిగా వినియోగించేలా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఉన్న ఉమ్మడి పది జిల్లాలకు పది మంది సీనియర్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించి ఎల్ నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు చర్యలు చేపట్టిందని చెప్పారు. ప్రతి కుటుంబం 20శాతం నీటి వినియోగం తగ్గించేలా వివిధ మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించనున్నామన్నారు. జలమండలి పైప్‌లైన్లకు అక్రమంగా మోటార్లను తగిలించి నీటిని తోడుకునే వారిని గుర్తించి వాటిని తొలగించడంతో పాటు అవసరమైన చోట జరిమానాలు, అపరాధ రుసుములు విధిస్తామని తెలిపారు. మూసీ నదిలో విడుదల అవుతున్న శుద్ధి చేసిన మురుగునీటిని పారిశ్రామిక అవసరాలకు, డేటా సెంటర్లకు, తోటల పెంపకానికి, ల్యాండ్ స్కేపింగ్, సెంట్రల్ మీడియన్ల నిర్వహణ వంటి తాగునీటి అవసరం లేని లేని పనులకు వినియోగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ నారాయణ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజాసేవలో నిజాయితీ, క్రమశిక్షణే కీలకం



ఎపి ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా

ఘనంగా ఎపి ఎక్సైజ్ ఎస్‌ఐల పాసింగ్ అవుట్ పరేడ్

ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రజారోగ్య పరిరక్షణతోపాటు అక్రమ మద్యం, మాదకద్రవ్యాల రవాణా నియంత్రణలో ఎక్సైజ్ అధికారులు కీలక పాత్ర పోషించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా పిలుపునిచ్చారు. ప్రజాసేవలో నిజాయితీ, ధైర్యం, క్రమశిక్షణ, వృత్తి నైపుణ్యంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. హైదరాబాద్‌లోని రాజా బహదూర్ వెంకట రామిరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్న ఎపి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ల పాసింగ్ అవుట్ పరేడ్ శుక్రవారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ముఖేష్ కుమార్ మీనా నూతన అధికారులకు దిశానిర్దేశం చేశారు. విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను ఆత్మవిశ్వాసం, వృత్తి నైపుణ్యంతో అధిగమించాలని సూచించారు. యువత అక్రమ కార్యకలాపాల నియంత్రణకు అంకితభావంతో పనిచేయాలని కోరారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన జి.హరికృష్ణ (ఫైరింగ్), కె.తేజస్వర రెడ్డి (అవుట్‌డోర్), లావణ్య రాజిత (ఇండోర్) ట్రోఫీలు అందుకున్నారు. అన్ని విభాగాల్లో ప్రతిభ చాటిన పరేడ్ కమాండర్ జి.జ్ఞాన ప్రసన్నలక్ష్మి ఆల్‌రౌండర్ అవార్డును కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎపి ఎక్సైజ్‌శాఖ కమిషనర్ చేమకూర శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ, అకాడమీ అధికారులు, శిక్షణ పూర్తి చేసుకున్న ఎస్‌ఐలు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అక్రమ కట్టడాలపై జిహెచ్‌ఎంసి చర్యలు



ప్రజాపక్షం/హైదరాబాద్ : నగరంలో అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలు, ఆమోదిత ప్రణాళికలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలపై మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) చర్యలకు ఉపక్రమించింది. అక్రమ నిర్మాణాలపై చర్యలను మరింత ముమ్మరం చేసిన జిహెచ్‌ఎంసి అధికారులు శుక్రవారం నగరంలోని మూడు ప్రాంతాల్లో కూల్చివేతలు చేపట్టారు. గోల్కొండ జోన్ పరిధిలోని సర్కిల్30 (గోషామహల్)లో బేగంబజార్ ఫీల్ఖానా ప్రాంతంలోని అజీజ్ ప్లాజా సమీపంలో ఉన్న 70 చదరపు గజాల స్థలంలో అనుమతులు లేకుండా నిర్మించిన సెల్లార్, గ్రౌండ్‌ఫ్లోర్‌తో పాటు ఆరు అంతస్తుల భవనంపై కూల్చివేత చర్యలు చేపట్టారు. ఖైరతాబాద్ జోన్ సర్కిల్35 పరిధిలోని రెడ్ హిల్స్ ప్రాంతంలో 90 చదరపు గజాల స్థలంలో నిర్మించిన భవనంలోని అనధికారికంగా నిర్మించిన మూడో, నాలుగో, ఐదో అంతస్తులను తొలగించే ప్రక్రియ చేపట్టారు. సికింద్రాబాద్ జోన్ సర్కిల్41 (ముషీరాబాద్) పరిధిలోని చిక్కడపల్లి ప్రాంతంలో 357 చదరపు గజాల స్థలంలో ఉన్న భవనంలోని అనుమతులు లేని నాలుగో అంతస్తును అధికారులు కూల్చివేశారు. జిహెచ్‌ఎంసి ప్రాథమిక పరిశీలనలో నగర వ్యాప్తంగా మొత్తం 473 నిర్మాణాలు అనుమతులు లేకుండా లేదా ఆమోదిత ప్రణాళికలకు విరుద్ధంగా కొనసాగుతున్నట్లు గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ నిర్మాణాల యజమానులకు క్యూర్ చట్టం నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేయడం, స్పీకింగ్ ఆర్డర్లు ఇవ్వడం వంటి ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. అక్రమ నిర్మాణాలపై చర్యల కోసం కార్యాచరణ ప్రణాళికను జిహెచ్ఎంసి సిద్ధం చేస్తోందని; నగరంలోని అన్ని జోన్‌ల లోనూ భవన నిర్మాణ నిబంధనలను అమలు చేయడంతో పాటు అక్రమ నిర్మాణాలను అరికట్టేందుకు తనిఖీలు, నిరంతరం కొనసాగుతాయని జిహెచ్‌ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు చెప్పారు.

## జూనియర్ సివిల్ జడ్జిగా లక్ష్మీప్రసాద్



ప్రజాపక్షం/రంగారెడ్డి: రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం ఇన్ముల్‌నర్వ గ్రామ మాజీ సర్పంచ్ ఆగిరి వెంకటేష్ కుమారుడు ఆగిరి లక్ష్మీప్రసాద్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యాడు. తెలంగాణ హైకోర్టు ఇటీవల వెల్లడించిన జూనియర్ సివిల్ జడ్జి ఫలితాల్లో లక్ష్మీప్రసాద్ న్యాయమూర్తిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా షాద్‌నగర్‌లోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయ ప్రాంగణంలో ఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో లక్ష్మీప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మలిపెద్ది శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు సంఘ నాయకులు, సభ్యులు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంథాలయాల చైర్మన్ ఆగిరి రవికుమార్ గుప్తా,వెంకటేష్ గుప్తా, స్థానిక ఆర్యవైశ్య సంఘం నాయకులు, సభ్యులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## ఆసియా క్రీడల స్వర్ణ విజేత షూటర్ కెనాన్ చెనయ్‌కు ఘనస్వాగతం

ప్రజాపక్షం/హైదరాబాద్: జపాన్‌లో ఇటీవల జరిగిన ఆసియా క్రీడల్లో షూటింగ్ విభాగంలో స్వర్ణ పతకం సాధించిన షూటర్ కెనాన్ చెనయ్, న్యూఢిల్లీలో జరిగిన బెరాటా కప్ పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి శుక్రవారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో క్రీడా అధికారులు, షూటింగ్ కోచ్‌లు, యువ క్రీడాకారులు, అభిమానులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ జి.అశోక్‌కుమార్, పిఆర్‌ఓ సురేష్ కాలేరు, షూటింగ్ కోచ్ సందీప్, క్రీడాకారులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



## మహిళా కానిస్టేబుల్‌కు సీమంతం

ప్రజాపక్షం/రంగారెడ్డి: విధి నిర్వహణలో నిరంతరం సేవలందిస్తున్న మహిళా కానిస్టేబుల్ అఖిలకు శుక్రవారం ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా సీమంతం నిర్వహించారు. ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌లో ఐదేళ్లుగా విధులు నిర్వహిస్తున్న అఖిల ప్రస్తుతం తొమ్మిది నెలల గర్భవతిగా ఉన్నారు. ఈ సందర్భంగా సంప్రదాయబద్ధంగా చీర, సారె అందజేసి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఎస్.రమేష్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌లో మహిళా సిబ్బంది అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో విశేష కృషి చేస్తున్నారని ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సబ్ ఇన్‌స్పెక్టర్లు, మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొని అఖిలకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళా సిబ్బంది పట్ల ఆత్మీయతను చాటుతూ ఆదిబట్ల పోలీస్ స్టేషన్ అధికారులు నిర్వహించిన ఈ కార్యక్రమం పలువురి ప్రశంసలు అందుకుంది.

## క్రీడలు క్రమశిక్షణ, ఐకమత్యాన్ని పెంపొందిస్తాయి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి




ప్రజాపక్షం/రంగారెడ్డి: క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఖో ఖో క్రీడా పోటీలు, రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాలకు ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు నిరంతర సాధనతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం రెడ్డిజాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొని మహిళలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## సెక్యూరిటీ గార్డు హత్య

24 గంటల్లోనే కేసు ఛేదించిన కొత్తూరు పోలీసులు

ఇద్దరు నిందితుల అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

ప్రజాపక్షం/రంగారెడ్డి/కొత్తూరు: రూ.20 వేల అప్పు వివాదం సెక్యూరిటీ గార్డు హత్యకు దారితీసిన ఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ హత్య కేసును కొత్తూరు పోలీసులు 24 గంటల్లోనే ఛేదించి, ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు.పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ నెల 14న తీగాపూర్ శివారులోని ఓ వెంచర్‌లో సెక్యూరిటీ గార్డు ప్రేమ్‌కుమార్ హత్యకు గురయ్యాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి, ఇర్ఫాన్, నవాజుద్దీన్‌ల పాత్ర ఉన్నట్లు గుర్తించారు. రూ.20 వేల అప్పు విషయంలో జరిగిన వాగ్వాదం హత్యకు దారితీసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని ఏసీపీ లక్ష్మీనారాయణ తెలిపారు. అప్పు విషయంలో తలెత్తిన గొడవలో కత్తితో దాడి చేసినట్లు పేర్కొన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.తక్కువ సమయంలోనే కేసును ఛేదించిన కొత్తూరు పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

## ఘనంగా బతుకమ్మ సంబరాలు

ప్రజాపక్షం/రంగారెడ్డి : రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, విద్యాశాఖ, జిల్లా కోశాధికారి శాఖల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. మహిళా అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. మహిళా అధికారులు, సిబ్బంది పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల మహిళా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



### సిఆర్ ఫౌండేషన్‌లో...



శేరిలింగంపల్లి : కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వరరావు (సిఆర్) ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న మహిళా సంక్షేమ కేంద్రంలో వృత్తి విద్య శిక్షణ విద్యార్థినిలు బతుకమ్మ సంబరాలు ఘనంగా నర్వహించారు. దసరా సందర్భంగా విద్యార్థినులు సంప్రదాయ పద్ధతులలో పూల అలంకరణలతో బతుకమ్మలను తయారుచేసి ఆటపాటలతో, జానపద గీతాలతో నృత్యం నిర్వహించి అలరించారు. కార్యక్రమంలో మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ జోస్యభట్ల కల్పన, సిఆర్ ఫౌండేషన్ ఉపాధ్యాక్షురాలు, సిఆర్ పాలిక్లినిక్ డైరెక్టర్ డాక్టర్ కునంనేని రజని, కమిటీ సభ్యులు వి.లలిత, కృష్ణప్రియ, ఉపాధ్యాయినులు తన్వీర్ బేగం, నజీర, స్రవంతి, వృద్ధాశ్రమవాసులు మాధవి, లైలా, జోత్స్న, జ్యోతి, తదితరులు పాల్గొని బతుకమ్మ సంబారాలను నిర్వహించారు.

## ఐప్సో లక్ష్యం ప్రపంచశాంతి



రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్

ప్రజాపక్షం/ఎల్‌బినగర్: ప్రపంచ శాంతి లక్ష్యంగా అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఎఐపిఎస్‌ఒ) నిరంతరం కృషి చేస్తుందని సంఘం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్ అన్నారు. రంగారెడ్డి జిల్లా ఎఐపిఎస్‌ఒ సమావేశం శుక్రవారం కొత్తపేటలో జిల్లా అధ్యక్షుడు తిప్పర్తి మహేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిఎల్ మాట్లాడుతూ శాంతి సంఘీభావ సంఘం బలపడితేనే సామ్రాజ్యవాద శక్తులు బలహీనపడుతాయన్నారు. దేశంలో యుద్ధాలు లేకపోవడం, యుద్ధ విధ్వంసం ఇక్కడ జరగకపోయినా ఇజ్రాయిల్ అమెరికా ఇరాన్‌పై చేస్తున్న యుద్ధం మూలంగా విపరీతమైన ధరలు పెరిగి ప్రజలంతా ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఎఐపిఎస్‌ఒ నాయకులు పల్లె వినయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో శాంతి ఉద్యమ బలోపేతం కొరకు పోరాడాలన్నారు. రంగారెడ్డి జిల్లా ఎఐపిఎస్‌ఒ అధ్యక్షుడు తిప్పర్తి మహేష్ మాట్లాడుతూ సంఘం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాలగాని రవికిషోర్, గొర్రెల నగేషప్ప, పల్లె వెంకన్న, చిత్రం సైదులు, ఇరిగి శ్రీధర్, తాండ్ర బిక్షపతి గౌడ్, కె.రేమష్, పరమేష్, పవన్ పాల్గొన్నారు.

## బిజెపితో పొత్తుపై పునరాలోచించాలి

### సిజెపి సభ్యులపై జెడి(యు) ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలి

### నితీశ్ కుమార్‌కు సందోశ్ కుమార్ లేఖ



**న్యూఢిల్లీ:** రాజ్యాంగ్యాన్ని సంస్థాగతంగా నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్న బిజెపితో పొత్తు విషయంలో పునరాలోచన చేయాలని జెడి(యు) అధినేత నితీశ్ కుమార్‌ను సిపిఐ ఎంపి, పి.సందోశ్ కుమార్ కోరారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగబద్ధ స్వేచ్ఛల పరిరక్షణ కోసం పోరాడుతున్న శక్తులకు సైద్ధాంతిక సంఘీభావం, రాజకీయ ధైర్యం కల్పించడం అన్నది దేశంలోని ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతో అవసరమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా జంతర్ మంతర్‌లోకి ప్రవేశించారని ఆరోపిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) నాయకులపై జెడి(యు) ఫిర్యాదు చేయడంపై ఆశ్చర్యం వ్యక్తంచేశారు. సిజెపి నాయకులపై ఫిర్యాదు ఉపసంహరించుకోవాలని కోరుతూ నితీశ్ కుమార్ ఆయన శుక్రవారం ఒక లేఖ రాశారు. విద్యార్థులు, యువత, రైతులు, మహిళలు, కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు గతంలో అనేక సార్లు ప్రభుత్వాల నుంచి జవాబుదారీతనం డిమాండ్ చేస్తూ జంతర్ మంతర్ వేదికగా చరిత్రాత్మకంగా ఆందోళనలు చేపట్టడాన్ని సంతోశ్ కుమార్ గుర్తుచేశారు. సిఇసి జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా చేపట్టిన ఆందోళనపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పరిధిలో పనిచేసే దిల్లీ పోలీసులు విరుచుపడ్డారని, నిరసనకారులతో దుర్మార్గంగా ప్రవర్తించారన్నారు. ఇదంతా వదిలేసి ఈనెల 12న జంతర్ మంతర్‌లోకి ప్రవేశించారంటూ సిజెపి నాయకులు, కార్యకర్తలపై జెడి(యు) ఫిర్యాదు చేయడం ఏమిటని నితీశ్‌ను ప్రశ్నించారు. 7, జంతర్ మంతర్ రోడ్డుకు ఉన్న ప్రాధాన్యతను సందోశ్ కుమార్ గుర్తుచేశారు. 1947 నుంచి 1969 వరకు అక్కడ కాంగ్రెస్ కేంద్ర కార్యాలయం ఉండేదని, కొన్ని దశాబ్దాల పాటు జెడి(యు)కూ అదే నిలయమన్నారు. జెడి(యు) తాజా చర్య ఆ పార్టీ ప్రజాస్వామ్య నిబద్ధతపై ప్రశ్నలకు తావిస్తున్నట్లు సందోశ్ కుమార్ తెలిపారు. శాంతియుత నిరసనపై నిరంకుశ చర్యలను తీవ్రంగా ఖండించారు. విద్యార్థులను కొట్టడం, రాజ్యసభ ఎంపీపై దాడి చేయడం, ఢిల్లీకి రైళ్ల రాకపోకలు నిలిపివేయడం వంటి చర్యలన్నీ అసంతృప్తి గళాల అణచివేతతో పాటు ప్రజాస్వామ్య వ్యవస్థల నిర్వీర్యానికి తీసుకున్న చర్యలేనని స్పష్టమైందన్నారు. 1970లో విద్యార్థి ఉద్యమంతో నితీశ్ కుమార్ ముడిపడి ఉండటాన్ని సందోశ్ కుమార్ ప్రస్తావించారు. ప్రజాస్వామ్య విలువలు, సిద్ధాంతాలకు కట్టుబడాలని నితీశ్‌కు సూచించారు. సిజెపిపై ఫిర్యాదులు ఉపసంహరించుకోవాలని జెడి(యు)ను ఆదేశించాలని, శాంతియుత నిరసనను నేరంగా ప్రకటించడాన్ని ప్రతిఘటించాలని సంతోశ్ కుమార్ కోరారు.

## 'ఎముకలు విరగ్గొట్టగలరు...సత్యాగ్రహాన్ని' కాదు

### విద్యార్థులపై ఢిల్లీ పోలీసుల క్రూరత్వాన్ని ఆక్షేపించిన రాహుల్‌గాంధీ



న్యూఢిల్లీ : భద్రతా సిబ్బంది విద్యార్థి నిరసనకారులపై జరిపిన 'దాడి'పై ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి ఢిల్లీ పోలీసులు నిరాకరిస్తున్నారని లోక్‌సభలో ప్రతిపక్షనేత, కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీ శుక్రవారం ఆరోపించారు. పోలీసులు 'ఎముకలు విరగ్గొట్టగలరు కానీ 'సత్యాగ్రహాన్ని' కాదు అని ఆయన నొక్కి చెప్పారు. రాహుల్‌గాంధీ మాట్లాడుతూ హోం మంత్రి అమిత్ షా ఢిల్లీ పోలీసుల క్రూరత్వాన్ని వదిలిపెట్టబోమని, బాధ్యులైన అధికారులపై కాంగ్రెస్ అన్నిరకాల చట్టపరమైన మార్గాలను అనుసరిస్తుందని హెచ్చరించారు. వీడియోతో పాటు ఉన్న ఒక పోస్ట్‌లో లోక్‌సభలో ప్రతిపక్షనేత ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఎస్ఐఆర్' ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ వ్యతిరేకంగా ఇటీవల జరిగిన నిరసనల సందర్భంగా గాయపడిన విద్యార్థి విభాగం ఎన్ఎస్‌యుఐకి చెందిన విద్యార్థులు సహా కొంతమంది విద్యార్థులతో ఆయన ఇటీవల జరిపిన సంభాషణ సంబంధిత వీడియో పోస్ట్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ బుధవారం ఇక్కడ 10 జన్‌పథ్‌లోని సోనియాగాంధీ నివాసంలో వారిని కలిశారు. విద్యార్థులపై దాడి ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి పోలీసులు నిరాకరిస్తున్నారు. కేరళకు చెందిన అతిరా, రాజస్థాన్‌కు రితుతో పాటు పలువురిపై ఢిల్లీ పోలీసులు దాడి చేశారు. నేను హోం మంత్రి రమేష్ చెన్నితాల, రాజస్థాన్ పిసిసి అధ్యక్షుడు గోవింద్ సింగ్ డోటాస్రాలతో మాట్లాడాను. కేరళలో ఇప్పటికే జీరో ఎఫ్ఐఆర్ నమోదు అయిందని రాహుల్‌గాంధీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. 'కేరళలో, రాజస్థాన్‌లో కోర్టులలో బాధ్యులైన అధికారులపై మేం ప్రతీ చట్టపరమైన మార్గాన్ని అనుసరిస్తాం. అమిత్‌షా ఢిల్లీ పోలీసుల క్రూరత్వాన్ని వదిలిపెట్టబోం' అని ఆయన అన్నారు.1930లో ధరాసనలో సరోజినీ నాయుడు నిరాయుధ సత్యాగ్రహానికి నాయకత్వం వహించి, పోలీసుల లాఠీలను ఎదుర్కొన్నారని రాహుల్ గాంధీ చెప్పారు. వారిలో ఒక్కరు కూడా చేయి ఎత్తలేదు. ప్రపంచం చూస్తూ ఉండిపోయింది. పోలీసులు ఎముకలు విరగ్గొట్టగలరు. కానీ, సత్యాగ్రహాన్ని విచ్ఛిన్నం చేయలేరు. యువత, ముఖ్యంగా యువతులు నిర్భయంగా, ధృఢ సంకల్పంతో, ఐక్యంగా ఉన్నారు. మన ప్రజాస్వామ్యం కోసం వారు నిలబడుతున్నారు. నేను వారికి మద్దతుగా నిలుస్తాను' అని గాంధీ చెప్పారు. బుధవారం విద్యార్థులను కలిసిన అనంతరం రాహుల్ గాంధీ మాట్లాడుతూ నిరసన చేస్తున్న విద్యార్థులు దేశ గొంతుక అని, వారికి అడ్డురావద్దని ప్రధానమంత్రి నరేంద్రమోదీని కోరారు.

### భారత అధికారులతో రూబియో భేటీ..ప్రభుత్వంపై రాహుల్ ప్రశ్నలు

వచ్చే వారం ముంబయిలో భారత ప్రభుత్వ అధికారులతో అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో జరపనున్న సమావేశంపై ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ శుక్రవారం ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ విషయంపై విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారులు గందరగోళంలో ఉన్నారని ఆయన ఆరోపించారు. ఈ విషయంపై ప్రధాని నరేంద్ర మోదీ వివరణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. రూబియో ముంబయిలో భారత ప్రభుత్వ అధికారులను కలుస్తారని, ఆ సమావేశంలో మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ కూడా ఉంటారని తాము ఆశిస్తున్నామని అమెరికా రాయబారి సెర్గియో గోర్ చెప్పిన మరుసటి రోజున రాహుల్ ఈ వ్యాఖ్యలు వచ్చాయి.వచ్చే వారం భారత్‌లో పర్యటించనున్న రూబియో, గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఉన్న రిలయన్స్ యూనిట్‌ను సందర్శించి, ఆ తర్వాత ముంబయిలో విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారులను కలుస్తారు. రూబియో భారత పర్యటనపై కాంగ్రెస్ గురువారం మోదీ ప్రభుత్వాన్ని విమర్శించింది. ముంబయిలో అమెరికా నాయకుడితో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ జరుపుతున్న సమావేశంపై విదేశాంగ మంత్రిత్వ శాఖ ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించింది. రూబియో ముంబయి పర్యటనకు సంబంధించి గోర్ మరిన్ని వివరాలు వెల్లడించడంలో ఆశ్చర్యం లేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ అన్నారు. 'రూబియో ముంబయిలో భారత ప్రభుత్వ అధికారులను కలుస్తారని ఆయన చెప్పడంలో కూడా పూర్తిగా ఆశ్చర్యం లేదు. కానీ మంత్రి డాక్టర్ జైశంకర్ ఇతర వ్యక్తులతో పాటు అక్కడ మాతో చేరతారని ఆశిస్తున్నామని ఆయన చేసిన ప్రకటన చాలా అసాధారణంగా ఉంది' అని రమేశ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. భారత విదేశాంగ మంత్రి సమావేశాల ప్రకటనను విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి కాకుండా వేరొకరికి ఎప్పటి నుంచి అప్పగించారని రమేష్ ప్రశ్నించారు.

### భర్తను హతమార్చి పాముకాటుగా చిత్రీకరించిన

## భార్య, ప్రియుడికి మరణశిక్ష!



**లక్నో:** భర్తను హత్య చేసిన భార్యకు, ఆమె ప్రియుడికి జిల్లా కోర్టు మరణశిక్ష విధించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ జిల్లా కోర్టులో అడిషనల్ జడ్జి 12 అయిన జైవీర్ సింగ్ నగర్ శిక్ష ఖరారు చేశారు. ఉత్తర ప్రదేశ్, మీరట్‌లో ఈ తరహా శిక్ష ఖరారు కావడం రెండు రోజుల్లో ఇది రెండోది. మొదటి కేసులో కూడా భర్తను హత్య చేసినందుకు భార్య, ఆమె ప్రియుడికి మరణశిక్ష విధించింది మీరట్ జిల్లా కోర్టు. తాజా కేసులో మృతుడు అమిత్ కశ్యప్ కాగా.. అతడిని భార్య రవిత, ఆమె ప్రియుడు అమర్‌దీప్ కలిసి హత్య చేశారు. గత ఏడాది ఏప్రిల్ 17న అమిత్ కశ్యప్‌ను అతడి భార్య రవిత, ఆమె ప్రియుడు అమర్‌దీప్ కలిసి గొంతు నులిమి హత్య చేశారు. అనంతరం అతడిని పాము కరవడం వల్లే చనిపోయాడని నమ్మించారు. ఈ విషయం అందరూ నమ్మేలా బెడ్ పక్కన ఒక పామును కూడా వదిలిపెట్టారు. అయితే, అతడు పాముకాటు వల్ల చావలేదని పోస్టుమార్టంలో తేలింది. అతడి ఒంటిపై పాము కాటు గాయాల్లేవని వైద్యులు అన్నారు. గొంతు నులమడం వల్లే అతడు మరణించాడని కూడా వైద్యులు ధృవీకరించారు. దీంతో పోలీసులు హత్య కేసుగా నమోదు చేసి విచారణ జరపగా.. రవిత, అమర్‌దీప్ వ్యవహారం బయటపడింది. వారే హత్య చేసినట్లుగా తేలింది. దీనిపై స్థానిక జిల్లా అడిషన్ కోర్టు12లో విచారణ జరిగింది. దీనిపై విచారణ జరిపిన పోలీసులు 60 రోజుల్లోనే చార్జిషీటు దాఖలు చేశారు. ఇంతకాలం కోర్టులో విచారణ జరగగా.. పలువురు సాక్షులను విచారించి, ఇద్దరూ హత్యకు పాల్పడ్డట్లు గుర్తించారు. దీనిపై శుక్రవారం కోర్టు తీర్పు వెల్లడించింది. నిందితులు ఇద్దరూ వేర్వేరు జైళ్ల నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్జి వారి నేరం, శిక్ష గురించి ప్రశ్నించారు. తాము చేసిన పనికి పశ్చాత్తాప పడుతున్నామని చెప్పారు. కోర్టు ఏ శిక్ష వేసినా చట్టపరంగా అనుభవించడానికి తాను సిద్ధమేనని రవిత తెలిపింది. తనకు ముగ్గురు పిల్లలు ఉన్నారని, వారి బాధ్యతను ఇతరులు చూసుకుంటారని కోర్టుకు తెలిపింది. అమర్‌దీప్ మాత్రం తనకు వృద్ధ తల్లిదండ్రులు ఉన్నారని, వారి సంక్షేమం చూసుకునే విషయంలో ఇబ్బంది రాకుండా చూడాలని విజ్ఞప్తి చేశాడు. అనంతరం ఇద్దరూ కన్నీళ్లు పెట్టుకున్నారు. అనంతరం వారికి మరణశిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెల్లడించింది. రెండు రోజుల క్రితమే మీరట్, బ్లూ డ్రమ్ మర్డర్ కేసులో నిందితులు రస్తోగి, ఆమె ప్రియుడు సాహిల్ శుక్లాకు కూడా మరణశిక్ష విధించిన సంగతి తెలిసిందే.

### భారత నౌకాదళంలోకి...

## స్వదేశీ బహుళార్థక సాధక యుద్ధనౌక 'సమర్థక్'



**కార్వార్ (కర్ణాటక) :** ఒక ప్రైవేట్ షిప్ యార్డ్ నిర్మించిన భారతదేశపు మొట్టమొదటి బహుళార్థక సాధక నౌక 'సమర్థక్' శుక్రవారం నావికాదళంలోకి ప్రవేశపెట్టబడింది. తద్వారా, యుద్ధ నౌకల నిర్మాణంలో దేశీ పరిశ్రమ పాత్రను విస్తరించడంలో ఇది ఒక ప్రధాన మైలురాయిగా నిలిచింది. కార్వార్‌లోని నౌకాదళ స్థావరంలో ఉప రాష్ట్రపతి సిపి.రాధాకృష్ణన్ సమక్షంలో శుక్రవారం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో నౌకా దళాధిపతి అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ మాట్లాడుతూ తమిళనాడులోని కట్టుపల్లి షిప్‌యార్డ్‌లో లార్సన్ అండ్ టూబ్రో (ఎల్ అండ్ టి) నిర్మించిన ఈ నౌకలో 75శాతానికి పైగా స్వదేశీ పరికరాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి కర్ణాటక కార్మిక శాఖ మంత్రి సంతోష్ లాడ్ కూడా హాజరయ్యారు. ఈ నౌకను ఎల్ అండ్ టి వారి లార్డ్‌షిప్ డిజైన్ సెంటర్, షిప్ యార్డ్‌లో పూర్తిగా అంతర్గతంగానే డిజైన్, ఇంజినీరింగ్ చేసి నిర్మించారని పేర్కొంటూ, దీనిని అధికారికంగా ప్రారంభించడం 'ఆత్మ నిర్భరత' (స్వయం సమృద్ధి) దిశగా ఒక ముఖ్యమైన ముందడుగు అని అడ్మిరల్ స్వామినాథన్ అభివర్ణించారు. భారత నౌకాదళంలోకి ప్రవేశపెట్టనున్న నాలుగు బహుళ ప్రయోజన నౌకలలో సమర్థక్ నౌక మొదటిది. దీనిని నౌకాదళంలోకి ప్రవేశ పెట్టడం, రక్షణ రంగంలో స్వావలంభన దిశగా భారతదేశం సాగిస్తున్న ప్రయాణంలో మరో ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. ఇది నౌకాదళ భవిష్యత్తులో ఒక ముఖ్యమైన భాగంగా ఉంటుంది. వ్యూహాత్మకంగా ముఖ్యమైన కార్యకలాపాలకు ఇది ఒక ఆదర్శవంతమైన యుటిలిటి నౌక. 'ఒక ప్రైవేట్ షిప్ యార్డ్‌తో ఒప్పందం కుదుర్చుకుని, వారిచే నిర్మించబడిన భారత నౌకాదళంలోకి ప్రవేశపెట్టబడిన ప్రధాన లేదా భారీ యుద్ధ నౌక 'సమర్థక్' అని ఆయన అన్నారు. స్వదేశీ ఆయుధాలు, సెన్సర్ల పరీక్షలు, మానవరహిత స్వయం ప్రతిపత్తి వ్యవస్థలతో కూడిన కార్యకలాపాలు, సముద్ర నిఘా, గస్తీ విధులు వంటి పలు రకాల కార్యాచరణ, సహాయక పాత్రలను చేపట్టేందుకు ఈ నౌకను రూపొందించారు. సమర్థక్ అత్యాధునిక డైనమిక్ పొజిషనింగ్ సిస్టమ్‌తో కూడి ఉందని, సముద్ర యుద్ధ నౌకా విన్యాసాలలో ఉపయోగించే లక్ష్యాలను ప్రయోగించగలదని, తిరిగి పొందగలదని అడ్మిరల్ స్వామినాథన్ వివరించారు.

## వీలైనంత త్వరగా భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం

### కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



**న్యూఢిల్లీ:** ప్రపంచ వాణిజ్యం, ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాల ప్రయోజనాల దృష్ట్యా భారత్‌–అమెరికా వాణిజ్య ఒప్పందం వీలైనంత త్వరగా కుదురుతుందని ఆశిస్తున్నట్లు శుక్రవారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.'ఈ ఒప్పందంపై త్వరలోనే సంతకాలు జరగాలని తాము ఆకాంక్షిస్తున్నట్లు భారత వాణిజ్య శాఖ మంత్రి కూడా చెప్పారని నేను అనుకుంటున్నాను. ఈ విషయమై చర్చలు కొనసాగుతున్నాయి. అలాగే, భాగస్వాములైన భారత్‌–అమెరికాల మధ్య వాణిజ్య ప్రయోజనాల దృష్ట్యా ఈ వాణిజ్య ఒప్పందంపై వీలైనంత త్వరగా ఒప్పందం కుదురుతుందని నేను ఆశిస్తున్నాను' అని నిర్మలా సీతారామన్ చెప్పారు. భారత్‌–అమెరికా వాణిజ్య ఒప్పందం మొదటి దశ ఖరారైందని, ప్రస్తుతం దానికి చట్టపరమైన ముసాయిదా రూపొందుతోందని, వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ గురువారం తెలిపారు. చైనాతో వాణిజ్యంపై నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ బీజింగ్‌తో సంవత్సరాల తరబడి సంబంధాలు ఉన్నప్పటికీ, పెరుగుతున్న వాణిజ్య అసమతుల్యత, భారతీయ ఉత్పత్తుల మార్కెట్ ప్రవేశంపై నిరంతర ఆంక్షలు ప్రధాన ఆందోళనలుగా మిగిలిపోయాయని అన్నారు. జెనరిక్ మందులు, పశు మాంసం, కూరగాయలు, ఇతర త్వరగా పాడైపోయే వస్తువుల వంటి ఉత్పత్తుల కోసం భారతదేశం చైనాలో మార్కెట్ ప్రవేశం కోసం నిరంతరం ప్రయత్నిస్తూనే ఉందని, అయితే, సంవత్సరాల తరబడి సంప్రదింపులు జరిపినప్పటికీ పెద్దగా పురోగతి సాధించలేదని పేర్కొన్నారు. థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో జరిగిన ఐఎంఎఫ్‌–ప్రపంచ బ్యాంక్ వార్షి సమావేశాల సందర్భంగా అట్లాంటిక్ కౌన్సిల్‌తో జరిగిన సంభాషణలో ఆర్థిక మంత్రి సీతారామన్ ఈ విషయాన్ని వెల్లడించారు.'భారత్‌–చైనాల మధ్య వాణిజ్యంలో సుంకేతర అడ్డంకులే అతిపెద్ద అవరోధం' అని ఆమె అన్నారు. ఇలాంటి సమస్యలను పరిష్కరించడానికి చర్చలు. విచారణలకు అవకాశం ఉన్నప్పటికీ, చైనా పైటోశానిటరీ (మొక్కల ఆరోగ్యానికి సంబంధించిన) చర్యలను, ఇతర సుంకేతర ఆంక్షలను ఉపయోగించిందని పేర్కొన్నారు. భారీ వాణిజ్య అసమతుల్యతలను సరిదిద్దడానికి వాణిజ్య భాగస్వాములపై శిక్షాత్మక సుంకాలను విధించే విధానాన్ని భారతదేశం అవలంభించలేదని, బదులుగా ఆ ప్రక్రియ సమయం తీసుకునేదైనప్పటికీ, చర్చలనే కొనసాగించడానికి ప్రాధాన్యత ఇచ్చిందని ఆమె తెలిపారు. బ్రిక్స్ గురించి సీతారామన్ మాట్లాడుతూ, ఈ కూటమి కేవలం ప్రజల సంక్షేమాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో కూడిన భాగస్వామ్యంగా చూడాలన్నారు. 'ఇతరులను ఎదుర్కోవాలనేది బ్రిక్స్ ఉద్దేశం అని నేను అనుకోవడం లేదు. బ్రిక్స్ ద్వారా భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడమే దాని లక్ష్యం' అని మంత్రి సీతారామన్ వివరించారు.బ్రిక్స్ ప్రపంచ జనాభాలో 40శాతానికి ప్రాతినిధ్యం వహిస్తోందని, దాని సభ్య దేశాల మధ్య సహకారం వాణిజ్యాన్ని మెరుగుపరచగలదని, పరస్పర అవగాహనను మెరుగుపర్చగలదని, ఆర్థిక అవకాశాలను విస్తరించగలదని తెలిపారు. ఈ కూటమిలో కొత్త సభ్యులు చేరడంతో 11 నుంచి 12దేశాలు ఒకదానితో ఒకటి చురుకుగా వ్యవహరిస్తున్నాయని, ఇవి సమష్టిగా ప్రపంచ వాణిజ్యంలో 45శాతం వాటాను కలిగి ఉన్నాయని వివరించారు. భారతదేశ ఆర్థికవృద్ధిపై సీతారామన్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్త అంతరాయాలు ఉన్నప్పటికీ దేశం బలమైన వృద్ధిని కొనసాగించిందని చెప్పారు.ముఖ్యంగా కొవిడ్–19 మహమ్మారి తర్వాత గత నాలుగైదేళ్లుగా ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థికవ్యవస్థగా నిలిచిందని తెలియజేశారు. ప్రభుత్వ రుణాలు ప్రధానంగా మౌలిక సదుపాయాలకు అనుగుణంగానే ఉన్నాయని, రుణాల ద్వారా ఆస్తుల సృష్టి ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనం చేకూరుస్తోందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వాదించారు.


తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ (భూసేకరణ)శాఖ
ఫారం-VII
(చట్టం 30/2013 యొక్క సెక్షన్-19(1) మరియు రూల్-25 యొక్క సబ్‌రూల్ (1) ప్రకారం)
డిక్లరేషన్

భూ.సే.అ.&ఆర్.డి.ఓ., కోరుట్ల
ఫైల్.నెం.E/421/2025 తేది. .10.2026

జిల్లా కలెక్టర్, జగిత్యాల
ఫైల్ నెం. G1/754/2025 తేది. .10.2026

జగిత్యాల జిల్లా, కోరుట్ల డివిజన్,ఈ దిగువ షెడ్యూల్ నందు చూపబడిన కథలపూర్ మండలము కలికోట గ్రామంలోని భూమి వీస్తీర్ణం **ఎ.3.00గు.** భూమి, ప్రజా ప్రయోజనార్థమై అనగారుద్రంగి ట్యాంక్ (కలికోట సూరమ్మ చెరువు), శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ స్టేజ్-II ఫేజ్-I కలికోట సూరమ్మ చెరువు కట్ట పొడిగింపు చేయుట కొరకు అవసరమున్నదని, తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, జగిత్యాల గారు భావిస్తున్నారు.
కావున జగిత్యాల జిల్లా కథలపూర్ మండలములోని కలికోట గ్రామ పరిధిలో ఉన్న భూమి విస్తీర్ణం మొత్తం **ఎ.3.00గు.** భూమి వివరములు, ఈ క్రింద చూపినవానిని భూసేకరణ పనులు ప్రారంభ నిమిత్తం పబ్లికేషన్ ఆఫ్ డిక్లరేషన్ జారీ చేయనైనది.

షెడ్యూల్

గ్రామము: కలికోట మండలం: కథలాపూర్ జిల్లా: జగిత్యాల

| క్ర.సం. | సర్వే నెం. | భూమి వివరణ | భూమి రకము / తరి | భూసేకరణ చేయు విస్తీర్ణము | ఆసక్తిగల వ్యక్తుల పేరు & వివరాలు | సరిహద్దులు | | | | చెట్లు / నిర్మాణములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | ఉత్తరం | తూర్పు | దక్షిణం | పడమర | |
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | | | | 8 |
| 1 | 129/4 | పట్టా | ఖుష్కి | 0.28 | పులి సాయిలు తండ్రి పెద్ద బాలయ్య | 128, 130, &131 | 138 | 138 | 138 | |
| 2 | 129/1 | పట్టా | ఖుష్కి | 0.02 | అరెపెల్లి రాజ గంగారం తండ్రి లింగయ్య | 128, 130, &131 | 138 | 138 | 138 | |
| 3 | 138-2/2 | లావుణి పట్టా | ఖుష్కి | 0.08 | పులి సాయిలు తండ్రి పెద్ద బాలయ్య | 127 | 129 | 236 | 290 | లేవు |
| 4 | 138-2/1 | లావుణి పట్టా | ఖుష్కి | 0.08 | పులి రవీందర్ తండ్రి పెద్ద బాలయ్య | 127 | 129 | 236 | 290 | |
| 5 | 138 | ప్రభుత్వ భూమి | ఖుష్కి | 1.34 | ప్రభుత్వ భూమి | | | | | |
| **మొత్తం విస్తీర్ణం : 3.00** | | | | | | | | | | |

ప్రతిపాదిత భూసేకరణ చట్టం - 2013 (కేంద్ర చట్టం 30/2013) లోని సెక్షన్ 15(1) అంశాలపై భూసేకరణపై ఆసక్తిగల వ్యక్తుల నుండి ఎలాంటి అభ్యంతరాలు రానందున సెక్షన్ 19(1) ప్రకారం డిక్లరేషన్ జారీ చేయనైనది. ఇట్టి భూసేకరణవల్ల ఎవరు నిర్వాసితులు కాలేదు మరియు జీవనోపాధి కోల్పోలేదు. కావున పునరావాసం మరియు పునరుపాధి కల్పన వర్తించదు.
భూసేకరణ తలపెట్టిన భూమిలో భోగ్గు, ఇనుము, స్లేట్ మరియు ఇతరత్రా ఖనిజములు ఇట్టి భూమిలో లేదా కొంత భాగములో లభ్యమైనచో ఆఖనిజాలు ప్రాజెక్ట్ నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడవు.
పైన చూపిన భూసేకరణచేయు భూముల యొక్క ప్లాన్ మరియు వివరములు ఏదేని పనిదినములలో మరియు కార్యాలయ పనివేళలలో భూసేకరణ అధికారి మరియు రెవెన్యూ డివిజినల్ అధికారి, కోరుట్లవారి కార్యాలయములో పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉంచనైనది.

సం/- భూసేకరణ అధికారి & రెవెన్యూ డివిజనల్ అధికారి కోరుట్ల
సం/- అదనపు కలెక్టర్ జగిత్యాల
సం/- జిల్లా కలెక్టర్ జగిత్యాల

DIPR RO NO. 1035/LA/PP/Advt/Pub/2026-27


### గర్భిణీ జర్నలిస్టును రాహుల్‌గాంధీ తోసేశారన్న పిటిషన్‌పై..

## 26, 27 తేదీలలో విచారణకు 'సుప్రీం' ఓకె



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీ ఇటీవల (అక్టోబరు 12న) సుప్రీంకోర్టు వరకు నిర్వహించిన పాదయాత్ర సందర్భంగా గర్భవతి అయిన ఒక జర్నలిస్ట్‌ను తోసేశారని ఆరోపిస్తూ దాఖలైన దరఖాస్తును విచారించేందుకు సుప్రీం కోర్టు శుక్రవారం అంగీకరించింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ నేతృత్వంలోని ధర్మాసనం ముందు ఈ దరఖాస్తు ప్రస్తావనకు రాగా, దీనిపై అక్టోబరు 26 లేదా అక్టోబరు 27 తేదీలలో విచారణ జరుపుతామని తెలిపింది. సీనియర్ అడ్వకేట్ గౌరవ్ భాటియా మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఒక పిటిషన్‌లో దరఖాస్తు దాఖలు చేసినట్లు చెప్పారు. కోర్టు ఆవరణలో ఒక మహిళా జర్నలిస్ట్‌పై దాడి జరిగిందని భాటియా అన్నారు. గురువారం ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్), ఢిల్లీ నిరసనలు, అక్టోబరు 12న సుప్రీం కోర్టు వద్దకు జరిపిన పాదయాత్ర పాత్రికేయులు, న్యాయవాదులపై జరిగిన దాడి ఆరోపణలకు సంబంధించిన పలు పిటిషన్లను అత్యున్నత న్యాయస్థానం విచారించింది.జంతర్ మంతర్ సమీపంలో జరిగిన నిరసన సందర్భంగా తనపై కులపరమైన వ్యాఖ్యలు, బహిరంగ అవమానాలు చేశారని ఆరోపిస్తూ ఢిల్లీ పోలీస్ అధికారి ఒకరు దాఖలు చేసిన కేసు విషయంలో, ఒక మహిళా జర్నలిస్టుపై ఎటువంటి బలవంతపు చర్యలు తీసుకోకూడదని సుప్రీంకోర్టు ఆదేశించింది.అక్టోబరు 12న జరిగిన మార్చ్ సందర్భంగా సుప్రీంకోర్టు ప్రాంగణంలో రాహుల్ గాంధీ ఒక మహిళా జర్నలిస్టును తోసేశారు. ఆమె మూడు నెలల గర్భవతి కావడంతో, ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది' అని గౌరవ్ భాటియా వాదించారు. ఈ విషయాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించే అవకాశం ఉందని ఆయన తెలియజేశారు. ఈ విషయమై, పిటిషన్ దాఖలు చేయాలని, ఈ అంశాన్ని పరిశీలిస్తామని ధర్మాసనం న్యాయవాది భాటియాను కోరింది.అక్టోబరు 12న రాహుల్‌గాంధీ, పలువురు ప్రతిపక్ష నాయకులు తమ మద్దతుదారులతో కలిసి సుప్రీంకోర్టుకు చేరుకుని పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల జాబితాల 'ఎస్ఐఆర్'లో పెద్దయెత్తున ఓటర్ల తొలగింపులు, అవకతవకలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఈ పిటిషన్ దాఖలైంది.అక్టోబరు 12న జరిగిన మార్చ్‌కు వ్యతిరేకంగాదాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు గురువారం కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి) చీఫ్ అఖిలేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ, ఇతరులకు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే.

### డ్రగ్స్ వ్యాపారం నుంచి లబ్ధి పొందేందుకే

## పంజాబ్‌లో అధికారంలోకి రావాలనుకుంటోంది

### కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలపై కేజ్రీవాల్ ఫైర్



**న్యూఢిల్లీ :** పంజాబ్‌లో మాదకద్రవ్యాల బెడద, 'పెరుగుతున్న వ్యవస్థీకృత నేరాల'పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఘాటుగా స్పందించారు. రాష్ట్రంలో ఈ బెడదకు బిజెపియే కారణమని ఆయన ఆరోపించారు. 2007 నుండి 2017 మధ్య పంజాబ్‌లో మాదకద్రవ్యాలను వ్యాప్తి చేయడానికి 'చిట్టా పార్టీ' అని తాను పేర్కొన్న పార్టీతో బిజెపి కుమ్మక్కైందని కేజ్రీవాల్ ఆరోపించారు. ఇప్పుడు మాదకద్రవ్యాల వ్యాపారం నుండి లాభం పొందడానికి రాష్ట్రంలో తిరిగి అధికారంలోకి రావాలని చూస్తోందని ఎక్స్ వేదికగా కేజ్రీవాల్ మండిపడ్డారు. పంజాబ్‌లో గ్యాంగ్‌స్టర్ సంస్కృతిని వ్యాప్తి చేయడంలో పాలుపడిన వారికి సబర్మతి జైలులో రక్షణ కల్పించిందని కూడా ఆయన ఆరోపించారు. అలాగే, అదానీ పోర్ట్ ద్వారా మాదకద్రవ్యాల రవాణా జరుగుతోందన్న ఆరోపణలపై కూడా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. పంజాబ్ విపరీతంగా పెరిగిపోతున్న మాదకద్రవ్యాల వ్యాపారం, గ్యాంగ్‌స్టర్లు, వ్యవస్థీకృత నేరాల నుండి పెరుగుతున్న ముప్పుతో పోరాడుతోందని షా ఆరోపించిన నేపథ్యంలో కేజ్రీవాల్ ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో జరిగిన రెండు ఘటనలపై పంజాబ్ ప్రభుత్వం స్పందన కోరతామని హోంమంత్రి తెలిపారు. ఆ సంఘటనలలో ఒకటి, తమ ప్రాంతంలో మాదకద్రవ్యాల సరఫరా సమస్యను లేవనెత్తినందుకు వేధింపులకు గురై దిర్బాకు చెందిన ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకోవడం, మరొకటి, మాన్సాలో మాదకద్రవ్యాల వ్యతిరేక కార్యకర్త పర్విందర్ సింగ్ ఝోటా హత్య. శాంతిభద్రతల పరిస్థితిపై షా ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌ను ప్రశ్నించారు. మాదకద్రవ్యాల నెట్‌వర్క్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని, నేరస్థులు పొందుతున్న ఏవైనా రాజకీయ అండదండలపై నిష్పక్షపాత విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. షాకు బదులిస్తూ, ఏళ్ల తరబడి బిజెపి పాలిత రాష్ట్రాలు తీవ్రమైన మాదకద్రవ్యాల ముప్పును ఎదుర్కొంటున్నాయని, ఇప్పుడు పంజాబ్‌లో ఆ పార్టీ ఈ విషయాన్ని ఎందుకు లేవనెత్తుతోందని కేజ్రీవాల్ ఆరోపించారు. పంజాబ్ జలవనరులు, పంజాబ్ విశ్వవిద్యాలయం, చండీగఢ్‌పై బిజెపి కన్నేసిందని ఆయన ఆరోపించారు. విస్తృత నిరసనలకు దారితీసిన మూడు వ్యవసాయ చట్టాలను పునరుద్ధరించాలని ఆ పార్టీ చూస్తోందని ఆయన విమర్శించారు. 'పంజాబ్ దీన్ని ఎప్పటికీ జరగనివ్వదు' అని కేజ్రీవాల్ అన్నారు.

## కేరళ మాజీ సిఎం విజయన్‌కు ఇడి సమన్లు

### సిఎంఆర్ఎల్ మనీలాండరింగ్ కేసులో 23న విచారణకు హాజరు కావాలని సూచన



తిరువనంతపురం : సిఎంఆర్ఎల్ సంబంధిత మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను ఈనెల 23న విచారణకు హాజరు కావాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) శుక్రవారం సమన్లు జారీ చేసింది. ఈ విషయమై రాష్ట్ర పోలీసులు ఇటీవల నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను పరిగణనలోకి తీసుకుని, మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఏ) కింద కేంద్ర దర్యాప్తు సంస్థ కేసు నమోదు చేసిందని, ఈ సమన్లు ఆ చట్టం కింద జారీ అయ్యాయని అధికారులు చెప్పారు. కేరళ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడైన విజయన్‌ను (81), 23న కొచ్చిలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కార్యాలయం ఎదుట హాజరు కావాలని కోరినట్లు అధికారులు తెలిపారు. ఈ కేసులో తమ ప్రమేయం, ఎలాంటి తప్పిదం లేదని ఆ సీనియర్ మార్క్సిస్ట్ నాయకుడు, సిపిఐ(ఎం) నిరంతరం ఖండిస్తూనే ఉన్నాయి. సిఎంఆర్ఎల్ లంచం ఆరోపణల కేసులో విజయన్, ఆయన కుటుంబ సభ్యులైన కుమార్తె వీణాటి, అల్లుడు, మాజీ మంత్రి పి.ఎ. మహమ్మద్ రియాస్‌లపై కేరళ విజిలెన్స్, అవినీతి నిరోధక బ్యూరో (విఎసిబి) అక్టోబర్ 12న రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసింది. రాష్ట్ర పోలీసులకు ఇడి సమర్పించిన నివేదిక ఆధారంగా కేసు నమోదు చేయాలని కేరళ హైకోర్టు ఈనెల 9న విఎసిబిని ఆదేశించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద జరిపిన సోదాలు, దర్యాప్తులో సేకరించిన ఆధారాల ఆధారంగా కేసు నమోదు చేయాలని కేంద్ర దర్యాప్తు సంస్థ కోరింది. ఐటి కన్సల్టెన్సీ సేవల ముసుగులో, విజయన్ కుమార్తె వీణాకు చెందిన, ప్రస్తుతం మూసివేయబడిన 'ఎక్స్‌లాజిక్ సొల్యూషన్స్' కంపెనీకి సిఎంఆర్ఎల్ రూ. 2.78 కోట్ల మోసపూరిత చెల్లింపులు చేసిందని ఇడి ఆరోపించింది. వీణాటి నివాసంలో జరిపిన సోదాల సమయంలో కొన్ని చేతిరాత నోట్లను స్వాధీనం చేసుకున్నామని, వాటిలో దుబాయ్‌కు జరిగిన కొన్ని నిధుల బదిలీల వివరాలు ఉన్నాయని ఆగస్టులో జారీ చేసిన ఒక ప్రకటనలో ఇడిపేర్కొంది. ఎఫ్ఐఆర్ నమోదుకు సంబంధించి కేరళ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వును సవాలు చేస్తూ శుక్రవారం విజయన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.


**పాసు బుక్కు పోయినది**

హనుమకొండ జిల్లా వేలేరు మండలం ఇచ్చుల్లపల్లి కన్నారం గ్రామానికి చెందిన **మిడిదొడ్డి శల్మీకరాజు, తండ్రి : స్వామిరాజుకు** సంబదించిన తెలంగాణ పట్టాదారు పాస్ బుక్ ఖాతా నెంబర్ : **635**, పట్టా పాసు బుక్ నెం. **T21100020355** నెంబర్ గల పట్టా దారు పాస్ బుక్కు జులై నెలలో మిడిదొడ్డి శల్మీకరాజు కన్నారం గ్రామం నుండి హనుమకొండకు బస్ లో ప్రయాణం చేయుచుండగా పోయినది. ఇట్టి పట్టాదారు పాసు బుక్కు దొరికినవారు ఈక్రింది చిరునామాకు అందించగలరు.

ఇట్లు
**మిడిదొడ్డి శల్మీక రాజు**
**తండ్రి : స్వామిరాజు**
గ్రామం : ఇచ్చుల్లపల్లి, కన్నారం
ఇంటి నెం : 3-34,
మండలం : వేలేరు,
జిల్లా : హన్మకొండ,
పిన్ నెం : 505471,
**ఫోన్ నెంబర్ : 9494991605**

# గాయపడ్డ అర్షదీప్.. టీమ్‌లోకి భువనేశ్వర్




వెస్టిండీస్‌తో ఐదో టి–20కి ముందు టీమిండియాలో కీలక మార్పు చోటు చేసుకుంది. టీమిండియా స్టార్ పేసర్ అర్షదీప్ సింగ్ గాయంతో దూరం కాగా.. అతని స్థానంలో భువనేశ్వర్ కుమార్ జట్టులోకి వచ్చాడు. ఈ విషయాన్ని బిసిసిఐ శుక్రవారం ఓ అధికారిక ప్రకటనలో వెల్లడించింది. ఉప్పల్ వేదికగా జరిగిన నాలుగో టి–20లో అర్షదీప్ సింగ్ భుజానికి గాయమైన సంగతి తెలిసిందే. గాయం తీవ్రత పెద్దగా లేకున్నా.. ముందస్తు చర్యల్లో భాగంగా ఆఖరి టి–20 నుంచి అర్షదీప్ సింగ్‌కు విశ్రాంతి ఇచ్చినట్లు బిసిసిఐ తమ ప్రకటనలో పేర్కొంది. దాంతో బెంగళూరు వేదికగా శనివారం జరిగే ఆఖరి టి–20లో భువనేశ్వర్ కుమార్ బరిలోకి దిగనున్నాడు. ఇప్పటికే న్యూజిలాండ్ పర్యటనకు ఎంపిక చేసిన భారత టి–20 జట్టులోకి భువనేశ్వర్ కుమార్‌ను తీసుకున్న సంగతి తెలిసిందే.
ఈ ఐదు టి–20ల సిరీస్‌లో భారత యువ బౌలర్లు తేలిపోవడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. తాజాగా అర్షదీప్ సింగ్ కూడా దూరమవడంతో భారత బౌలింగ్ విభాగం మరింత బలహీనం అవుతుందని భావించిన సెలెక్టర్లు.. భువనేశ్వర్ కుమార్‌ను జట్టులోకి తీసుకున్నారు. అంతే కాకుండా బెంగళూరు వికెట్‌పై అతనికి మంచి రికార్డ్ ఉంది.

**సిరీస్ గెలుపే లక్ష్యంగా...** వరుసగా రెండు ఐపిఎల్ సీజన్‌లలో ఆర్‌సిబి టైటిల్ గెలవడంలో భువనేశ్వర్ కుమార్ సత్తా చాటాడు. ఆర్‌సిబి హోమ్ గ్రౌండ్ అయిన చిన్నస్వామిలో భువనేశ్వర్ కుమార్ సత్తా చాటాడు. దాంతోనే అతడిని ఈ మ్యాచ్‌కు ఎంపిక చేసినట్లు అర్థమవుతోంది. ఈ మ్యాచ్‌కు భువీని ఎంపిక చేయడం ద్వారా.. భారత బౌలింగ్ విభాగం పటిష్టంగా మారడంతో పాటు న్యూజిలాండ్ పర్యటనకు ముందు అతనికి మ్యాచ్ ప్రాక్టీస్ లభిస్తుందని సెలెక్టర్లు భావించినట్లు సమాచారం. భువనేశ్వర్ కుమార్ చివరిసారిగా 2022లో న్యూజిలాండ్‌తో అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. గత రెండు ఐపిఎల్ సీజన్లలో అతను 48 వికెట్లు పడగొట్టాడు. భారీ స్కోర్లు నమోదైన ఈ ఐదు టి–20ల సిరీస్‌లలో ఇరు జట్లు రెండేసి విజయాలతో 2–2తో సమంగా నిలిచాయి. దాంతో ఈ ఆఖరి టి–20 సిరీస్ డిసైడర్‌గా మారింది. ఈ క్రమంలోనే సిరీస్ గెలవడమే లక్ష్యంగా భువీని సెలెక్టర్లు బరిలోకి దించారు.

**భారత జట్టు:** శ్రేయాస్ అయ్యర్(కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, సంజూ శాంసన్, తిలక్ వర్మ(వైస్ కెప్టెన్), శివం దూబే, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్, నితీశ్ కుమార్ రెడ్డి, అర్షదీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్, నమన్ ధీర్, భువనేశ్వర్ కుమార్.

# భారత్, వెస్టిండీస్ ఆఖరి టి–20కి వర్షం ముప్పు



ఐదు టి–20ల సిరీస్‌లో భాగంగా భారత్, వెస్టిండీస్ మధ్య జరగాల్సిన ఆఖరి టి–20కి భారీ అడ్డంకి ఏర్పడింది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా శనివారం జరగాల్సిన ఈ మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉంది. మ్యాచ్ నిర్వహణ కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. శనివారం సాయంత్రం వర్షం పడే సూచనలు ఉన్నాయని అంచనా వేసింది. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఈ హైటెన్షన్ ఫైనల్ మ్యాచ్ రద్దవుతుందనే ఆందోళన నెలకొంది. ఒకవేళ మ్యాచ్ పాక్షికంగా జరిగినా.. డక్వర్త్ లూయిస్ ప్రకారం ఫలితాన్ని నిర్దేశిస్తారు. అదే జరిగితే ఒక జట్టు తీవ్రంగా నష్టపోనుంది. కనీసం ఇరు జట్ల మధ్య 5 ఓవర్ల ఆట సాధ్యమైతేనే డక్వర్త్ లూయిస్ ప్రకారం ఫలితాన్ని తేల్చుతారు. చిన్నదైన చిన్నస్వామి స్టేడియంలో 5 ఓవర్ల మ్యాచ్ భారత్‌కు నష్టం చేసే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే పూర్తి మ్యాచ్ జరగాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. చిన్నస్వామి స్టేడియంలో అత్యాధునాతన డ్రైనేజీ సిస్టమ్ ఉండటం కలిసొచ్చే అంశం. వర్షం కాస్త ఆగితే క్షణాల్లో మైదానాన్ని సిద్ధం చేయగలరు. కానీ వర్షం ఆగకుంటే మాత్రం మ్యాచ్ బంతి పడకుండానే తుడిచిపెట్టుకుపోయే ప్రమాదం ఉంది. భారీ స్కోర్లు నమోదైన ఈ సిరీస్‌లో ఇరు జట్లు రెండేసి విజయాలతో 2–2తో సమంగా నిలిచాయి. దాంతో ఆఖరి టి–20 సిరీస్ డిసైడర్‌గా మారింది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టే సిరీస్‌ను కైవసం చేసుకోనుంది. ఇలాంటి పరిస్థితుల్లో వర్షం ముప్పు అనే వార్తలను ఇరు జట్లతో పాటు అభిమానులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఒకవేళ మ్యాచ్ సజావుగా సాగితే టీమిండియా భిన్నమైన కాంబినేషన్‌తో బరిలోకి దిగనుంది. సీనియర్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ తుది జట్టులోకి తిరిగి రానుండగా.. ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్‌లలో ఒకరు బెంచ్‌కే పరిమితం కానున్నారు. టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీకి అవకాశం ఇస్తారా? లేదా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. గత నాలుగు మ్యాచ్‌ల్లో అతను బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఈ నాలుగు మ్యాచుల్లో సంజూ, అభిషేక్ చెరో రెండు మ్యాచ్‌లల్లో రాణించారు. భారత్ సిరీస్ కూడా గెలవకపోవడంతో వైభవ్‌కు అవకాశం ఇస్తారా? లేక బెంచ్‌కే పరిమితం చేస్తారా? అనేది సందేహంగా మారింది. అభిషేక్ శర్మకు రెస్ట్ ఇచ్చి వైభవ్‌ను ఆడించాలనే వాదన వినిపిస్తోంది. కానీ గౌతమ్ గంభీర్ ఏ నిర్ణయం తీసుకుంటాడో చూడాలి.

## సైన్స్

# కనిష్ఠ స్థాయికి ఆర్కిటిక్ సముద్ర మంచు



## మంచులేని అంటార్కిటికా!

అంటార్కిటికా చుట్టూ సముద్ర మంచులో ఈ ఏడాది శీతాకాలంలో అసాధారణంగా పెద్ద ప్రాంతం మంచు లేకుండా కనిపించింది. శాస్త్రవేత్తలు దీనిని ముఖ్యమైన వాతావరణ సమస్యగా భావిస్తున్నారు. ఈ మంచు లేని ప్రాంతం విస్తీర్ణం దాదాపు పోర్చుగల్ దేశంతో సమానమని నివేదికలు పేర్కొంటున్నాయి. పరిశోధన ప్రకారం, ఆకాశంలో నదులుగా పిలిచే భారీ వాతావరణ తేమ ప్రవాహాలు ఈ ప్రాంతంలో మంచు ఏర్పడకుండా చేయడంలో పాత్ర పోషించాయి. సముద్ర ఉపరితలంపై ఏర్పడే మంచు కేవలం ధ్రువ ప్రాంతాల దృశ్యానికి సంబంధించిన విషయం కాదు. అది సూర్యకాంతిని అంతరిక్షంలోకి ప్రతిఫలించడం ద్వారా భూమి ఉష్ణోగ్రత నియంత్రణలో సహాయపడుతుంది. గత దశాబ్దంలో అంటార్కిటిక్ సముద్ర మంచు స్థాయుల్లో గణనీయమైన మార్పులు కనిపిస్తున్నాయి. సహజ వాతావరణ మార్పులతో పాటు మానవ కార్యకలాపాల వల్ల ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు కూడా ఈ పరిణామాల్లో పాత్ర పోషిస్తున్నాయి. ఒకే సంఘటనను చూసి మొత్తం వాతావరణ మార్పుకు కారణం నిర్ణయించలేము. కానీ ఇలాంటి అసాధారణ ఘటనలు ధ్రువ ప్రాంతాల మారుతున్న పరిస్థితులను అర్థం చేసుకోవడానికి శాస్త్రవేత్తలకు విలువైన సమాచారాన్ని అందిస్తున్నాయి.



ఉత్తర ధ్రువ ప్రాంతంలో సముద్ర మంచు పరిమాణాన్ని ఉపగ్రహాల ద్వారా నిరంతరం పరిశీలిస్తున్నారు. ఈ ఏడాది ఆర్కిటిక్ సముద్ర మంచు విస్తీర్ణం సంవత్సరంలోని కనిష్ఠ స్థాయికి చేరినట్లు 'నాసా' నివేదించింది. సెప్టెంబర్ 12న ఈ వార్షిక కనిష్ఠ స్థాయి నమోదైనట్లు తెలిపింది. ఆర్కిటిక్ సముద్ర మంచు భూమి వాతావరణ వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తుంది. తెల్లటి మంచు సూర్యకాంతిలో ఎక్కువ భాగాన్ని తిరిగి అంతరిక్షంలోకి ప్రతిఫలిస్తుంది. మంచు తగ్గి, దాని స్థానంలో ముదురు సముద్రజలం కనిపిస్తే, అది ఎక్కువ సౌరశక్తిని గ్రహిస్తుంది. దీనివల్ల స్థానికంగా మరింత వేడెక్కే అవకాశం ఉంటుంది. ఈ ఏడాది నమోదైన పరిస్థితులను అర్థం చేసుకోవడానికి శాస్త్రవేత్తలు అనేక సంవత్సరాల ఉపగ్రహ రికార్డులను పోల్చుతున్నారు. 'నాసా' సమాచారం ప్రకారం, ఆర్కిటిక్ సముద్ర మంచు శీతాకాలం, వేసవి రెండింటిలోనూ దీర్ఘకాలిక మార్పులను చూపుతోంది. ఇలాంటి మార్పులు కేవలం ధ్రువ ప్రాంతాలకే పరిమితం కావు. సముద్ర ప్రవాహాలు, వాతావరణ వ్యవస్థలు, జీవవైవిధ్యం, సముద్ర మట్టాలు వంటి అనేక అంశాలతో ధ్రువ మంచు పరిస్థితులకు సంబంధం ఉంది. అందుకే ఉపగ్రహాల ద్వారా దీన్ని నిరంతరం పర్యవేక్షించడం భవిష్యత్ వాతావరణ అంచనాలకు అత్యంత అవసరం.

# తొలిసారిగా పనిచేసే న్యూక్లియర్ గడియారాలు

సాంప్రదాయ అణు గడియారాల కంటే మరింత ఖచ్చితమైన సమయాన్ని కొలిచే అవకాశం ఉన్న 'న్యూక్లియర్ క్లాక్స్'ను ఆస్ట్రియా, చైనాకు చెందిన శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఈ నెలలో, ఇవి పనిచేయడం ప్రారంభమైంది. సాధారణ అణు గడియారాలు పరమాణువులోని ఎలక్ట్రాన్లు ఒక శక్తి స్థాయి నుంచి మరొకదానికి మారే సమయంలో ఉత్పత్తయ్యే మార్పులను ఉపయోగిస్తాయి. అయితే న్యూక్లియర్ క్లాక్‌లో పరమాణువుకు చెందిన కేంద్రకంలో జరిగే మార్పును సమయ కొలతకు ఉపయోగిస్తారు. ఈ పరిశోధనలో థోరియం 229 కేంద్రకాలను కాల్షియం ఫ్లోరైడ్ స్ఫటికాల్లో ఉపయోగించారు. లేజర్ కాంతి ద్వారా కేంద్రకంలోని అత్యంత సూక్ష్మమైన శక్తి మార్పును గుర్తించడం ద్వారా సమయాన్ని కొలుస్తారు. ఇవి అత్యంత ఖచ్చితమైన అణు గడియారాలను భర్తీ చేస్తాయన్న అంచనా ప్రస్తుతానికి లేదు. అయినప్పటికీ, భవిష్యత్తులో నావిగేషన్, ఉపగ్రహ వ్యవస్థలు, టెలికమ్యూనికేషన్లు, కంప్యూటర్ నెట్‌వర్క్స్ సమయ సమన్వయం వంటి రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురావచ్చు. అంతేకాకుండా,డార్క్ మ్యాటర్ వంటి విశ్వంలోని రహస్యాలను పరిశోధించడానికి కూడా ఇవి ఉపయోగపడే అవకాశం ఉంది.



## బిఎల్‌ఒలకు గౌరవ వేతనం విడుదలలో కాలయాపన తగదు

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ లిస్ట్ వెరిఫికేషన్‌లో అంగన్‌వాడీ టీచర్లను బిఎల్‌ఒలుగా నియమించి వారికి రావల్సిన గౌరవ వేతనాన్ని ఇవ్వకుండా ప్రభుత్వ కాలయాన చేస్తుందని వెంటనే విడుదల చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం సూర్యాపేట జిల్లాలో పనిచేస్తున్న వివిధ మండలాల బిఎల్‌ఒలతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిఆర్‌ఒ ప్రేమ్‌రాజుకి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చేది అరకొర జీతమని, వారికిచ్చే గౌరవ వేతనాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్లను బిఎల్ఒ డ్యూటీల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా గౌరవ సలహాదారులు చామల అశోక్, దంతాల రాంబాబు, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ టీచర్ల యూనియన్ జిల్లా నాయకురాల్లు ఆర్.స్వప్న, అశ్విని, అనిత, పుష్ప, హేమలత, భాగ్య, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

## కరెంట్ చార్జీల పెంపు యోచనను ప్రభుత్వం విరమించుకోవాలి

సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** నవంబర్ నెల నుంచి రాష్ట్రంలో ట్రూ అప్ చార్జీల రూపంలో కరెంట్ చార్జీలు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న యోచనను వెంటనే విరమించుకోవాలని సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం డిమాండ్ చేశారు. శుక్రవారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో జరిగిన సిపిఐ రామగుండం నగర కార్యవర్గ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. నవంబర్ నెల నుంచి ప్రతి యూనిట్ విద్యుత్ వినియోగంపై అదనంగా 30 పైసలు వసూలు చేయాలని ప్రభుత్వం చూస్తున్నదన్నారు. డిసెంబర్ నుంచి 50పైసలు అదనంగా వసూలు చేయాలని చూడడం హేయమైన చర్య అని ఆయన ఆరోపించారు. ట్రూ అప్ మొత్తం 7,635 కోట్ల రూపాయల భారాన్ని ప్రజలపై మోపాలని చూస్తే సిపిఐ చూస్తూ ఊరుకోదని ఆయన హెచ్చరించారు. శనిగరపు చంద్ర శేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో స్థానిక ప్రజా సమస్యలపై పోరాటాలు చేపట్టాలని తీర్మానించారు. సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గోసిక మోహన్, నగర కార్యదర్శి కె.కనకరాజ్, కార్పొరేటర్ మార్కాపురి సూర్య, నగర కార్యవర్గ సభ్యులు తాల్లపెల్లి మల్లయ్య, మాటేటి శంకర్, రంగు శ్రీను, పడాల కనకరాజు, రేణికుంట్ల ప్రీతం, సంకె అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను గుర్తించని పాలకులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా ఆగ్రహం

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్

ఉద్యోగుల సమ్మెకు ఎఐటియుసి సంఘీభావం



**ప్రజాపక్షం/హనుమకొండ :** నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించడం లేదని, వారి సమస్యలను పరిష్కరించడం లేదని జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా ఆవేదన వ్యక్తం చేశారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న 78 క్యాడర్ ఉద్యోగులందరినీ తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు చేస్తున్న నిరవదిక సమ్మె నాలుగో రోజుకు చేరింది. సమ్మెకు సంఘీభావం తెలిపి రామ రాజేష్‌ఖన్నా మాట్లాడుతూ ఈనెల 13నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు నిరవధిక సమ్మె చేపట్టినట్లు తెలిపారు, ప్రభుత్వ ఉద్యోగులకు దీటుగా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు పనిచేస్తున్నా ప్రభుత్వం గుర్తించడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 17వేల మంది ఉద్యోగులు ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్నారన్నారు. వారిని తక్షణమే రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వం హక్కులు కల్పిస్తూ సమాన పనికి సమాన వేతనం ఆరోగ్య భద్రత కల్పించాలని కోరారు. మహిళ ఉద్యోగులకు 180 రోజులు జీతంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, ఆరోగ్య బీమా ప్రతి ఉద్యోగికి కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి యాదవ్, ఎన్‌హెచ్‌ఎం జెఎసి స్టేట్ జనరల్ సెక్రెటరీ రుక్కుదిన్, కోశాధికారి మొగిలి నరేష్, జెఎసి హనుమకొండ జిల్లా వర్కింగ్‌ప్రెసిడెంట్ రాజేంద్రప్రసాద్, ఎన్‌హెచ్‌ఎం (ఎఐటియుసి అనుబంధం) రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బద్రి వేణు, ఉద్యోగులు, శ్యామ్, రాజేష్ గౌడ్, వెంకటేష్, రాకేష్, యాదవ్, అన్వేష్, సువర్ణ,వనజ, బైరి అశోక్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

**వరంగల్ :** ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు రెగ్యులరైజేషన్ చేయాలని ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం కల్పించాలని డిమాండ్ చేస్తూ జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా ఆధ్వర్యంలో ఉద్యోగులు చేస్తున్న సమ్మె శుక్రవారం 4వ రోజు భాగంలో మోకాళ్ల పై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం జెఎసి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ టి.భరత్ కుమార్, డాక్టర్ రమ్య, డాక్టర్. యశస్విని, మెరుగు అనిల్ కుమార్, ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర వైస్‌ప్రెసిడెంట్ ఆచంట అభిషేక్, సంజీవ్, వరంగల్ జిల్లా అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఫార్మసి ఆఫీసర్ తీగల సతీష్ కుమార్, నర్సింగ్ ఆఫీసర్స్ మంజుల, వాణి, యాప్ టెక్నీషియన్ శోభ, ఏఎన్‌ఎంలు చంద్రకళ, జ్యోతి, విజయ, సంధ్య, ఎమ్ఎన్‌ఒలు, ఏకుల చిరంజీవి, విజయ నాయక్ పాల్గొన్నారు.

**నాగర్‌కర్నూల్:** ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకుని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను క్రమబద్దీకరించి పర్మినెంట్ చేయాలని ఎఐటియుసి నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టరేట్ ఎదుట ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు చేస్తున్న నాలుగో రోజులో సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల జెఎసి అధ్యక్షుడు డా.బాలకృష్ణ, డాక్టర్ డి.కుమార్, డా.ప్రవీణ్ కుమార్, డా.జగన్, డా.మహతి, డా.సంధ్యారాణి, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

**నల్లగొండ :** ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, వారిని పర్మినెంట్ చేయాలని ఎఐటియుసి రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఎన్‌హెచ్‌ఎం అన్ని క్యాడర్ల ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న సమ్మెకు శుక్రవారం ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని కోరారు. పెండింగ్ ఇంక్రిమెంట్లు, బోనస్, పీఆర్సీ బకాయిలను విడుదల చేయాలని, ఉద్యోగ భద్రత, ఇన్సూరెన్స్, ఇహెచ్‌ఎస్, ఇఎస్ఐ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నాలుగు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలని, ఉద్యోగుల పోరాటానికి ఎఐటియుసి సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎఐటియుసి వర్కింగ్ ప్రెసిడెంట్ కెఎస్.రెడ్డి, సహాయ కార్యదర్శి ఎండి జానీ, ఎన్‌హెచ్‌ఎం జెఎసి నాయకులు డాక్టర్ హరిప్రియ, దయానంద్, సైదయ్య, సురేష్, ఉపేందర్, గణేష్, ప్రియాంక, ధనలక్ష్మి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.





## సబ్సిడీతో నాణ్యమైన విత్తనాలు అందించాలి

సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** పంట మార్పిడి కోసం ఆరుతడి పంటల విత్తనాలను సబ్సిడీతో రైతాంగానికి అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం ఉండబోతుందని యాసంగి వరి సాగును వేయొద్దని చెబుతున్న సిఎం రేవంత్‌రెడ్డి అందుకు అనుగుణంగా రైతులను ఆదుకోవాలని కోరారు. పంట మార్పిడి కోసం ఎండలకు తట్టుకునేలా ఉండే ఆరుతడి పంటల విత్తనాలను రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన విత్తనాలను సబ్సిడీతో వ్యవసాయశాఖ ద్వారా మొక్కజొన్న, నువ్వులు, పొద్దుతిరుగు పువ్వు, కుసుమ, తదితర పప్పు దినుసుల విత్తనాలను మధ్య దళారుల ప్రమేయం లేకుండా సబ్సిడీతో అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సమావేశంలో పార్టీ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ప్రీ ప్రైమరీ టీచర్ల పెండింగ్ వేతనాలు ఇవ్వండి

ఎఐటియుసి నేత బోయిని డిమాండ్



**ప్రజాపక్షం/హత్నూర :** ప్రీప్రైమరీ టీచర్ల ఆయాల పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఎఐటియుసి సంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడంట్ బోయిని ప్రసాద్ కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రీ ప్రైమరీ స్కూల్ ఇన్‌స్పెక్టర్, ఆయాల పెండింగ్ వేతనాల బడ్జెట్ రాష్ట్రవ్యాప్తంగా జిల్లాలు వారీగా విడుదల అయినప్పటకీ వారి బ్యాంకు ఖాతాలలోని గాని చేతిరూపంగానే తీసుకోలేన దౌర్భాగ్యం పరిస్థితి ఏర్పడిందన్నారు. జిల్లా అధికారులకు స్పందించి , బతుకమ్మ, దసరా పండులను దృష్టిలో పెట్టుకొని పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలన్నారు. జిల్లా విద్యాధికారి జోక్యం చేసుకొని తక్షణమే టీచర్, ఆయాలకు పెండింగ్ వేతనాలు ఇప్పించాలని ఆయన కోరారు. సమావేశంలో ఎఐటియుసి నాయకులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఓటు నమోదుపై
# కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి



### సామ రామోహన్ రెడ్డిని గెలిపించాలని పార్టీ శ్రేణులకు మంత్రి పొన్నం పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేలా హైదరాబాద్ జంట నగరాల్లోని పట్టభద్రులందరూ వెంటనే ఓటర్లుగా నమోదు చేసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టేందుకు హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ఎఐసిసి ఇంచార్జి సచిన్ సావంత్ నాయకత్వంలో నిర్వహించిన సమావేశంలో హైదరాబాద్‌లోని 15 నియోజకవర్గాల నుంచి పోటీ చేసిన అభ్యర్థులు, ప్రదేశ్ కాంగ్రెస్ నియమించిన పరిశీలకులు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పాల్గొన్నారని మంత్రి వెల్లడించారు. ప్రతి శాసనసభ నియోజకవర్గ పరిధిలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు, సామాజిక కార్యకర్తలు పట్టభద్రులను నేరుగా కలిసి ఓటు నమోదు ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. కోర్టులు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు తదితర ప్రాంతాల్లో పనిచేస్తున్న పట్టభద్రులను సంప్రదించి, వారు ఓటర్లుగా నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న ఓటరు జాబితా సవరణ ప్రక్రియ నేపథ్యంలో పట్టభద్రులు తమ ఓటు హక్కుకు సంబంధించిన వివరాలను పరిశీలించుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణతో పాటు పట్టభద్రుల సమస్యలను శాసనమండలిలో బలంగా వినిపించేందుకు వారి ఓటు హక్కు ఎంతో కీలకమని పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, న్యాయవాదులు, ఉపాధ్యాయుల సమస్యలతోపాటు ఉద్యోగ ఖాళీల భర్తీ వంటి అంశాలపై ప్రజాపాలన ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు. పట్టభద్రుల సమస్యలను మరింత సమర్థంగా శాసనమండలిలో ప్రస్తావించేందుకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామా రామోహన్ రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించేందుకు పార్టీ శ్రేణులంతా సమష్టిగా కృషి చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. హైదరాబాద్‌లోని పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.



శిల్పకళా వేదికలో నేడు జరగనున్న బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్- 2026 అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి రావాలని సిఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించిన టిజిఎఫ్‌డిసి ఛైర్మన్ దిల్ రాజు, సినీ దర్శకుడు హరీష్ శంకర్, తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, సినీ ప్రముఖులు చరణ్ అర్జున్, నల్గొండ గద్దర్.

# 37 ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లు

### తెలంగాణలో వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలకు ఆధునిక సాంకేతికత
### రూ.425.50 కోట్లతో ప్రభుత్వ అనుమతులు జారీ: మంత్రి పొన్నం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 37 ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ల (ఎటిఎస్) ఏర్పాటుకు రూ.425.50 కోట్లతో సవరించిన పరిపాలనా అనుమతులు మంజూరు చేసినట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రవాణా, రహదారులు, భవనాల శాఖ ఈ నెల 15న జిఓ ఎంఎస్ నంబర్ 50ను జారీ చేసింది. ఒక్కో స్టేషన్ నిర్మాణ వ్యయాన్ని గతంలో నిర్ణయించిన రూ.8 కోట్ల నుంచి రూ.11.50 కోట్లకు పెంచింది. మొత్తం 37 స్టేషన్లను రెండు దశల్లో ఏర్పాటు చేయనున్నారు. మొదటి దశలో 15 స్టేషన్ల నిర్మాణానికి రూ.172.50 కోట్లు, రెండో దశలో మిగిలిన 22 స్టేషన్ల ఏర్పాటుకు రూ.253 కోట్లు కేటాయించారు. అప్పటి జిల్లా ప్రధాన కార్యాలయాలతో పాటు గ్రేటర్ హైదరాబాద్, హెచ్‌ఎండిఎ పరిధిలోనూ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు.

**స్వయం ఆర్థిక నమూనాలో నిర్వహణ..**

స్టేషన్ల ఏర్పాటు, నిర్వహణ కోసం రవాణా శాఖ పరిధిలో ప్రత్యేక ప్రయోజన సంస్థ (ఎస్‌పివి)ను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధులను హడ్కో వంటి ఆర్థిక సంస్థల నుంచి రుణాల రూపంలో సమీకరించనున్నారు. వాహనాల ఫిట్‌నెస్ పరీక్షల ద్వారా వసూలయ్యే దరఖాస్తు, పరీక్ష, వినియోగదారు రుసుములను ప్రత్యేక నిధిలో జమ చేసి, రుణాల అసలు, వడ్డీ చెల్లింపులకు వినియోగించనున్నారు. ఎస్‌పివి ఏర్పాటు, దాని నిర్వహణకు అవసరమైన విధి విధానాలు, ఆర్థిక నమూనాపై ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి సమర్పించాలని రవాణా కమిషనర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. ఈ స్టేషన్ల ఏర్పాటుతో వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలను మరింత ఆధునిక పద్ధతిలో నిర్వహించేందుకు అవకాశం కలగనుంది.

### 'పట్టభద్రుల'ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని
# సిపిఐ(ఎం)తో టిపిసిసి భేటీ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** త్వరలో జరగనున్న శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని సిపిఐ(ఎం)ను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) కోరింది. ఈ మేరకు టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి హైదరాబాద్‌లోని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం మాకినేని బసవపున్నయ్య భవన్‌కు వెళ్ళి సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, నాయకులు టి.సాగర్, టి.జ్యోతి, పోతినేని సుదర్శన్, బండారు రవికుమార్‌లతో చర్చలు జరిపారు. ప్రజా వ్యతిరేక, మతతత్వ బిజెపిని ఓడించడానికి ప్రజాస్వామ్య, వామపక్ష, లౌకిక శక్తులంతా ఐక్యంగా ముందుకు సాగాలని, అందులో భాగంగా ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని టిపిసిసి ప్రతినిధి బృందం సిపిఐ(ఎం) నాయకులను కోరింది. ఈ విషయంపై పార్టీ రాష్ట్ర కమిటీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కాంగ్రెస్‌కు సిపిఐ(ఎం) నాయకులు తెలియజేశారు.

# ఓట్ల తొలగింపు ప్రచారం అవాస్తవం
### సిఇఒ సి. సుదర్శన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో భారీగా ఓటర్లను తొలగించారంటూ జరుగుతున్న ప్రచారం అవాస్తవమని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఈఓ) సి. సుదర్శన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన ఓట్ల తొలగించారంటూ జరుగుతున్న ప్రచారాన్ని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్రవ్యాప్తంగా 2.64 కోట్ల మంది ఓటర్ల నుంచి ఫారాలు స్వీకరించామని, 73.39 లక్షల మందికి సంబంధించిన ఫారాలు అందలేదని తెలిపారు. బిఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి ఫారాలను సేకరించారని, ఓటర్లకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు పూర్తి అవకాశాలు కల్పించామన్నారు. ఫారాలు సమర్పించిన వారి పేర్లను ముసాయిదా ఓటర్ల జాబితాలో చేర్చామని, ఫారాలు అందని వారికి క్లెయిమ్స్, అభ్యంతరాల ప్రక్రియ ద్వారా మరో అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఈనెల 16, 17 తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి కొత్త, యువ ఓటర్ల నమోదుకు కూడా అవకాశం కల్పించామన్నారు. అర్హులైన ప్రతి ఓటరికి జాబితాలో స్థానం కల్పిస్తామన్నారు.

# దేశంలో ఓట్ల చోరీ జరగలేదు
### కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశంలో ఓట్ల చోరీ జరగలేదని, ఎన్నికల కమిషన్‌పై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలు నిరాధారమని కేంద్ర బొగ్గు గనుల శాఖమంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజ్యాంగబద్ధ సంస్థలను బలహీనపరిచే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తోందని ఆరోపించారు. రాహుల్ గాంధీ ఎన్నికల కమిషన్, న్యాయ వ్యవస్థలపై అనవసర ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. దేశ భద్రత కోసం సేవలందిస్తున్న జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌ను రాజకీయాల్లోకి లాగడం తగదన్నారు. ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ కొత్తది కాదని, నెహ్రూ కాలం నుంచే అమల్లో ఉందన్నారు. తెలంగాణలో బిజెపి నేతలను అర్ధరాత్రి అరెస్టు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఢిల్లీలో రాజ్యాంగ పరిరక్షణపై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. శ్రీలంకలో అలజడి సృష్టించి ప్రభుత్వాన్ని కూల్చిన మాదిరిగానే భారత దేశంలోనూ ఎన్‌డిఏ ప్రభుత్వాన్ని కూల్చేస్తామని రాహుల్ గాంధీ దింపుడు కళ్లం ఆశలు పెట్టుకున్నారని కిషన్ రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీకి దమ్ము, ధైర్యం ఉంటే ప్రజాదరణతో ఎన్నికైన మోదీ ప్రభుత్వాన్ని పడగొట్టి చూయాలని సవాల్ విసిరారు.




# పన్నెండేళ్లైనా తెలంగాణ యువత ఆకాంక్షలు నెరవేరలేదు
### ఏపి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ యువత త్యాగాలు, పోరాటాల ఫలితంగా రాష్ట్రం ఏర్పడిందని, పన్నెండేళ్లు గడుస్తున్నా ప్రజల ఆకాంక్షలు ఇంకా పూర్తిస్థాయిలో నెరవేరలేదని జనసేన పార్టీ అధ్యక్షుడు, ఏపి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జనసేన అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావుకు మద్దతుగా రూపొందించిన ' జనసేన గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్' ప్రచార రథాన్ని శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ యువత ఆశయాలను నెరవేర్చేందుకు జనసేన పనిచేస్తుందని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ద్వారా తొలిసారిగా తెలంగాణకు సేవ చేసే అవకాశం లభిస్తోందన్నారు. ప్రచార రథంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పట్టభద్రుల కుర్చీలో కూర్చొని తమ సమస్యలు, ఆకాంక్షలను పంచుకోవాలని కోరారు. తెలంగాణలో జనసేనకు ఒక్క అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గడల శ్రీనివాసరావు 120 రోజులపాటు ప్రచార రథం ద్వారా ప్రజల్లో పర్యటిస్తారని తెలిపారు.

# నేడు బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ అవార్డ్స్ వేడుకలు



**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** హైదరాబాద్ శిల్పకళా వేదికలో బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ అవార్డ్స్ – 2026 వేడుకలను ఈ నెల 17వ తేదీ ఉదయం 11 గంటల నుండి అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్ రాజు తెలిపారు. శిల్పకళా వేదికలో చేస్తున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్‌ష తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి ముకుంద రెడ్డి, క్రియేటివ్ డైరెక్టర్ కొండ రాజు, టిజిఎఫ్‌డిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిషోర్ బాబు, ఐ అండ్ పి ఆర్ అదనపు సంచాలకులు డి ఎస్ జగన్, యాంకర్ ఉదయభాను తదితరులు పాల్గొన్నారు.ఈ ఛాలెంజ్ 5 కేటగిరీల్లో ఎంపిక అయిన 35 మంది యంగ్ ఫిల్మ్ మేకర్స్ కు అవార్డులు ముఖ్య అతిథులు అందజేస్తారు. ముఖ్యమంత్రి ఎ .రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పరిశ్రమలు, వాణిజ్య, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఇతర ప్రజా ప్రతినిధులు , సినిమా రంగ ప్రముఖులు, తదితరులు పాల్గొనున్నారు. బతుకమ్మ పండుగను పురస్కరించుకుని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 2వ యంగ్ ఇండియా ఫిల్మ్ మేకర్స్ అవార్డ్స్ ఛాలెంజ్ –2026లో భాగంగా 5 కేటగిరీల పోటీలలో పాల్గొనేందుకు 2,670 మంది ఔత్సాహికులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఎంట్రీల పరిశీలన, అవార్డులకు ఎంపికకు ప్రతి కేటగిరీకి ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేశారు. ఫిల్మ్, సాంగ్స్, ఫోక్ సాంగ్స్, ఇన్‌ఫ్లూయెన్సర్స్ కేటగిరీల్లో ప్రతి కేటగిరీలో మొదటి బహుమతిగా రూ.3 లక్షలు, ద్వితీయ బహుమతిగా రూ.2 లక్షలు, తృతీయ బహుమతిగా రూ.1 లక్ష చొప్పున అందజేస్తారు. ఈ 4 కేటగిరీలో ప్రతి కేటగిరీలో 5 కన్సోలేషన్ బహుమతుల కింద ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున ఇస్తారు. అలాగే 5 వ కేటగిరీ ఆర్టికల్స్ కేటగిరీ అవార్డ్స్ కింద ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద రూ.3 లక్షలు, రూ. 2 లక్షలు, రూ 1 లక్ష చొప్పున అందజేస్తారు.

# ఎల్ నినోతో నీటి ఎద్దడి ముప్పు
### అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ బహిరంగ లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొనే ప్రమాదం ఉందని, నీటి ఎద్దడి నివారణకు ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ కోరారు. జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గడం, భూగర్భ జలాలపై ఒత్తిడి పెరగడం, వ్యవసాయానికి నీటి కొరత వంటి సమస్యలు రానున్న రోజుల్లో తీవ్ర సవాల్‌గా మారవచ్చని ఆయన పేర్కొన్నారు. నీటి పొదుపుపై ప్రజల్లో చైతన్యం కల్పించాలని, వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాలని మహేష్ కుమార్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తెలంగాణ ప్రజలకు ఆయన బహిరంగ లేఖ విడుదల చేశారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం జలాశయాల్లో 460 టిఎంసిలకు బదులుగా ప్రస్తుతం 209 టిఎంసిల నీరు మాత్రమే ఉందని, నీటిని పొదుపుగా వినియోగించకపోతే వేసవి నాటికి పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతుందని హెచ్చరించారు. హైదరాబాద్ సహా పట్టణ ప్రాంతాల తాగునీటి వనరులపైనా ఒత్తిడి పెరిగే అవకాశముందని పేర్కొన్నారు. రైతులు నీటి లభ్యతను బట్టి పంటలు ఎంచుకోవాలని, తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలపై కాంగ్రెస్ శ్రేణులు అవగాహన కల్పించాలని సూచించారు. చెరువులు, జలాశయాల నీటి నిల్వలను పరిశీలించి, తాగునీటి సమస్య తలెత్తే గ్రామాలను ముందుగానే గుర్తించాలని నాయకులకు పిలుపునిచ్చారు.



## అమెరికాలో హింసగా మారుతున్న
# భారతీయులపై ద్వేషం

**వాషింగ్టన్ :** అమెరికాలోని ఇల్లినాయిస్ రాష్ట్రంలో హిందూ ఆలయంపై సామూహిక కాల్పులకు కుట్ర జరిగిందన్న ఆరోపణలపై పలువురు అమెరికా చట్టసభ సభ్యులు, హక్కుల సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. భారతీయులు, హిందువులపై వ్యతిరేకత హింసాత్మక ఘటనలకు దారితీస్తోందని పేర్కొన్నాయి. చికాగో సమీపంలోని పాలటైన్‌లో 19 ఏళ్ల యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం (అక్టోబర్ 11)వ తేదీన, అరోరాలోని శ్రీ వేంకటేశ్వర ఆలయంలో సామూహిక కాల్పులకు కుట్ర పన్నినట్లు అతడిపై ఆరోపణలు ఉన్నాయి. అయితే, అతడి వద్ద ఉన్న తుపాకీ పనిచేయకపోవడంతో కాల్పులు జరగలేదు. ఈనెల 14న కోర్టులో హాజరైన అతడిపై ఉగ్రవాద బెదిరింపులకు పాల్పడటం, అక్రమంగా ఆయుధాలు కలిగి ఉండటం వంటి అభియోగాలు నమోదయ్యాయి. సెనేటర్లు చక్ షూమర్, జాన్ కార్నిన్, జాకీ రోసెన్ సహా పలువురు ప్రజాప్రతినిధులు పోలీసుల సకాల చర్యలను ప్రశంసించారు. అమెరికాలో భారతీయులు, హిందువులపై విద్వేషపూరిత వ్యాఖ్యలు ఆందోళనకర స్థాయికి చేరాయని, ఆ ద్వేషం ఇప్పుడు హింసగా మారుతోందని షూమర్ పేర్కొన్నారు. జాతి, మతంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా తమ మతాన్ని ఆచరించే హక్కు కలిగి ఉండాలని అన్నారు. కాంగ్రెస్ ఆసియన్ పసిఫిక్ అమెరికన్ కాకస్ (క్యాపాక్), ఎడిఎల్ వంటి సంస్థలు మతపరమైన ప్రార్థనా స్థలాలను లక్ష్యంగా చేసుకోవడంపై ఆందోళన వ్యక్తం చేశాయి. గత రెండేళ్లలో సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో దక్షిణాసియన్లపై ద్వేషపూరిత వ్యాఖ్యలు 240 శాతం పెరిగాయని క్యాపాక్ తెలిపింది. జాతి, మతం, నేపథ్యం ఆధారంగా ప్రజలను కించపరిచే వ్యాఖ్యలు దేశ ఐక్యతను దెబ్బతీస్తాయని కాంగ్రెస్ సభ్యుడు టామ్ సుయోజీ అన్నారు. భారతీయ అమెరికన్లపై శ్వేతజాతి ఆధిపత్యవాద ద్వేషానికి ఈ కుట్ర నిదర్శనమని గ్రెగ్ స్టాంటన్ వ్యాఖ్యానించారు. ఈ ఘటనను అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ బహిరంగంగా ఖండించాలని, ద్వేషాన్ని పెంచే వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని ఇల్లినాయిస్ కాంగ్రెస్ సభ్యుడు జోనాథన్ జాక్సన్ కోరారు.

# దసరా ప్రయాణాలకు 7 వేల ప్రత్యేక బస్సులు
### నేటి నుంచి 19 వరకు రద్దీకి అనుగుణంగా అదనపు సర్వీసులు : ఎండి వై.నాగిరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దసరా పండుగకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్‌ఆర్‌టిసి) 7 వేల ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు సంస్థ విసి, ఎండి వై.నాగిరెడ్డి తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి ఇప్పటివరకు 95 శాతం ప్రత్యేక బస్సులను విజయవంతంగా నడిపినట్లు వెల్లడించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని జూబ్లీ బస్‌స్టేషన్ (జెబిఎస్)లో ప్రయాణికుల కోసం చేసిన ఏర్పాట్లను ఎండి నాగిరెడ్డి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సిహెచ్.వెంకన్న, ఎ.శ్రీధర్‌లతో కలిసి పరిశీలించారు. సికింద్రాబాద్ ఆర్‌ఎం సుచరిత, కరీంనగర్ ఆర్‌ఎం రాజులతో బస్సుల నిర్వహణ, ప్రయాణికుల రద్దీపై సమీక్షించారు. బస్‌స్టేషన్‌లో గంటకు పైగా పర్యటించిన ఆయన ప్రయాణికులతో మాట్లాడి సౌకర్యాలు, మౌలిక వసతులపై వివరాలు తెలుసుకున్నారు. ఈ నెల 17, 18, 19 తేదీల్లో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున అవసరమైన ప్రాంతాలకు అదనపు బస్సులు నడపాలని అధికారులను ఆదేశించారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్షేత్రస్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రయాణికులు ముందస్తు టికెట్ రిజర్వేషన్ల కోసం www.tgsrtcbus.in వెబ్‌సైట్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ప్రత్యేక బస్సుల వివరాలకు 040 69440000, 04023450033 నంబర్లను సంప్రదించాలని కోరారు. ప్రయాణికులు ఆర్‌టిసి సేవలను వినియోగించుకుని సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## అధ్యక్ష ఎన్నికల సమయంలో
# పక్షపాత వైఖరి కూడదు




### 'మెటా'కు బ్రెజిల్ ఎన్నికల కోర్టు స్పష్టీకరణ

**సావో పాలో:** బ్రెజిల్ అధ్యక్ష ఎన్నికల సమయంలో పక్షపాత వైఖరి కూడదని ప్రముఖ సోషల్ మీడియా సంస్థ మెటాకు బ్రెజిల్ అత్యున్నత ఎన్నికల కోర్టు స్పష్టం చేసింది. బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డా సిల్వా చేసిన ఫిర్యాదుపై స్పందిస్తూ, అధ్యక్ష ఎన్నికల తుది విడతకు ముందు ఇద్దరు అభ్యర్థులకూ సమాన ప్రాధాన్యం కల్పించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని మెటా సంస్థను ఆదేశించింది. అక్టోబర్ 25న తుది విడత పోలింగ్ జరగనుంది. లులా ప్రత్యర్థి ఫ్లావియో బోల్సోనారోకు అనుకూలంగా ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, వాట్సాప్ అల్గారిథమ్‌లు పనిచేస్తున్నాయని లులా ప్రచార బృందం ఆరోపించింది. దీనిపై న్యాయమూర్తి మార్కో ఆరేలియో బెల్లిజే జారీ చేసిన ఆదేశాల ప్రకారం, లులా, బోల్సోనారో రాజకీయ పోస్టుల ప్రచార పరిధిని తగ్గించడం, శోధనలను పరిమితం చేయడం లేదా పోస్టులను తొలగించడం ద్వారా ఏ అభ్యర్థికీ అన్యాయం జరగడానికి వీల్లేదు. మెటా ఎఐ సాధనం కూడా ఇద్దరు అభ్యర్థుల విషయంలో ఒకేరకమైన ప్రమాణాలను అనుసరించాలి. ఆదేశాలను ఉల్లంఘిస్తే రోజుకు 5 లక్షల బ్రెజిలియన్ రియల్స్ (సుమారు 98 వేల డాలర్లు) చొప్పున జరిమానా విధిస్తామని కూడా మెటాను కోర్టు హెచ్చరించింది. లులా ప్రచార బృందం ప్రకారం, ఆయన ప్రచార పోస్టుల వ్యాప్తిని అన్యాయంగా తగ్గించగా, బోల్సోనారోకు మద్దతిచ్చే ఖాతాలు, ప్రకటనలకు అసాధారణంగా అధిక ప్రచారం లభించింది. వాట్సాప్‌లోని మెటా ఎఐ ద్వారా లులాకు అనుకూలంగా ప్రచార చిత్రాలను రూపొందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, బోల్సోనారోకు మద్దతుగా మాత్రం అలాంటి సమస్యలు లేకుండా చిత్రాలు రూపొందించగలుగుతున్నారని కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే, బోల్సోనారోకు అనుకూలంగా వ్యవహరిస్తున్నామన్న ఆరోపణలను మెటా తిరస్కరించింది. బ్రెజిల్ ఎన్నికల నిబంధనలను పూర్తిగా పాటిస్తున్నామని, అన్ని రాజకీయ పార్టీలకు సమాన అవకాశాలు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపింది. సాంకేతిక సమస్యలు కొన్ని ఖాతాలను ప్రభావితం చేశాయని అంగీకరించినప్పటికీ, అవి బ్రెజిల్‌కు మాత్రమే పరిమితం కాలేదని స్పష్టం చేసింది. ఈనెల 4న జరిగిన తొలి విడత పోలింగ్‌లో బోల్సోనారోకు 47 శాతం, లులాకు 45 శాతం ఓట్లు వచ్చాయి.




### రష్యా సైన్యంలో చేరిన తెలంగాణ వాసులు
# సురక్షితంగా ఉన్నారా?
### గద్వాల్ విజయలక్ష్మి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రష్యా సైన్యంలో ఏజెంట్స్ మోసపూరిత మాటలతో చేరిన నలుగురు తెలంగాణ వాసులు సురక్షితంగా ఉన్నారా?, లేదా అనే పూర్తి వివరాలను తెలియజేయాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్యను 'సిఎం ప్రజావాణి' రాష్ట్ర ఇన్‌చార్జ్ గద్వాల్ విజయలక్ష్మి సూచించారు. హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే ప్రజా భవన్‌లో శుక్రవారం '262వ సీఎం ప్రజావాణి కార్యక్రమం' జరిగింది. ఈ సందర్భంగా రష్యా సైన్యంలో చిక్కుకున్న నలుగురు వ్యక్తుల కుటుంబ సభ్యులు గద్వాల్ విజయలక్ష్మి ని కలిసి తమ కుటుంబ సభ్యుల ఆచూకీ కనుగొనాలని కోరారు. తమ వారిని మోసపూరితంగా రష్యాకు తరలించిన ఏజెంట్ ఉత్తరప్రదేశ్ కు చెందిన గౌరవ్ ను నిజామాబాద్ జిల్లా పోలీసులు ఇది వరకే అరెస్ట్ చేశారని వివరించారు. కాగా హైదరాబాద్‌లోని ఉప్పల్ కు చెందిన జయంత్ అనే విద్యార్థి కూడా రష్యాకు చదువుకునేందుకు వెళ్లి పౌరసత్వం ఆశతో రష్యా పోలీస్ విభాగంలో చేరినట్టు ఆ విద్యార్థి కుటుంబ సభ్యులు సీఎం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా, సిఎం ప్రజావాణిలో 105 దరఖాస్తులు అందాయి. ఇందులో రెవెన్యూ శాఖకు 25, హోం శాఖకు 14, బీసీ శాఖకు 15, ఇతర శాఖలకు 51 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి కె.విద్యాసాగర్, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎసిపి ఉమేందర్, ఎన్. ఆర్. ఐ. సలహా మండలి వైస్ చైర్మన్ మంద భీం రెడ్డి, సభ్యులు చెన్నమనేని శ్రీనివాస్ రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### 'ఇందిరమ్మ ఇండ్ల' కేటాయింపు
# కాంగ్రెస్ సొంత వ్యవహారం కాదు
### సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పోటు రంగారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో చేపడుతున్న 'ఇందిరమ్మ ఇండ్ల' కేటాయింపు ప్రక్రియ అర్హుల ప్రాతిపదికన కాకుండా, కాంగ్రెస్ పార్టీ సొంత వ్యవహారంగా మారిందని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆరోపించారు. ఇందిరమ్మ ఇండ్లను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, లేదా తమ పార్టీలో చేరిన వారికే కేటాయిస్తామని బహిరంగంగా చెప్పడం శోచనీయమని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇండ్ల కేటాయింపు ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరగాలని, గ్రామ సభల ద్వారానే అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు.

## ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు



ప్రజాపక్షం/కూకట్‌పల్లి : ఎల్లమ్మబండ ఈద్గా వద్ద ముస్లిం సోదరుల ఆధ్వర్యంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని, తాజా మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి ప్రార్థనలు నిర్వహించి, ప్రజలందరికీ మేలు జరగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రైతులకు మేలు జరిగేలా పాడిపంటలు సమృద్ధిగా పండాలని వరుణ దేవుడిని వేడుకున్నట్లు తెలిపారు. అల్లా దయతో ప్రజలందరికీ మంచి జరగాలని రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చెరువును అభివృద్ధి చేయాలని వినతి



ప్రజాపక్షం/చర్లపల్లి : మేడ్చల్ నియోజకవర్గం నాగారం డివిజన్‌లోని రాంపల్లి చెరువును అభివృద్ధి చేయాలని జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వినతి పత్రం అందజేశారు. చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణ, అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలసి ప్రధాన చెరువుల వివరాలను అందజేశారు. ప్రధానంగా రాంపల్లి చెరువుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. చెరువుల అభివృద్ధి ద్వారా భూగర్భ జలాల పెరుగుదల పర్యావరణ పరిరక్షణకు ప్రయోజనం చేరుతుందని వజ్రేష్‌యాదవ్ అన్నారు.

## కలెక్టరేట్‌లో బతుకమ్మ వేడుకలు



ప్రజాపక్షం/చర్లపల్లి : మేడ్చల్ జిల్లా విద్యాధికారి రేణుకాదేవి ఆధ్వర్యంలో మేడ్చల్ కలెక్టరేట్‌లో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ బతుకమ్మ వేడుకల్లో నాగారం, రాంపల్లి సెరినిటీ పాఠశాల స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెరినిటీ పాఠశాల కరస్పాండెంట్ నోముల జంగ్గి రెడ్డి, ముఖ్య కార్యదర్శి నోముల వసంత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణదానమే లక్ష్యంగా సేవాభావం

ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : ప్రాణాలను కాపాడే లక్ష్యంతో అనురాగ్ యూనివర్సిటీ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. జూబ్లీహిల్స్ వైటల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 200 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ వి.విజయ్ కుమార్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ సి.మల్లేష్ విద్యార్థులు, స్వచ్ఛంద సేవకుల సేవాభావాన్ని అభినందించారు. యువత సామాజిక బాధ్యతతో సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు.ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ జె.రాజేంద్ర, డాక్టర్ టి.పురుషోత్తం, పి.చిన్న శ్రీనివాస్‌రావు, శిక్షకులు టి.నవీన్, పి.వేణుగోపాల్, టి.విద్యాసాగర్, ఎన్‌సీసీ అధికారి సౌరభ్ బార్పుటే సమన్వయం చేశారు. రక్తదానంపై అవగాహన పెంపొందిస్తూ సమాజ సేవలో యువత భాగస్వామ్యాన్ని చాటిన ఈ శిబిరం విజయవంతమైంది. సహకరించిన రక్తదాతలు నిర్వాహకులు, సంస్థలకు అనురాగ్ యూనివర్సిటీ కృతజ్ఞతలు తెలిపింది

## పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ పేరుతో భూములు ఆక్రమించే యత్నం

విలేకరుల సమావేశంలో బాధితులు

ప్రజాపక్షం/దుండిగల్ : పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ పేరుతో భూములు ఆక్రమిస్తూ బడా నిర్మాణ సంస్థలకు అప్పచెపుతూ ప్రగతినగర్‌కు చెందిన దయాకర్ రెడ్డి, భూపతి రెడ్డి తదితరులు అక్రమాలకు పాల్పడుతున్నారని పోలీసులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బౌరంపేట సర్వే నంబర్ 259 బాధితులు మీడియా ముందు వాపోయారు. బౌరంపేట సర్వే నంబర్ 259 సతీష్ సొసైటీలో సయ్యద్ రాజాక్ కుటుంబ సభ్యులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ పేరుతో భూములు ఆక్రమించడం ఫేక్ డాక్యుమెంట్స్ సృష్టించి ఇతరులకు విక్రయించడం అలవాటుగా పెట్టుకున్న దయాకర్ రెడ్డి, భూపతి రెడ్డి తదితరులు 2025లో సర్వే నంబర్.259 ఐదు ఎకరాల 27 గుంటలపై కన్నేసారన్నారు. ఇందులో భాగంగా ఫేక్ డాక్యుమెంట్స్ ద్వారా అప్పటి తహసీల్దార్ మతీన్ ద్వారా ల్యాండ్ కన్వర్షన్ చేయించుకున్నారని కోర్టును ఆశ్రయించామన్నారు. కోర్టులో పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్‌కు వ్యతిరేకంగా తీర్పు వచ్చిందన్నారు. కొన్ని పార్టీ నాయకులను అడ్డం పెట్టుకొని అల్లర్లు సృష్టిస్తున్నారని, ప్రైవేట్ భూమిపై నాయకులు జెండా పాతే ప్రయత్నం చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. గత 40 సంవత్సరాలుగా మేమే పొజిషన్‌లో ఉన్నామని ఏపీ గ్లాస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి టాక్స్, విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నట్లు తెలిపారు. అధికారులు ఇరువురి డాక్యుమెంట్లు పరిశీలించాలని మేము తప్పు చేస్తున్నట్లు తేలితే స్వచ్ఛందంగా తప్పుకుంటామన్నారు. దయాకర్‌రెడ్డిపై పలు కేసులు నమోదయ్యాయని పోలీసులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. 1988లో టెనెంట్ సర్టిఫికెట్ ఉన్న పాల్పనూరు చంద్రారెడ్డి ద్వారా కొనుగోలు చేసామన్నారు. అప్పటి నుండి ఇప్పటి వరకు మేము పొజిషన్‌లో ఉన్నామన్నారు. రెండు రోజుల క్రితం ర్యాలీగా వచ్చిన సిపిఎం నాయకులు రక్షణ కోసం ఏర్పాటు చేసుకున్న సిసి కెమెరాలను ధ్వంసం చేసి ఎటువంటి సంబంధం లేని బలమూరు వెంకట్‌ను మధ్యలోకి లాగడం సమంజసం కాదన్నారు. సాదా బైనామా ద్వారా రిజిస్ట్రేషన్ సైతం చేసుకున్నామని తెలిపారు. డాక్యుమెంట్స్ పరిశీలించి తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.



# చెరువుల పరిరక్షణలో.. స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం కావాలి

హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : సమాజ శ్రేయస్సుతో పాటు పర్యావరణ పరిరక్షణలో స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం కావాలని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ కోరారు. చెరువుల పరిరక్షణ, పర్యావరణ సమతుల్యతను కాపాడడం, విపత్తుల నివారణలో ప్రభుత్వ సంస్థలతో పాటు స్వచ్ఛంద, కార్పొరేట్ సంస్థలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఐటిసి కోహినూర్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్3150 ఆధ్వర్యంలో అధ్యక్షులు రొటేరియన్ రమేష్ పటేల్, కార్యదర్శి రొటేరియన్ శాంతి పాల్ రెడ్డి నిర్వహించిన స్పీకర్ మీట్ కార్యక్రమంలో హైడ్రా కమిషనర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చెరువులు, నాలాల పరిరక్షణ, పునరుద్ధరణతో పాటు ప్రభుత్వ భూములు, పార్కులు, ప్రజావసరాల స్థలాల పరిరక్షణకు హైడ్రా తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా ఆయన వివరించారు. వర్షపు నీరు చెరువుల్లోకి చేరేలా ఇన్‌లెట్ నాలాలను అభివృద్ధి చేయడం, కాలువల్లో నీటి ప్రవాహానికి ఉన్న అడ్డంకులను తొలగించడం వంటి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వీటి వల్ల వరద ముప్పు తగ్గడంతో పాటు భూగర్భ జలాల నిల్వలు పెరుగుతాయని చెప్పారు. ప్రజాసమస్యల పరిష్కారానికి 'హైడ్రా ప్రజావాణి' విజయవంతమైన వేదికగా నిలుస్తోందని, ప్రతి సోమవారం ఫిర్యాదుల స్వీకరణతోనే తమ పనులు ప్రారంభమవుతాయని కమిషనర్ తెలిపారు. ఫిర్యాదులపై క్షేత్రస్థాయి పరిశీలన, రికార్డుల తనిఖీ, చట్టపరమైన ప్రక్రియల అనంతరం చర్యలు తీసుకుంటున్నామని, ప్రజల నుంచి వస్తున్న స్పందనే దీని విజయానికి నిదర్శనమన్నారు. ఆక్రమణల తొలగింపు ద్వారా కబ్జాదారుల చెరలో ఉన్న సుమారు 3 వేల ఎకరాల భూమిని ఈ రెండేళ్లలో కాపాడామని తెలిపారు. హైడ్రా కేవలం ఆక్రమణలను తొలగించే సంస్థ మాత్రమే కాదని, విపత్తులను ముందుగానే గుర్తించి నివారించడంతో పాటు ప్రభుత్వ ఆస్తులను కాపాడే బాధ్యతను నిర్వర్తిస్తోందన్నారు. భవిష్యత్ తరాల కోసం ప్రకృతి వనరులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందిస్తున్న సేవా సంస్థల కృషి అభినందనీయమని ప్రశంసించారు.

# ఎల్ నినో ప్రభావాల నేపథ్యంలో.. నీటి సంరక్షణకు ప్రాధాన్యత

సిఎంసి కమిషనర్ డాక్టర్ జి.సృజన



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షపాతం, నీటి లభ్యతపై పడే ప్రభావాలను దృష్టిలో ఉంచుకొని నీటిని పొదుపుగా వినియోగించాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా నిర్వహించాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) కమిషనర్ డాక్టర్ జి.సృజన సూచించారు. నీటి వృథాను తగ్గిస్తూ, శుద్ధి చేసిన మురుగునీటిని తాగునీటికి సంబంధం లేని అవసరాలకు పునర్వినియోగించే విధానాలను ప్రోత్సహించాలని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు. మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్‌టిపి) నిర్వాహకులు, సంబంధిత అధికారులు శుద్ధి కేంద్రాలను సక్రమంగా నిర్వహిస్తూ వాటి సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా శుద్ధి చేసిన నీటిని పార్కుల నిర్వహణ, మొక్కలకు నీరు పట్టడం, ల్యాండ్‌స్కేపింగ్ తదితర అవసరాలకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణాలు చేపట్టే సంస్థలు, బిల్డర్లు, డెవలపర్లు కూడా సాంకేతికంగా అనుకూలంగా ఉన్న చోట నిర్మాణ పనులకు శుద్ధి చేసిన నీటిని వినియోగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. దీనివల్ల తాగునీటిపై ఆధారపడటం తగ్గుతుందన్నారు. నిబంధనలకు అనుగుణంగానే ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. ప్రజలు రోజువారీ వినియోగంలో నీటిని పొదుపుగా వాడుతూ, లీకేజీలను వెంటనే సరిచేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గృహాలు, వాణిజ్య సంస్థలు, నిర్మాణ రంగం, ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో వ్యవహరించి, నీటి వనరులను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని, సుస్థిర సైబరాబాద్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని డాక్టర్ జి. సృజన పిలుపునిచ్చారు.

# నకిలీ లేఖలతో రిజిస్ట్రేషన్లు.. నిందితులు అరెస్టు

సూరారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు



ప్రజాపక్షం/దుండిగల్ : కుత్బుల్లాపూర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో నకిలీ అర్బన్ ల్యాండ్ సీలింగ్ క్లియరెన్స్ లేఖలను సమర్పించి వాటి ఆధారంగా ఆస్తుల రిజిస్ట్రేషన్లు చేయించిన కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఐడీఏ జీడిమెట్ల సుభాష్ నగర్‌కు చెందిన జాదవ్ సుధాకర్ (39), రియల్ ఎస్టేట్ ఏజెంట్ నకిలీ యుఎల్‌సి క్లియరెన్స్ లేఖలు తయారు చేయడంలో సిద్ధహస్తుడు, కుత్బుల్లాపూర్ హెచ్ఏఎల్ కాలనీకి చెందిన నారాయణ దాసు శివాచారి (57), ప్రభుత్వ అధికారుల సంతకాలు, ముద్రలను సేకరిస్తూ నకిలీ యుఎల్‌సి క్లియరెన్స్ లేఖలను తయారుచేసినట్లు ఆరోపణలు ఉన్నాయి, పేట్ బషీరాబాద్ సుచిత్ర దుర్గ ఎస్టేట్‌కు చెందిన చిట్టిమిల్లి బలరాం(64)ఆస్తి యజమానులకు యుఎల్‌సి క్లియరెన్స్ లేఖలు ఇప్పిస్తామని నమ్మించి, లావాదేవీలు సమన్వయం చేయడం డబ్బులు వసూలు చేయడంలో కీలక పాత్రధారి జీడిమెట్ల గ్రామ పరిధిలోని సర్వే నంబర్. 192, 193లో ఉన్న ప్లాట్లకు సంబంధించి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, అర్బన్ ల్యాండ్ సీలింగ్ అధికారి జారీ చేసినట్లుగా రెండు క్లియరెన్స్ లేఖలను సృష్టించి కుత్బుల్లాపూర్ సబ్‌రిజిస్టార్ కార్యాలయంలో సమర్పించారు. వాటి ఆధారంగా జూన్ 4న రెండు సేల్ డీడ్స్ రిజిస్ట్రేషన్ చేశారు. నకిలీ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు గుర్తించిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం అధికారులు ఆగస్టు 24న సూరారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీస్‌ల దర్యాప్తులో భాగంగా ఆస్తి యజమానులు నుండి ఆరు లక్షలు తీసుకొని క్లియరెన్స్ లేఖలు ఇప్పిస్తామని నమ్మించి నకిలీ పత్రాలు తయారు చేసినట్లు దర్యాప్తులో తేలింది. నిందితుల నుండి 17 నకిలీ యుఎల్‌సి లేఖలు, రబ్బర్ స్టాంప్‌లు, స్టాంప్ ప్యాడ్స్, గ్రీన్ పెన్, మూడు మొబైల్స్ స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితులపై క్రైమ్ నంబర్ 616/2026 అండర్ సెక్షన్ 318(4), 338, 336(3), 337, 340(2), రెడ్ విత్ 3(5), 62(2), బిఎన్ఎస్ సెక్షన్ 82 ఆఫ్ రిజిస్ట్రేషన్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సిఐ బాల రాజ్ తెలిపాడు. ఈ వ్యవహారంలో లోతైన దర్యాప్తు కొనసాగుతుందన్నారు.

# జవహర్‌నగర్‌లో సమస్యలు పరిష్కరించాలి



ఎంఎంసి కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే మల్లారెడ్డి

ప్రజాపక్షం/జవహర్ నగర్ : మేడ్చల్ నియోజకవర్గ పరిధిలోని నాగారం జవహర్‌నగర్ డివిజన్లలో ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ, సీసీ రోడ్లు, స్ట్రీట్ లైట్లు, పారిశుధ్యం తదితర మౌలిక వసతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి, నాగారం, జవహర్‌నగర్ పరిధిలోని పలు కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జవహర్‌నగర్ మాజీ మేయర్ మేకల కావ్య, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బాషావోని కొండల్ ముదిరాజ్‌లు కమిషనర్‌కు స్థానిక పరిస్థితులను నేరుగా వివరించారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ కాలనీల్లోని డ్రైనేజీ సమస్యలు, సరిగ్గా వెలగని వీధి దీపాలు, దెబ్బతిన్న సిసి రోడ్లు పారిశుధ్య లోపాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వీటిపై తక్షణమే చర్యలు తీసుకొని యుద్ధపాతిపదికన పనులు చేపట్టాలని నాయకులు కోరారు. ప్రజా సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, వీలైనంత త్వరగా ఆయా సమస్యలను పరిశీలించి తగిన పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు అల్లూరి సంగీత రాజశేఖర్, పల్లపు రవి, బీఆర్ఎస్ నాయకులు బండి నవీన్ గౌడ్ తదితర మున్సిపల్ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



ప్రజాపక్షం/కూకట్‌పల్లి : ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా, స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచించారు. శుక్రవారం కెపిహెచ్‌బి డివిజన్ మాజీ కార్పొరేటర్ మందాడి శ్రీనివాసరావుతో కలిసి వసంతనగర్, ఎన్ఆర్ఎస్ఏ కాలనీ, 9వ ఫేజ్ ప్రాంతాల్లో పర్యటించి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించారు. ఎన్ఆర్ఎస్ఏ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కాలనీ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన మాధవరం కృష్ణారావు సంబంధిత అధికారులతో మాట్లాడి, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కెపిహెచ్‌బి 9వ ఫేజ్‌లో పార్కు పనులు చాలాకాలంగా పూర్తికాకపోవడంపై అధికారులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ పర్యటనలో జిహెచ్‌ఎంసి, వాటర్ వర్క్స్ అధికారులు, డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కాలనీ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

**బతుకమ్మ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు, ఆడపడుచులు అంగరంగ వైభవంగా జరుపుకునేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులకు ఆదేశించారు. శుక్రవారం ఐడీఎల్ చెరువు (రంగధాముని చెరువు) వద్ద జరుగుతున్న బతుకమ్మ వేడుకల ఏర్పాట్లను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వేడుకలకు పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు, ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, రాష్ట్ర సంస్కృతిక వైభవానికి ప్రతీక అని పేర్కొన్నారు. మహిళలందరూ సంతోషంగా, భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకునేలా అవసరమైన ఏర్పాట్లు కల్పించడం అధికారుల బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగడాల బాబురావు, డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, వెంకటేష్, వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్యం అందించండి

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



ప్రజాపక్షం/తాండూరు : ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి సూచించారు. గురువారం పట్టణ శివారులోని మాత శిశు జిల్లా ఆసుపత్రిలో డాక్టర్లు, వైద్య సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎంఎల్ఏ పాల్గొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే ఆసుపత్రిలోని పలు వార్డులను పర్యటించి రోగులకు అందజేస్తున్న వైద్య సేవల గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు మొక్కేది ఇద్దరికేనని ఒకరు దేవుడైతే, మరొకరు వైద్యుడు మాత్రమేనని అన్నారు. తాండూరు ప్రభుత్వ ఆసుపత్రికి మంచి పేరు గుర్తింపు వచ్చేలా వైద్యులు, వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రి పేద ప్రజలకు దేవాలయం లాంటిదని ఇక్కడ వైద్యులుగా పనిచేయడం దేవుడిచ్చిన గొప్ప వరమన్నారు. ఓపి సేవలు నిర్ణీత సమయానికి ప్రారంభించాలి, రోగులు వైద్యల కోసం ఎక్కువ సేపు వేచి ఉండే పరిస్థితి రాకుండా చూడాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ వడ్డే శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ రజాక్, డిసిహెచ్ఎస్ ఆనంద్‌కుమార్, ఆసుపత్రి సూపరిండెంట్ రజాక్ మాలిక్,, ప్రజాప్రతినిధులు,ఆర్ఎంలు, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గోన్నారు.



## కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

ప్రజాపక్షం/నవాబుపేట్ : మండల కేంద్రం లోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాల కింద అర్హులైన 23 మంది లబ్ధిదారులకు చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య చెక్కులు పంపిణీ చేశారు. మొత్తం రూ.23,00,368 విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ, పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసిఎస్ చేర్మెన్ రంగారెడ్డి, సర్పంచ్ లు జగన్ రెడ్డి, సంతోష్ రెడ్డి, శ్రీధర్ రావు, ఏఎంసి డైరెక్టర్స్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంబంధిత అధికారులు, డిప్యూటీ తహసీల్దార్ నవీన్ కుమార్ రెడ్డి, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలు తొలగించాలి

ఆలయ కమిటీ మాజీ చైర్మన్ పెండెం లక్ష్మినారాయణ



ప్రజాపక్షం/శామీర్‌పేట : దేవాదాయ శాఖ భూముల్లో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను వెంటనే కూల్చివేయాలని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థాన కమిటి మాజి చైర్మన్ పెండెం లక్ష్మినారాయణ అన్నారు. శుక్రవారం శామీర్‌పేట డివిజన్ కీసర సర్కిల్ దేవరయాంజాల్ సర్వే నెంబర్ 63లో దేవాదాయ భూమిలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని శామీర్‌పేట తహశీల్దార్ శ్రీనివాస్, కీసర ఆర్డీవో వెంకట్‌రెడ్డి, కీసర డిప్యూటి కమిషనర్ రామలింగంలకు పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవరయాంజాల్ సర్వే నెంబర్ 63లో దేవాదాయ శాఖకు సంబంధించిన భూమిలో ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా భారీస్థాయిలో కన్వెన్షన్ హాల్, గోదాం, రెండు విల్లాలు నిర్మిస్తున్నారని ఆరోపించారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందని ఆవేదన చెందారు. అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై అధికారులు విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు.

## నేను బిఆర్ఎస్‌లోనే ఉన్నా...

తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి




ప్రజాపక్షం/తాండూరు : నేను బిఆర్ఎస్ పార్టీలో ఉన్నా.. బిఆర్ఎస్ కండువ కప్పుకోని ప్రతి ఊరు తిరుగుతున్నానని, రాబోయే ఎన్నికల్లో తాండూరు బిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేయడం ఖాయమని తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ధీమా వ్యక్తపర్చారు. గురువారం తాండూరు పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాండూరు ప్రజల కోసం కొట్లాడుతానని... ప్రజల పక్షాన నిలబడుతానని స్పష్టం చేశారు. తనపై జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, తనను బిఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయలేదని చెప్పుకొచ్చారు. గతంలో నిరంతరం విద్యుత్‌ను అందుకున్న రైతులు, ప్రజలు ప్రస్తుతం కరెంటు కోతలు, లోఓల్టేజి సమస్యలతో సతమతమవుతున్నారని దుయ్యబట్టారు. తాండూరు ప్రజలు ఎన్నో ఆశలతో ఎన్నుకున్న ఎంఎల్ఏ మనోహర్‌రెడ్డి ఈ ప్రాంతానికి ఏం చేశారని, తాండూరు ఆసుపత్రి ప్రాధాన్యత తగ్గించి కోడంగల్‌కు ధారాదత్తం చేస్తారని ప్రజలు కలలో కూడా ఊహించలేరని ఆరోపించారు.ఈ మిడియా సమావేశంలో మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్ సీనియర్ నాయకులు పట్లోళ నర్సిములు, శ్రీనివాస్ చారి తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ సూచనలు పాటించాలి

స్పీకర్ ప్రసాద్ కుమార్



ప్రజాపక్షం /వికారాబాద్ : ప్రకృతి విపత్తును ఎల్‌నినోను అందరం కలిసి ప్రజా ప్రభుత్వం సలహాలు, సూచనలు రైతులు పాటించాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. శుక్రవారం 97మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ రైతును ప్రభుత్వం అన్నివిధాలుగా అంగా ఉంటుందని హామీ ఇచ్చారు. సాగుకు నీటిని పొదుపు వాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్‌అనన్య, వైస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎన్నేపల్లి లోని ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన స్పీకర్ ప్రసాద్‌కుమార్ అయనకు అలయ పూజారులు స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. నియోజకవర్గంలోని ప్రజలందరు సుఖశాంతులతో ఉండాలని కోరారు.




# పిసిబిలో సంప్రదాయబద్ధంగా బతుకమ్మ వేడుకలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను సనత్‌నగర్ లోని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ప్రధాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మహిళా ఉద్యోగులు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. తొలుత దుర్గాదేవికి కుంకుమ పూజ నిర్వహించి, తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర సహజసిద్ధమైన పూలతో బతుకమ్మలను పేర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బతుకమ్మ పాటలు పాడుతూ కోలాటాలు ఆడి ఉత్సాహంగా వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ శకుంతల మాట్లాడుతూ పండుగలను పర్యావరణహితంగా జరుపుకోవాలని సూచించారు. ప్రకృతి పరిరక్షణే భావితరాల భవిష్యత్తుకు భరోసా అని పేర్కొన్నారు. అసోసియేషన్ కల్చరల్ సెక్రటరీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అరుణ మాట్లాడుతూ బతుకమ్మ నిమజ్జనం సమయంలో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు జలవనరుల్లో కలవకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలిలోని వివిధ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

# మౌంట్ బ్రోమో జాతీయ పార్కులో కార్చిచ్చు

**జకార్తా :** ఇండోనేషియాలోని జావా ద్వీపంలో ఉన్న బ్రోమో టెంగర్ సెమెరు జాతీయ పార్కులో కార్చిచ్చు ఆర్పేందుకు వెళ్లిన అగ్నిమాపక సిబ్బంది, స్వచ్ఛంద కార్యకర్తలు ప్రమాదంలో చిక్కుకున్నారు. దట్టమైన పొగ, వేగంగా వ్యాపించిన మంటల నుంచి బయటపడలేక నలుగురు మరణించగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయాన్ని అధికారులు శుక్రవారం వెల్లడించారు. తూర్పు జావాలోని ప్రొబోలింగో ప్రాంతంలో ఉన్న మెంటిజెన్, పుసుంగ్ లింగ్కర్ ప్రాంతాల్లో ఇటీవల మంటలు చెలరేగాయి. గురువారం మంటలను అదుపు చేసేందుకు జాతీయ పార్కు సిబ్బంది, అగ్నిమాపక బృంద సభ్యులు, స్థానిక స్వచ్ఛంద కార్యకర్తలు సహా 12 మంది వెళ్లారు.































Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com